

టీకాతో రక్ష


ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం టీకాల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని కలెక్టర్ వినయ్‌చంద్ అన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీజిల్స్, రూబెల్లా (ఎంఆర్) వ్యాక్సినేషన్‌ను ఆయన మంగళవారం ఒంగోలులో ప్రారంభించి మాట్లాడారు.

16 లో

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



16

ప్రకాశం

బుధవారం 2, ఆగస్టు 2017

బలి తీసుకున్న పిడుగులు

- రెండు చోట్ల నలుగురి దుర్మరణం
- యర్రబాలెం పొలాల్లో ముగ్గురు
- మృతుల్లో భార్యాభర్తలు, రైతు
- ఎర్రఓబనపల్లెలో రైతు కూలీ మృతి

3 లో




పిడుగుపాటుకు మృతి చెందిన భార్యాభర్తలు గురవయ్య, లక్ష్మి



సుబ్బారెడ్డి



రామలింగమ్మ

జిల్లాలో మంగళవారం రెండు చోట్ల పిడుగులు నలుగురిని బలితీసుకున్నాయి. వారి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపాయి. దొనకొండ మండలం యర్రబాలెం వద్ద పొలాల్లో వ్యవసాయ పనుల్లో ఉన్న భార్యాభర్తలు మోడి గురవయ్య (36), లక్ష్మి (30) వర్షం రావడంతో అక్కడ చెట్టుకింద ఏర్పాటు చేసుకున్న గుడిసెలోకి వెళ్లారు. సమీపంలోని పొలంలో పనులు చేసుకుంటున్న పులి సుబ్బారెడ్డి (60) కూడా వారి వద్దకు చేరారు. ఈ సమయంలో ఆచెట్టుపై పిడుగు పడటంతో ముగ్గురూ మృతి చెందారు. దర్శి మండలం ఓబనపల్లిలో గుంటూరు రామలింగమ్మ (75) కంది పైరులో కలుపు తీస్తూ పిడుగుపాటుకు కుప్పకూలింది.


దేవరపల్లి దళితులకు తక్షణ న్యాయం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఒంగోలు

'పర్చూరు నియోజకవర్గం దేవరపల్లిలో భూములు కోల్పోయిన దళితులకు వెంటనే న్యాయం చేయండి. సున్నితమైన సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి. కింది స్థాయిలో పొరపాట్లు జరిగితే సవరించాల్సిన బాధ్యత మంత్రులు, పార్టీ నాయకత్వంపై ఉంటుంది. దేవరపల్లి విషయంలో సమన్వయలోపం వలనే సమస్య తీవ్రమైంది. దాన్ని పరిష్కరించడమే కాదు, దళితులు సంతృప్తి చెందాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రధాన భూమిక పోషించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

మిగతా15వ పేజీలో

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- సాంఘిక సంక్షేమ మంత్రి ఆనంద్‌బాబుకు బాధ్యత
- కుల, మత భేదాలకు తావుండకూడదని వ్యాఖ్య
- బాబును కలిసిన బలరాం
- అద్దంకి విషయంలో కొత్త నిర్ణయాలు వెల్లడించని సీఎం




పగాకు

- దిగుబడి తగ్గినా పెరగని ధర
- రైతులు కోరింది కిలోకు రూ. 135
- లభిస్తున్న సగటు ధర రూ. 115
- ముగింపు దశలో పొగాకు మార్కెట్
- ఇప్పటికే దక్షిణాదిలోని ఆరు కేంద్రాల్లో పూర్తి
- వచ్చే సీజన్ పంట ఉత్పత్తిపై బోర్డు దృష్టి



15 లో

పొగాకు.. రైతుల పాలిట పగాకుగా మారింది. వరుసగా మూడో ఏడాది కూడా నష్టాలు మిగిల్చింది. పంట ఉత్పత్తి తగ్గినప్పటికీ ధర లేకపోవడం రైతులను దెబ్బతీసింది. పొగాకు వేలం ముగింపు దశకు చేరిన ప్రస్తుత తరుణంలో మార్కెట్ తీరు, కొనుగోళ్లు, రైతులకు లభించిన ధరలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఈ ఏడాది ప్రకృతి ప్రతికూలత, ఇతరత్రా కారణాలతో పెట్టుబడి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో కిలోకు రూ. 135 సగటు ధర లభిస్తేనే రైతులు గట్టెక్కే అవకాశం ఉండగా, ఇప్పటి వరకూ సగటు ధర కిలోకు రూ. 118గా ఉంది. ఇక కొనుగోళ్లు చేయాల్సిన పొగాకులో లోగ్రేడ్ అధికంగా ఉండటంతో వేలం ముగిసే నాటికి సగటు ధర కిలోకు రూ. 115 మించే అవకాశం కన్పించడం లేదు. దీంతో ఈ ఏడాది పంట వేసిన ప్రతి రైతూ నష్టపోతున్నట్లు అర్థమవుతుంది.



ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు

ఏసీబీ వలలో ఫైర్ ఆఫీసర్

- ఆసుపత్రి ఎన్‌వోసీ రెన్యువల్‌కు లంచం డిమాండ్
- రూ. 35వేలు తీసుకుంటూ పట్టుబడిన సుబ్బారావు

15 లో



మందకొడిగా ఎస్‌జీటీల కౌన్సెలింగ్

6 లో

- సర్వర్ సమస్యతో కొంత జాప్యం
- నేటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ



సుబ్బారావును విచారిస్తున్న ఏసీబీ డీఎస్పీ ప్రభాకర్, ఇతర అధికారులు

పొలం గట్లపై

మొక్కల పెంపకం

కనిగిరి: శ్రద్ధగా చేపడితే మొక్కల పెంపకం ఆదాయం తెచ్చి పెడుతుంది. రోజువారీగా కష్టపడాల్సిన పనిలేదు. వెసులు బాటుగా మొక్కలపెంకంతో ఇట్టే డబ్బులు సంసాదించవచ్చు. మెట్ట భూముల్లో గట్లపై టేకు మొక్కల పెంపకం, ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకం చేపడితే ఆదాయాన్ని పొందవచ్చు. ప్రభుత్వం ఉచితంగా నర్సరీల ద్వారా మొక్కలు సరఫరా చేస్తుంది.

పొలం గట్లపై టేకు మొక్కల పెంపకం

రైతులు తమ మెట్టభూములు, పొలాలు, గట్లపై మొక్కల పెంపకం చేపట్టాలి. టేకు మొక్కలు ఇప్పటికే కనిగిరి ప్రాంతంలో రైతులు అక్కడ, అక్కడ నాటడం ప్రారంభించారు. అయితే, పూర్తి స్థాయిలో నాటేందుకు రైతులు మానసికంగా సిద్ధం కావాలి. ముందుగా ప్రభుత్వమే మొక్కలు రైతులకు ఉచితంగా అందజేస్తుంది. టేకు మొక్కల పెంపకం ద్వా రా రైతులు 10 నుండి 15 ఏళ్లలో మంచి ఆదాయాన్ని పొందవచ్చు.



ఉపాధి హామిలో చేపట్టిన పండ్ల తోటల పెంపకం

పండ్ల మొక్కల పెంపకం

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కలు పెంపకం చేపట్టవచ్చు. మామిడి, జామ, దానిమ్మ, ని మ్మ, బత్తాయి, బొప్పాయితో పాటు మలబా రు, వేప మొక్కలు ప్ర భుత్వం అందజేస్తుం ది. మొక్కలు పెంప కంతో పచ్చదనంతో పాటు మంచి ఆదాయం పొందవచ్చు. మొ క్కలు నాటిన అనంతరం మూడేళ్ళ సంరక్షించి రైతులకు డబ్బులిస్తారు.

మొక్కలు పొందడం ఇలా..

మొక్కలు అవసరమైన రైతులు తమకు గల పట్టాదారు పాసుపుస్తకాలతో ఉపాధి జాబు కార్డు, ఆధారు కార్డు నకళ్ళతో ఎంపీడీవో లేక ఉపాధి హామీ ఏపీవోకు దరఖాస్తు చేయాలి. జిల్లా కొనుగోలు కమిటీ ఆ మొక్కలకు డబ్బు చెల్లిస్తుంది. నెలనెల ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మొక్కలు పరిశీలిస్తారు. ఉపాధిహామీలో పండ్లతోటల పెంపకంలో ముందుగా మొక్కలు నాటేందుకు ఒక్కో గుంతకు రూ. 110, ఊతకర్ర ఏర్పాటుకు రూ.7 ఇస్తారు. ఎకరంలో 70 మొక్కలు నాటవచ్చు. మొదటి ఏడాది రూ.22 వేలు, రెండు, మూడు ఏళ్ళలో రూ.25 వేల వంతున అందజేస్తారు.



పొలం గట్లపై టేకు మొక్కలు

సన్న, చిన్నకారు రైతులకు ఎకరానికి రూ 80 వేలు



భాస్కరరావు, ఏపీడీ, ఎన్ఆర్ఈజీఎస్, కనిగిరి

సన్న, చిన్నకారు రైతులకు కొండరేగు, శీతాఫలంచ, బత్తాయి, నిమ్మ మొక్కలు నాటుకునేందుకు గుంతలు తవ్వకం, ఊతకర్ర, ఎరువులు , నీరు పోయడం, సంరక్షణ వంటికు ఎకరాకు రూ.80 వేలు దాకా అందజేస్తాం. గ్రామాల్లో కి.మీకు 400 మొక్కలు ఉచితంగా, నిర్వహణా వ్యయం ఇస్తాం.

స్థలం లేకున్నా నాటవచ్చు

స్వంత స్థలం లేకపోయినా ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటవచ్చు. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటవచ్చు. రహదారికి ఇరువైపులా కిలో మీటరు దూరం, మొక్క మొక్కకు మధ్య అయిదు మీటర్లు దూరంలో చింత, నేరేడు, వేప, తంగేడు తదితర 400 అటవీ జాతి మొక్కలు నాటవచ్చు. మొదటి ఏడాది ఒక్కో మొక్కకు రూ.271లు వంతున 400 మొక్కలకు ఏడాదికి రూ1.08 లక్షలు, రెండవ ఏడాది రూ.60 వేలు, మూడవ ఏడాది రూ 58 వేలు వరకూ చెల్లిస్తారు.

నిరుపేదల్లో 'చంద్రన్న' వెలుగులు

బల్లికురవ: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాల ఆసరా కోసం ప్రవేశ పెట్టిన చంద్రన్న బీమా యోజన పథకం ఎందరినో ఆదుకుంటోంది. గతంలో నిరుపేదలు ఎవరైనా చనిపోతే ఆపద్బంధు పథకం ద్వారా సాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, రాజకీయ నేతల చుట్టూ తిరిగి లబ్ధి పొందేందుకు తీవ్ర అవస్థలు పడేవారు. అయితే, నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం గత ఏడాది ఆ్టోబరు 2 నుంచి చంద్రన్న బీమా యోజన పథకాన్ని అమలులోకి తెచ్చింది. 15 రూపాయలు చెల్లిస్తే ఎవరైనా ప్రమాద వశాత్తు చనిపోతే వారికి 45 రోజులలోపు నేరుగా ఇంటికే రూ.5 లక్షల బీమా ఇవ్వనున్నారు. అలాగే సహజ మరణం పొందితే రూ.30 వేలు ఇస్తారు. నిరుపేదల కుటుంబాలు అత్యధికంగా చంద్రన్న బీమాలో నమోదయి ఉండటం విశేషం. ఎవరైనా చనిపోతే ముందుగా అంత్యక్రియలకు రూ.5 వేలు ఇవ్వనున్నారు. అలాగే, ఈ పథకంలో నమోదయిన కుటుంబాలలోని పిల్లలు 9, 10, ఇంటర్, ఐటీఐ చదువుతుంటే ఏడాదికి రూ.12 వందల ఉపకార వేతనాన్ని ప్రభుత్వం అందిస్తున్నది. నిరుపేదలు ధీమాగా జీవించేందుకు ఈ పథకం దోహద పడుతుందని పలువురు అంటున్నారు.

జిల్లాలోని 56 మండలాల్లో చంద్రన్న బీమా యోజనలో గత ఏడాది అక్టోబరు 2 నుంచి ఇప్పటివరకు 14,45,047 కుటుంబాలు నమోదు కాబడి ఉన్నాయి. ఇప్పటివరకు ప్రమాదవశాత్తు కాని, సహజ మరణంగా గాని 4476 మంది చనిపోగా ప్రభుత్వం సిఫార్సుతో బీమా కంపెనీలు 4192 మందికి రూ.24 కోట్ల 54 లక్షల నగదును చెల్లించాయి. 90 శాతం క్లయిమ్‌లకి నగదు చెల్లింపులు జరిగాయి. ప్రమాదవశాత్తు చనిపోతే ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లింపులు జరుగుతున్నాయి. ప్రమాదాలలో కుటుంబ యజమాని చనిపోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడిన సందర్భాలు ఉన్నాయి. చంద్రన్న బీమా అలాంటి కుటుంబాలకి ఎంతో ఉపయోగపడుతున్నది. ఇప్పటివరకు బల్లికురవ మండలంలో 77 మంది చనిపోగా 70 మందికి బీమా నగదు అందింది.



- పథకం ప్రారంభించిన పది నెలల్లో అనూహ్య స్పందన
- జిల్లాలో 14.5 లక్షల కుటుంబాలు బీమాలో నమోదు
- ఇప్పటి వరకు 4192 మందికి రూ.24 కోట్ల లబ్ధి

మలసాని కాంతమ్మకి రూ.5 లక్షల బీమా

బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన మలసాని నాగేశ్వరరావు భార్య, కుమారుడు, మనుమరాలితో బైకుపై స్వగ్రామం నుండి అద్దంకి వెళుతుండగా ఈ ఏడాది మే 20న లారీ ఢీకొని చనిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన మనుమరాలు కూడా చనిపోయింది. కు టుంబ యజమాని చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డు న పడింది. చంద్రన్న బీమాలో ఈ కుటుంబం 15 రూపాయ లు చెల్లించడంతో ప్రభుత్వం అయిదు లక్షల రూపాయలు అందించింది. కుటుంబ పోషణకు బీమా నగదు ఎంతో ఉపయోగడపతుందని మృతుడి భార్య లక్ష్మీకాంతమ్మ తెలిపారు.



కూకట్లపల్లిలో నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న బీమా మి త్ర

బీమా సొమ్ము ఆ కుటుంబాన్ని ఆదుకుంది

బల్లకురవ మండలం కొప్పెరపాడు ఎస్సీ కాలనీకి చెం దిన దారా ఏసయ్య గత ఏడాది అక్టోబరు 9న బైకుపై వస్తుంటే ఆటో ఢీకొని చనిపోయాడు. ఆ యనకు భార్య, నలుగురు కుమార్తెలు, ఒ క కుమారుడు కలరు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడంతో వారు రోడ్డున పడ్డారు. మృ తుడి భార్య బుల్లెమ్మాయికి ప్రభుత్వం చంద్రన్న బీమాలో రూ.5 లక్షలు ఇవ్వగా రూ.3 లక్షలతో ఇరువురి కుమార్తెల పెళ్లిళ్లు, మరో ముగ్గురి పిల్లల పేరున రూ.50 వేల వంతున బ్యాంకు డిపాజిట్ చేసి ఉన్న రూ.50 వేలతో గే దెని కొనుక్కొని నిరుపేద కుటుంబం అందరిలాగా జీవిస్తుంది. ఇలా మండలంలో పలు గ్రామాల్లో పలు కుటుంబాలకు చంద్రన్న బీమా ఉపయోగపడుతుంది.

చంద్రన్న బీమా ద్వారా పేద కుటుంబాలకి ఆసరా



ఎంఎస్ మురళి, డీఆర్‌డీఏ పీడీ, ఒంగోలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా యోజన పథకం నిరుపేదలకు. వరం. జిల్లాలో 14.5 లక్షల కుటుంబాలు ఈ పథకంలో నమో దు అయ్యాయి. ఎవరైనా ప్రమాదవశాత్తుగాని, సహజంగా గాని మరణిస్తే వారికి 45 రోజుల్లోపే బీమా పరిహారం అందజేస్తున్నాం. ఈ పథకంలోని లబ్ధిదారులు బీమా సొమ్మును సద్వినియోగ పరచుకోవాలి.



బీమా పథకంలో రూ.5 లక్షలు పొందిన నిరుపేద కుటుంబం

బీమాలో అత్యధిక కుటుబాలు



బి.వెంకటరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్

చంద్రన్న బీమాలో దారి ద్రరేఖ కి దిగువన ఉన్న అత్యధిక కుటుంబాలు నమోదు అ యి ఉన్నాయి. 15 రూపాయలు చెల్లింపుతో ఎన్నో కుటుంబాలకి వెలుగులు నింపుతున్నాయి. ప్రతి ఏడాది అందరు రెన్యువల్ చేయించుకోవాలి.

వెంటనే సమాచారం ఇవ్వాలి



జీపీ.సుబ్బారావు, వెలుగు ఏపీఎం, బల్లికురవ

చంద్రన్న బీమాలో నమోదయిన వారు ఎ వరైనా చనిపోతే వెంటనే తమకి సమాచారం ఇ వ్వాలి. వెంటనే బీమా మి త్ర ద్వారా వారి కుటుంబాలకి అంత్య క్రియలకి వెంటనే క్లయింలు వస్తున్నాయి. ప్రభుత్వం ఆశయం ప్రజలకి ఉపయోపడుతుంది.

70 మందికి బీమా అందించాం



శ్రీవల్లి, బీమా మిత్ర, బల్లికురవ

చం ద్రన్న బీమా పథకం ప్రారంభించిన 10 నెలల్లోనే 77 మంది చనిపోగా ఇప్పటికి 70 మందికి బీమా నగదు అందించాం. నిరుపేద కుటుంబాలకి ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది.

బీమాలో నమోదు చేయించాం



పెద్దిశెట్టి రేణుక, గ్రామ సంఘం అద్యక్షురాలు, వైదన, బల్లికురవ

వైదన గ్రామంలో ఉన్న వెయ్యి కుటుంబాలను చం ద్రన్న బీమాలో నమోదు చేయించాం. ఒ క్కోక్కరు 15 రూపాయలు చెల్లించకున్నా గ్రూపుల ద్వారా అ వగాహన చేసి చం ద్రన్న బీమాలో చేర్పించాం. ప్రజలకి రాబోవు రోజుల్లో ఎంతో ఉపయోగకరం.

పిడుగుపాటుకు నలుగురి దుర్మరణం

యర్రబాలెం పొలాల్లో ముగ్గురు... దర్శిలో ఒకరు

దొనకొండ : దొనకొండ మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన గురవయ్య, లక్ష్మి దంపతులకు దాదాపు 13ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 10 ఏళ్ళ కుమారుడు గురుతేజ, 8ఏళ్ళ కుమార్తె కీర్తన ఉన్నారు. గురవయ్య కుటుంబం వారికి ఉన్న మూడెకరాల పొలంలో రెండు వేప చెట్ల మధ్య గుడిసె వేసుకున్నారు. 90సెంట్లు వంగ, మిగిలిన భూమిలో నిమ్మచెట్లు బోరు వేసుకొని సాగు చేస్తున్నారు. మంగళవారం భార్యభర్తలు పొలం పనులు చేసుకుంటుండగా కొద్దిగా వర్షం కురుసూ ఉరుములు వస్తుండటంతో గుడిసెలోకి వెళ్లి కూర్చున్నారు. సమీపంలోని 3ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని రాళ్లు వేసుకుంటున్న కురిచేడు మండలం గంగవరం గ్రామంకు చెందిన పులి సుబ్బారెడ్డి(60) గుడెసె వద్దకు చేరుకొని బయట కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఒక్కసారిగా పిడుగు చెట్టుపై పడటంతో ముగ్గురు అక్కడే కుప్పకూలిపోయారు. సమీప పొలంలో పనిచేస్తున్న రామయ్య వెళ్లి పరిశీలించగా ముగ్గురు కుప్పకూలి పడివుండటంతో వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించాడు. ముగ్గురిని దొనకొండ ప్రైవేట్ వైద్యశాలకు తర లించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మృతదేహాల తరలింపు

దంపతుల మృతదేహాలను స్వగ్రామమైన యర్రబాలెం, పులి సుబ్బారెడ్డి మృతదేహన్ని స్వగ్రామమైన గంగవరానికి బంధువులు తరలించారు. తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు, పొదిలి సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కె.అజయ్‌కుమార్, ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు ఆనందరావు, విశ్వనాథం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అనాథలైన ఇరువురు చిన్నారులు

గురవయ్య, లక్ష్మి దంపతుల మృతితో వారిద్దరి పిల్లలు గురుతేజ, కీర్తన అనాథలయ్యారు. మృతదేహాల వద్ద దీనంగా ఉనంగా ఉన్న వారిని చూసి గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. తల్లిదండ్రుల మృతితో వారు అనాథలయ్యారు. గురవయ్య తల్లి బాలమ్మకు ఇద్దరు సంతానంలో పెద్దకుమారుడు గురవయ్య, రెండవ కుమారుడు వైజాగ్‌లో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 20ఏళ్ళ క్రితం భర్త చనిపోయాడు. అనాథలైన చిన్నపిల్లలను ఏవిధంగా ఆదరించాలో అంటూ రోధిస్తోంది. బంధువుల రోదనలతో యర్రబాలెం శోకసంద్రంలో మునిగిపోయింది.



పిడుగుపడటంతో చీలిన వేపచెట్టు



తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

ఎర్ర ఓబనపల్లెలో...

ఎర్రఓబనపల్లి(దర్శి): మండలంలోని ఎర్ర ఓబనపల్లిలో మంగళవారం పిడుగుపడి ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరు రామలింగమ్మ(75) మృతిచెందింది. కందిపైరులో కలుపు తీసేందుకు కూలీపనులకు వెళ్ళింది. మధ్యాహ్నం మబ్బులు కమ్మి వర్షం ఆరంభమైంది. ఆ సమయంలో పిడుగుపడడంతో రామలింగమ్మ మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమారులు ఉన్నారు.

శోకసంద్రంలో సుబ్బారెడ్డి కుటుంబం

పడమరగంగవరం(కురిచేడు): పిడుగుపాటుకు స్థానిక పులి సుబ్బారెడ్డి(68) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు. ఇంటికి పెద్ద దిక్కు అకాల మరణాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కొద్దిసేపటి క్రితం తమతో గడిపిన తండ్రి కొద్ది క్షణాల్లోనే విగత జీవుడై కనపడటం వారిని కలచి వేస్తున్నది. తమ వెంటే ఇంటికి వస్తానని రాకుండా ఆగడమే ఆయన మృతికి కారణమయింది. తన కుమార్తె పొలం బాగుచేయడానికి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం దొనకొండ మండలం యర్రబాలెం గ్రామ పొలాలకు వెళ్ళాడు. సాయంత్రం సమయంలో వర్షం వచ్చేలా ఉంటే సుబ్బా రెడ్డి కుటుంబ సభ్యులు ట్రాక్టర్‌లో ఇంటికి వచ్చారు. చేలో ఉన్న కంప ఏరి వస్తానని సుబ్బారెడ్డి పొలంలోనే ఆగిపోయాడు. వర్షం రావడంతో యర్రబాలెం గ్రామానికి చెందిన ఇరువురితో కలసి పొలం పక్కనే ఉన్న పాకలోకి వెళ్ళాడు. పిడుగుపడి ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. సుబ్బారెడ్డిని స్వగ్రామమైన పడమర గంగవరం గ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సుబ్బారెడ్డి మృతదేహాన్ని చూడటానికి తరలి వచ్చారు. సుబ్బారెడ్డికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సుబ్బారెడ్డి మృతితో కుటుంబానికి పెద్ద దిక్కు పోయినట్లయింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వాడరేవు సముద్రతీరంలో యువకుడి ఆత్మహత్య



తీరంలో యువకుడి మృతదేహం

చీరాల : విజయవాడకు చెందిన ఓ యువకుడు వాడరేవు సముద్ర తీరంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం తీరంలో మెరైన్ ఎఎస్సై రవి, సంజీవ్‌కుమార్, దుర్గలు గస్తీలో ఉండగా యువకుడి మృతదేహం ఉండడాన్ని గమనించారు. మృతుడి జేబులో ఉన్న సూసైడ్ నోట్ ఆధారంగా అతను విజయవాడకు చెందిన సుధాకర్‌గా గుర్తించారు. సూసైడ్ నోట్‌లో తన చావుకు ఎవరూ కారణం కాదని, తానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాసి ఉంది. తన తండ్రి ఆస్థి తన సోదరీమణులకు చెందాలని అందులో రాసి ఉంది. మెరైన్ పోలీసుల సమాచారం మేరకు ఈపురుపాలెం ఎస్సై ప్రసాదు, సిబ్బంది సంఘటాస్థలంకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

10 రోజులు జైలుశిక్ష - జరిమానా

దర్శి : మద్యం సేవించి వాహనం నడుపుతున్న నిందితునికి దర్శి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.శ్రీనివాసరావు మంగళవారం పదిరోజులు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. దొనకొండలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండంగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తి పట్టుపడడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఇరువురిపై కేసు నమోదు

దర్శి:మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురి వ్యక్తులను దర్శి ఎస్ఐ ఎం.సుబ్రమణ్యం సోమవారం రాత్రి పట్టుకొని అరెస్టు చేశారు. దర్శిలో రాత్రి నిర్వహిస్తున్న తనిఖీలో భాగంగా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న వారిని బ్రీతింగ్ మిషన్‌తో పరీక్షించగా ఇరువురు మద్యం తాగడం తో కేసు నమోదు చేశారు.

కంభం ఎరువుల దుకాణంలో చోరీ

కంభం: పెద్దనల్లకాల్వ గ్రామానికి చరందిన మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఎరువుల దుకాణం నడుపుతున్నాడు. సోమవారం రాత్రి తన వ్యాపారాన్ని యధావిధిగా ముగించుకొని షాపుకు తాళం వేసి వెళ్ళాడు. మంగళవారం ఉదయం వచ్చి షాపు తాళంతీసి లోపలికి వెళ్ళగా షాపు వెనుకవైపు రేకుల షెడ్డు రేకులు ఊడదీసి షాపులోకి ప్రవేశించిన దొంగలు క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.7వేలు అపహరించారు.

వేధించిన కేసులో భర్త అరెస్ట్

పీసీపల్లి : ఆదనపు కట్నం తీసుకొని రమ్మని భార్యను వేధించిన కేసులో ముద్దాయి అయిన భర్తను పీసీపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ దుడుగు రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు కనిగిరి మండలం బల్లిపల్లి గ్రామానికి చెందిన హుసేన్‌బీని పీసీపల్లి మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన షేక్ సిద్దయ్యకు ఇచ్చి ఐదుసంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. పెళ్లైన రెండేళ్ళుబాగానే కలిసిమెలిసివున్నారు. అనంతరం అదనపు కట్నం తీసుకొని రమ్మని భార్య అయిన హుస్సేన్‌బీని సిద్దయ్య శారీరకంగా,మానసికంగా వేధిస్తూండేవాడు. జూలై 11న భార్య హుస్సేన్‌తో ఘర్షణపడి కొట్టాడు. దాంతో బాధితురాలు కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. వైద్యశాలలో ఆమె స్టేట్‌మెంట్ రికార్డుచేశారు. ఆమె ఇచ్చిన పిర్యాదుమేరకు కేసు నమోదుచేసిన పోలీసులు మంగళవారం సిద్దయ్యను అరెస్టు చేసి కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. 14 రోజులు రిమాండ్ విధించారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

● **ఎస్పీ సత్యఏసుబాబు**

టంగుటూరు: మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీస్ అధికారి బి.సత్యఏసుబాబు హెచ్చరించారు. ఎస్పీ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బెల్టుషాపులపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఎవ్వరు నిర్వహించినా ఉపేక్షించేది లేదన్నారు. రహస్యంగా ఎవ్వరైనా బెల్టు షాపులు కొనసాగిస్తుంటే పోలీస్‌వారికి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 14కిలోమీటర్లు జాతీయ రహదారి ఉందని, ఈమార్గంలో బ్లాక్‌స్పాట్స్ అంటే ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందుకు ఇతర శాఖల సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. క్రైమ్‌పై చర్చించారు. ఎస్పీ వెంట సిఐ భీమానా యక్, ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు ఉన్నారు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ ఏసుబాబు

వేర్వేరు సంఘటనల్లో ఐదుగురికి తీవ్ర గాయాలు

పొదిలి : నిమ్మవరం గ్రామంలో మంగళవారం ఇండ్లా మరియదాసు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండంగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటార్‌సైకిల్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో పొదిలి ప్రభుత్వ వైద్యశాల్లో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యద్దనపూడి : మండల పరిధిలోని గన్నవరం-యద్దనపూడి మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలూరుకు చెందిన సురేష్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గన్నవరం నుండి ట్రాక్టర్‌తో వస్తున్న సురేష్ ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. సురేష్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో యద్దనపూడి పోలీసులు చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మార్టూరు: మండలంలోని కోలలపూడి సెంటర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన జరిగింది. మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన జి. మల్లిఖార్జునరావు, గుంటూరు జిల్లా తెనాలి గ్రామానికి చెందిన వల్లెపు ఆంజనేయులు లు ద్విచక్ర వాహనాలతో ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడ్డ వారిద్దరిని నేషనల్ హైవే ఆంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పర్చూరు: విద్యుత్ షాక్‌తో వక్తికి తీవ్రగాయాలైన సంఘటన పర్చూరులోని నెహ్రూనగర్ కాలనీలో మంగవారం జరిగింది. మండలంలోని వీరన్నపాలేనికి చెందిన సంసోను కాంట్రాక్టు పనుల నేపద్యంలో విద్యుత్ మరమత్తులు చేస్తుండగా షాక్‌కు గురై కిదపడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షత గాత్రుణ్ణి చీరాల వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలు

గిద్దలూరు : మండలంలోని బురుజుపల్లి తండాకు చెందిన ఎం.చిన్నమ్మబాయి అనే మహిళ మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. మేకలు కాచుకుని జీవించే చిన్నమ్మబాయి తప్పిపోయిన రెండు మేకలను వెతికేందుకు మంగళవారం ఉదయం గ్రామ సమీప పొలాల్లోకి వెళ్లింది. అడవి పందుల బెడద కోసం ఒక పొలం చుట్టూ అనధికారికంగా వేసిన విద్యుత్ తీగలను గమనించకుండా ముందుకు వెళ్లడంతో షాక్‌కు గురై గాయపడింది. ఆమెను గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

'నీరు'పయోగం

నీటి సౌకర్యం లేని మరుగుదొడ్లు ◆ పలుచోట్ల అవసరం లేకున్నా నిర్మాణం



పాపాయిపల్లె వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

బేస్తవారపేట: స్వచ్ఛభారత్‌లో భాగంలో మండలంలో పలు పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నీటి వసతి లేకపోవటం ఒక కారణం కాగా, కొన్ని చోట్ల అవసరం లేకున్నా నిర్మించటంతో వినియోగంలో లేవు. ఇదిలా ఉండగా మరుగుదొడ్డికి చుట్టూ సిమెంట్‌తో పోసిన పలకరాయి గట్టితనం లేకపోవడంతో గట్టిగా ఏదైనా తగిలితే రంధ్రం పడుతుంది. అయితే హైదరాబాద్‌కు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కాంట్రాక్ట్‌ను కొందరు తీసుకుని మరుగుదొడ్లను నిర్మించారు. బేస్తవారపేట మండలంలో సుమారు 25కు పైగా పూర్తిచేశారు.

అవసరం లేని పాఠశాలల వద్ద కూడా నిర్మించి చేతులు దులుపుకున్నారు. ట్యాంకు నీళ్లు అందుబాటులో లేక కొన్ని చోట్ల మరుగుదొడ్లకు తాళాలు వేశారు. బేస్తవారపేట పాపాయిపల్లె పాఠశాల వద్ద గతంలో రెండు సార్లు మరుగుదొడ్లు నిర్మించారు. అయితే నీటి సౌకర్యం లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటి పక్కనే నూతనంగా మరో మరుగుదొడ్డిని వారం క్రితం నిర్మాణం పూర్తి చేశారు. అందులో ట్యాంకు కింద సిమెంట్ దిమ్మెలు పగిలాయి. దాంతో మరుగుదొడ్ల నాణ్యతపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

దివ్యదర్శన యాత్ర ప్రారంభం

రాచర్ల : రాచర్లలో మంగళవారం దివ్యదర్శనంలో భాగంగా దాదాపు 200 మంది భక్తులతో వెళుతున్న బస్సులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి లక్ష్మీదేవి, మండల జన్మభూమి కమిటీ సభ్యుడు సూరా పాండురంగారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గంగుల పోలురాజు, టీడీపీ నాయకులు పేర్ల పరమేశ్వర్‌రెడ్డి, శీలం వెంగలరెడ్డి, వై.యోగానంద్, జి.రమణారెడ్డి, సూరా పాండురంగారెడ్డి, సర్పంచ్‌లు బూపని కాశయ్య, మాజీ సర్పంచ్ పగిడి అల్లూరిరెడ్డి, వీఆర్వో ఎం.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు ఆరోగ్య కరం

బేస్తవారపేట: బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బేస్తవారపేట పట్టణంలోని 45 అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వలన ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లి గర్భం దాల్చిన సమయం నుంచి తగు జాగ్రతలు పాటించాలని అందుకు అంగన్‌వాడీ కేంద్రంలో లభిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. బిడ్డకు ముర్రులు తాగించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ఎ.పుల్లమ్మ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మహిళలకు రక్తదానం

గిద్దలూరు : వివిధ వ్యాధులతో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులలో చేరిన ముగ్గురు మహిళలకు దాతల సహకారంతో యువాకేర్ సేవాసంస్థ మంగళవారం రక్తదానం చేయించి ఆదుకుంది. మహాలక్ష్మి అనే గర్భిణికి, చంద్రమ్మ, పద్మావతి అనే మహిళలకు పఠాన్ యాకుబ్ ఖాన్, డిగ్రీ విద్యార్థి ఎం.వివేక్, శ్రీకాంత్‌రెడ్డి రక్తదానం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్‌ఉద్దీన్ తెలిపారు. రక్తం అవసరమైన వారు, ఉచితంగా రక్తదానం చేసేవారు 7386642536 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

బేస్తవారపేట: కూలీలు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని బేస్తవారపేట క్లస్టర్ ఏపీడీ నాగమల్లేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కూలీలు వారికి సంబంధించిన బ్యాంకులలో జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని లేకుంటే కూలి డబ్బులు అకౌంట్‌లో జమకావని అన్నారు. ఏపీవో బెల్లంకొండ కిషోర్ కుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ఏర్పాటు చేసి ఆధార్ నెంబర్లు సేకరించి జాబ్‌కార్డులకు అనుసంధానం చేస్తున్నామని అన్నారు. 2న చెట్టిచెర్ల, పందిళ్లపల్లె, 3న బేస్తవారపేట, నేకునాంబాద్, 4న సలకలవీడు, చిన్న ఓబినేనిపల్లె, 5న పెద్దఓబినేనిపల్లె, పిటికాయగుళ్ళ, 7న జె.సి.అగ్రహారం, బసినేపల్లె, 8న ఖాజీపురం, ఎం.పి.చెరువు, 9న అక్కపల్లె, మోక్షగుండం, 10న పి.వి.పురం, గలిజేరుగుళ్ళ, 11న కోనపల్లె పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నల్లగుంట్లలో 'పొలం పిలుస్తుంది'

కొమరోలు : మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ రైతులకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు





తిరుమలలో కుటుంబసభ్యుల మధ్య అన్నా జన్మదిన వేడుకలు, గిద్దలూరులో అన్నా కార్యాలయం వద్ద దుస్తులు పంపిణీ చేస్తున్న అభిమానులు

గిద్దలూరు టౌన్ : మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు 54వ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు గిద్దలూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండపేట ఆంజనేయస్వామి దేవాలయంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఆవులమంద శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు పాముల వెంకటరమణ, షేక్ మస్తాన్‌వలి, మేకల బయ్యన్న యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్యులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ శివపురం ఆంజనేయులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కోటా నరసింహులు, అమ్మవారిశాల అధ్యక్షుడు మునగనూరి సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు కలువా సుబ్బారావు, సోమిశెట్టి రంగారావు, పరుచూరి నాగేశ్వరరావు, బాదం వెంకటేశ్వర్లు, తిరువీధి వెంకటేశ్వర్లు ఉన్నారు. అన్నా రాంబాబు కార్యాలయం వద్ద మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోట నరసింహులు కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుస్తులు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం భాస్కర్‌రెడ్డి, ముద్దర్ల శ్రీనివాసులు, పగడాల వెంకటేశ్వర్లు, బాలచెన్నయ్య, ముప్పూరి చంటి ఉన్నారు.

తిరుమలలో జరుపుకున్న అన్నా రాంబాబు

అన్నా రాంబాబు తన 54వ పుట్టిన రోజును తిరుమలలో జరుపుకున్నారు. తాను బస చేసిన హోటల్‌లో కుటుంబసభ్యుల మధ్య అన్నా రాంబాబు కేక్ కట్ చేశారు.

బేస్తవారపేట మండలంలో...

బేస్తవారపేట మట్టావారి కాంప్లెక్స్ వద్ద అన్నా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంభం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మట్టా రమేష్, పి.భూపాల్‌రెడ్డి, బి.అరుణ్‌కుమార్, అమృతరాజ్, యామా శ్రీనివాసులు, టి.రజనీకాంత్, తిప్పిశెట్టి పవన్‌కుమార్, తోటకూరి దివాకర్ పాల్గొన్నారు.

అర్ధవీడు మండలంలో...

అర్ధవీడు మండలంలో మంగళవారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్ధవీడు మండల టీడీపీ నాయకుడు, నూర్‌బాషా సంఘం నాయకులు డి.మౌలాలి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో శ్రీరాములరెడ్డి, అన్నా రాంబాబు వర్గీయులు పాల్గొన్నారు.

కొమరోలు మండలంలో...

కొమరోలులో నాలుగు రోడ్ల కూడలి వద్ద అన్నా జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సారె వెంకటనాయుడు, చింతలపల్లె సర్పంచ్ సారె జనార్దన్‌నాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

కంభం మండలంలో...

కంభం పట్టణంలో ఎంపీపీ కొత్తపల్లి జ్యోతి శ్రీనివాస్ అపార్ట్‌మెంట్ ఆవరణలో అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు జరిగాయి. అఖిల భారత శ్రీశైలం, కాణిపాకం నిత్యాన్నదాన సత్రాల అధ్యక్షుడు గోళ్ళ సాంబశివరావు కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సయ్యద్ జాకీర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తట్టు, రూబెల్లా టీకాలు



సంజీవరాయునిపేటలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గిద్దలూరు : పట్టణంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని తహసీల్దార్ జి.విజయలక్ష్మి ప్రారంభించగా జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ డాక్టర్ సురేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. కాగా సంజీవరాయునిపేట పీహెచ్‌సీలో డాక్టర్ గౌషియా ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం కాగా జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎం.ఆర్.సుధారాణి, జి.హుస్సేనమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కంభం: కంభం వాసవీ విద్యాసంస్థలోని విద్యార్థులకు వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది తట్టు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, వాసవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ళ సుబ్బరత్నం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు: ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో మంగళవారం విద్యార్థినులకు రూబెల్లా టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కామూరి అమూల్య, వైద్యాధికారిణి డాక్టర్ ఆశాలత, కొమరోలు గ్రామసర్పంచ్ అబ్దుల్ ఖాదర్, మనోజ్ చారిటబుల్ ట్రస్టు వైస్‌చైర్మన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



కంభంలో వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్యసిబ్బంది



కొమరోలులో టీకా వేస్తున్న డాక్టర్ ఆశాలత

సినిమాలు

గిద్దలూరు

కృష్ణ	- గౌతమ్‌నంద
శ్రీనివాస	- వాసుకి
వెంకటేశ్వర	- ఫిదా
నటరాజ్	- డిజె

వాటర్‌షెడ్ నిధులు స్వాహా!

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా ఎక్కడ ఎటువంటి అవకాశం ఉన్నా... వాటిద్వారా ప్రభుత్వ సొమ్మును ఎలా కొల్లగొట్టాలని అక్రమార్కులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కోట్ల రూపాయలు నిధులు కొల్లగొట్టినట్లు సామాజిక తనిఖీల్లో బహిర్గతమవుతుండగా పుల్లలచెరువు మండలంలో మరో స్వాహాపర్వం బయటపడింది. ఇప్పటివరకు జరిగిన అక్రమాలకు ఇది భిన్నమైంది. ఈ ఏడాది మార్చితో గడువు ముగిసి క్లోజ్ చేసిన వాటర్‌షెడ్ నిధులను ఎవరికీ తెలియకుండా జూన్, జూలై నెలల్లో బిల్లులు చేసి ఏకంగా 7లక్షల 31వేల 795 రూపాయలను పలువురు లబ్ధిదారుల ఖాతాలకు మళ్లించారు.

- **ఆఫీస్ లాగిన్‌తో ఖాతాలకు రూ.7లక్షలు మళ్లింపు**
- **అధికారుల చేతివాటం**
- **విషయం బయటకు రావటంతో రిక'వర్రీ'**

ఎర్రగొండపాలెం రూరల్: పుల్లలచెరువు మండలం ముటుకుల వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ కాలపరిమితి మూడేళ్లు పూర్తి అవటంతో మార్చినెల నుండి దానిని క్లోజ్ చేశారు. అందులో ఇక ఎటువంటి పనులు చేయటానికి వీలులేదు. ఇదే వాటర్ షెడ్ పరిధిలోని మర్రివేముల గ్రామంలో పలు పనులకు సంబంధించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ముఖ్యంగా హార్టికల్చర్ కార్యక్రమాల్లో మొక్కలు లేకుండానే కోట్ల రూపాయల నిధులు స్వాహా చేశారు. దీనితోపాటు పంట సంజీవని కుంటల నిర్మాణంలో కూడా అక్రమాలు జరిగి యంత్రాలు ఉపయోగించినట్లు ఫిర్యాదులు చేయటంతో అధికారులు విచారణ జరిపి అందులో వాస్తవాలు ఉన్నట్లు గుర్తించి వాటర్‌షెడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని తొలగించారు. ఇతనిని తొలగించిన తరువాత కూడా అధికారులతో కలిసి తన అక్రమాలను యధేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. ఇందులో భాగంగా ఇప్పుడు వెలుగుచూసిన బాగోతం ఇది.

మర్రివేములలోని పలువురు రైతుల ఖాతాల్లో హార్టికల్చర్ కార్యక్రమానికి గాను దాదాపు 15మంది ఖాతాలకు జూన్ 3 నుంచి జూలై 9వ తేదీ మధ్య 7లక్షల 31వేల795 రూపాయలను మళ్లించారు. మార్చినెలతో వాటర్ షెడ్ గడువు ముగిసింది కదా మరి నిధులు ఎలా వచ్చాయని అడిగితే తొలగించబడ్డ వ్యక్తి అధికారులకు తెలియకుండా ఆఫీసులాగిన్ ఉపయోగించి నిధులు ఖాతాలకు మళ్లించినట్లు చెబుతున్నారు. అతను చేస్తే బిల్లులు ఖాతాలకు రావాలంటే అధికారికంగా 'కీ' ఇవ్వాలికదా? అది అధికారులు ఇచ్చిందేకదా అంటే దానికి సమాధానం లేదు. ఇదంతా బయటకు రాదనుకుని అధికారులు, తొలగించబడ్డ వ్యక్తి కలిసి చేసిన పని అని పలువురు ఆరోపిస్తున్నారు. విషయం బయటకు రావటంతో ప్రాజెక్ట్ అధికారులు వెంటనే సదరు వ్యక్తిని పిలిపించుకుని అప్పటివరకు ఖాతాల్లోకి వచ్చిన నగదును వారి ద్వారా తెప్పించుకుని జిల్లా అధికారులకు వాస్తవం వివరించుకుని నిధులు రికవరీ చేస్తున్నట్లు నచ్చజెప్పుకున్నారు. ఇంకా ఖాతాల్లోకి రాకుండా ఉన్న నగదును ముందుగానే నిలిపివేశారు. ఇంత జరగటానికి గతంలో పనిచేసిన వ్యక్తితో అధికారులకు ఉన్న లాలూచీ, అక్రమాలకు అలవాటుపడ్డ వారి నైజంతోపాటు ఎంత వచ్చినా మీ వాటా పోగా మిగిలింది మాకు ఇస్తే చాలనుకునే లబ్ధిదారులు వెరసి ప్రభుత్వ నిధులు అప్పనంగా ఈ గ్రామంలో కాజేస్తున్నారు.

ఖాతాలకు నగదు వచ్చిన వారి వివరాలు

హౌస్‌హోల్డ్‌కోడ్	పేరు	నగదు
1210201005010479	వెంకటకృష్ణారెడ్డి	45,840
1210201005010482	శివలక్ష్మి	1,30,556
1210201005010743	శిరీషాదేవి	1,44,500
1210201005010501	వెంకటనారాయణ	58,300
1210201005010480	మంగమ్మ	45,840
1210201005010352	మస్నెమ్మ	51,158
1210201005010742	సీతారావమ్మ	86,700

వసతులు ఫుల్...ఆపరేషన్లు నిల్

- **నిలిచిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు**
- **అవస్థలు పడుతున్న ప్రజలు**
- **పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ**

అద్దంకి: కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నా... అత్యధిక శాతం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. అద్దంకి క్లష్టర్ పరిధిలో 6 పీహెచ్‌సీలు ఉండగా ఏ ఒక్కచోట కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. దీంతో ప్రయివేటు వైద్యశాలలను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కా భవనాలు, అన్నింటికి మించి ఆధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నా అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి.

అద్దంకి క్లష్టర్ పరిదిలో పరిధిలో మోదేపల్లి, కొరిశపాడు, మేదరమెట్ల, ప్రాసంగులపాడు, పంగులూరు, మారెళ్ళలో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క పీహెచ్‌సీ పరిధిలో కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. ఇక అద్దంకి కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచిపోయి ఏడాది దాటిపోయింది. పాత భవనం మరమ్మతుల పేరుతో నిలిచిపోయిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ఇంకా ప్రారంభం కాలేదు. అద్దంకిలో గతంలో నెలకు సరాసరిన 30 నుండి 40 వరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసేవారు. ప్రత్యేక క్యాంప్‌లు పెట్టినప్పుడైతే పెద్ద ఎత్తున బటన్ హోల్ ఆపరేషన్ లు జరిగేవి.



ఏళ్ళ తరబడి తాళాలు తీయని మోదేపల్లి పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

బల్లికురవ మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీలో మూడు నెలలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచి పోయాయి. రూ.75 లక్షలతో అధునాతన భవనాన్ని, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటుచేశారు. వైద్య ఆరోగ్య శాఖ, సిబ్బంది నిర్లక్ష్యంతో గత మూడు నెలల నుండి ఇక్కడ ఆపరేషన్లు జరగడం లేదు. సీనియర్ వైద్యాధికారిణి ఉండి కూడా ఆపరేషన్లు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మోదేపల్లి పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ తలుపులు ఏళ్ల తరబడి తీయకపోవటంతో గది కూడా బూజు పట్టి పోయింది. ఇక ప్రాసంగులపాడులో ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. కొరిశపాడు, మేదరమెట్లలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేసేందుకు శిక్షణ పొందిన వైద్యులు లేరు.

అద్దంకి క్లష్టర్ పరిధిలో అద్దంకి సీహెచ్‌సీతో పాటు 6 పీహెచ్‌సీలు ఉన్నా ఏ ఒక్కచోట కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగక పోవటంతో బాలింతలు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఒంగోలు వెళ్ళాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధిక వ్యయం అయినా స్థానికంగానే ప్రయివేటు వైద్యశాలల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేయించుకుంటున్నారు. దీంతో కనీసం పది వేల నుండి 15 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని పీహెచ్‌సీలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అలంకారప్రాయంగా అద్దంకి సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

వారం రోజుల్లో ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం

డాక్టర్ నాగభూషణం, వైద్యాధికారి, సీహెచ్‌సీ, అద్దంకి



పాత భవనం మరమ్మతులు పూర్తయ్యాయి. ఆపరేషన్ థియేటర్ కూడా సిద్ధ అయ్యింది. టెస్టింగ్‌కు ల్యాబ్‌కు పంపించగా రిపోర్టు కూడా వచ్చింది. వారం రోజులలో మరలా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం.

కాగితాలకే పరిమితమైన కంభం-ప్రొద్దుటూరు రైలుమార్గం

కంభం: కంభం - ప్రొద్దుటూరు, ఒంగోలు - దొనకొండ మార్గాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పశ్చిమప్రాంత వాసులకు నేటికీ సింగిల్‌లైన్ ట్రాకే దిక్కు. అదికూడా గుంటూరు, గుంతకల్ మార్గంలో ఉన్న ప్రాంతాలే. ఈ నేపథ్యంలో కంభం - ప్రొద్దుటూరు, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ల ప్రతిపాదనలు ఉనికిలోకి వచ్చాయి. వాటి ప్రతిపాదనలో నడికుడి - శ్రీకాళహస్తి మార్గానికి అధికారుల్లో కదలిక వచ్చి భూసేకరణ చేస్తున్నా కంభం - పొద్దుటూరు మార్గం మాత్రం ప్రతిపాదనలోనే ఉంది. జిల్లా మొత్తం మీద తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో రెండు రైల్వే లైన్లు మాత్రమే ఉన్నాయి. మొదటిది విజయవాడ - చైన్నై మార్గం కాగా, రెండవది గుంటూరు - గుంతకల్ లైన్. విస్తీర్ణపరంగా ఈ రెండు చాలా దూరంలో ఉన్నాయి. కానీ ఈ రెండింటిని కలిపేలా రైల్వేమార్గం లేకపోవడంతో ప్రయాణికులకు రోడ్డుమార్గమే దిక్కైంది.

ఇదిలా ఉంటే 1997 - 98లో రైల్వేశాఖ శ్రీకాళహస్తి - నడికుడి రైల్వే మార్గానికి అనుమతులు రావడంతో కేంద్ర అధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్ ఇప్పటికే భూ సర్వేను పూర్తిచేశారు. అయితే, ప్రకాశం - కడప జిల్లాల మధ్య రవాణా మెరుగుపరచడం కోసం కంభం నుంచి ప్రొద్దుటూరు వరకు రైలు మార్గం నిర్మించాలని రైల్వేశాఖ అధికారులు పది సంవత్సరాల క్రితం అంచనాలు రూపొందించారు. ఈ అంశాన్ని రైల్వే బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించారు. అక్కడితోనే అది ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటికి రెండుసార్లు కంభం-ప్రొద్దుటూరు రైలు మార్గానికి సర్వే చేశారు. మొదటిసారి కంభం నుంచి బేస్తవారిపేట పట్టణం మీదుగా రైలేమార్గం వెళ్లేలా ప్రతిపాదనలు పంపగా దీనిపై అక్కడి ప్రజలలో వ్యతిరేకత రావడంతో రెండవసారి బేస్తవారిపేట ఊరి చివరన కొండల పక్క నుంచి వెళ్ళేలా సర్వే చేశారు. ఈ అంశాన్ని రైల్వే బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించారు. అక్కడితోనే అది ఫుల్‌స్టాప్ పడింది.

ఇదిలాఉంటే నాలుగు సంవత్సరాల క్రితం రైల్వేశాఖ కంభం నుంచి ప్రొద్దుటూరు, గిద్దలూరు నుంచి ప్రొద్దుటూరు రైలుమార్గం నిర్మిస్తే ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు విజయవాడకు చెందిన రైల్వే ఉన్నతాధికారులు సర్వే చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం కంభం నుంచి ప్రొద్దుటూరు మార్గమే ఉత్తమమని నిర్ధారించారు. ఇప్పటికీ ఎలాంటి అడుగు ముందుకుపడలేదు.

సొంతింటి కల సాకారమవుతున్న వేళ

- **భారీగా మంజూరైన ఎన్‌టీఆర్ గృహాలు**
- **భూమిపూజ కార్యక్రమాలతో ఊపందుకున్న నిర్మాణాలు**

రాచర్ల : పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కల నెరవేరుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌టీఆర్ గృహాలు మంజూరు కావడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతుంది.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో ఇళ్లు లేని వారిని గుర్తించి, ఎంపిక చేసి గృహాలు మంజూరు చేయించారు. మండలంలో 2వ ఫేజ్ కింద 340 గృహాలు మంజూరయ్యాయి. ఆకవీడు, రాచర్లకు దాదాపు 50 గృహాలు కేటాయించారు. ముఖ్యంగా ప్రభుత్వం శ్రావణమాసంలో ఈ గృహ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. దీంతో అధికార యంత్రాం ఆ పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఆకవీడు, సోమిదేవిపల్లి, కాలవపల్లి, గౌతవరం గ్రామాల్లో గృహ నిర్మాణాలకు భూమి పూజ చేసే కార్యక్రమం హౌసింగ్ ఏఈ షేక్ ఖదీర్‌భాషా దగ్గర ఉండి జరిపిస్తున్నారు.

2016-17 సంవత్సరంలో 193 ఎన్‌టీఆర్ గృహాలు మంజూరు కాగా 68 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 2017-18లో 183, గృహాలు మంజూరు కాగా ఒక్కొక్క గృహానికి రూ. 1.50 లక్షలు ప్రభుత్వం అందచేస్తుండడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేట్టేందుకు ముందుకు వస్తున్నారు.

నిర్మించుకున్న వారికి వెంటనే బిల్లులు..

ఇళ్లను నిర్మించుకున్న వెంటనే బిల్లులు చెల్లిస్తాం. ఇందులో ఎటువంటి జాప్యం జరగదు. గ్రామాల్లో భూమిపూజలు చేసి, నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని చెబుతున్నాం.

- షేక్ ఖదీర్‌భాషా, హౌసింగ్ ఏఈ, రాచర్ల

మందకొడిగా ఎస్‌జీటీల కౌన్సెలింగ్

ఒంగోలు విద్య: జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ మంగళవారం మందకొడిగా సాగింది. సోమవారం వెయ్యి మంది ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ రాత్రి ఏడు గంటలకే పూర్తికాగా, మంగళవారం రాత్రి 9గంటల వరకు కొనసాగింది. మంగళవారం 1801 నుంచి 2800 ర్యాంకు వరకు ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. మార్కాపురం, గిద్దలూరు, పామూరు, ఇతర సుదీర ప్రాంతాల నుంచి ఉదయం ఆరు గంటలకే కౌన్సెలింగ్ జరిగే పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలు వద్దకు ఉపాధ్యాయులు చేరుకున్నారు. కౌన్సెలింగ్ ఉదయం ఏడు గంటలకే ప్రారంభమైనా సర్వర్ సమస్యతో జాప్యం జరిగింది. స్పౌజ్ పాయింట్లతో కోరుకొనే వారి విషయంలో ఒకటి అరా స్వల్ప వివాదాలు మినహా ప్రశాంతంగా ముగిసింది.

నేటితో పూర్తి కానున్న ప్రక్రియ

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. బుధవారం మొత్తం 2801 నుంచి చివరి ర్యాంకు వరకు అందరికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ ర్యాంకుల మధ్య కేవలం 170 మంది ఉపాధ్యాయులు మాత్రమే తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వారు ఉన్నారు. మిగిలిన వారందరూ అభ్యర్థన మేరకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నవారే. బుధవారం ఉదయం ఆరు గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. 2801 ర్యాంకు నుంచి 3570 ర్యాంకు వరకు మధ్యాహ్నం రెండు గంటల లోపు నిర్వహిస్తారు. అర్ధగంట భోజన విరామ స మయం ముగిసిన తర్వాత రెండున్నర నుంచి 3571 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థన మేరకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు హాజరుకాకపోయినా ఇబ్బంది లేదని డీఈవో చెప్పారు. స్థానాలు కోరుకొనే వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.



కౌన్సెలింగ్ హాల్‌లో ఉన్న ఉపాధ్యాయులు

జిల్లాలో 2.8 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 2.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పీసీపల్లిలో 17.2, యద్దనపూడిలో 15.4, పర్చూరులో 13.2, చీరాలలో 10.6, కందుకూరులో 10.2, వలేటివారిపాలెంలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

భాషా పండితులకు ఉద్యోగోన్నతులు

ఒంగోలు విద్య: జిల్లాలోని భాషా పండితులకు స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నట్లు డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత డీఈవో పూల్‌లో ప్రస్తుతం గ్రేడ్-2 తెలుగు భాషా పండితులు 59 మంది, హిందీ భాషా పండితులు 39 మంది ఉన్నారు. వీరందరికి పాఠశాలల్లో స్థానాలు కల్పించేందుకు ఉన్నత పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ అయిన భాషా పండితుల పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న గ్రేడ్-2తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పండితులకు పదోన్నతులు కల్పించనున్నట్లు డిఇఓ తెలిపారు. ఈనెల 5తేదీలోపు వీరందరికి అప్‌గ్రేడ్ అయిన పోస్టుల్లో పదోన్నతులు ఇవ్వమని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వీరికి పదోన్నతులు ఇచ్చేందుకు సీనియారిటీ జాబితాను రూపొందించి డీఈవో ప్రకాశం.నెట్ వెబ్ సైట్‌లో ఉంచినట్లు డీఈవో తెలిపారు. ఈ ప్రాథమిక సీనియారిటీ జాబితాలపై ఎవ్వరికైనా అభ్యంతరాలు ఉంటే బుధవారం సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రాతపూర్వకంగా తగు ఆధారాలతో తెలియజేయాలని విజయభాస్కర్ కోరారు.

161 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు

రూ.2.41 కోట్ల అంచనా వ్యయం

ఒంగోలు విద్య: జిల్లాలోని 161 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో బి. విజయభాస్కర్ తెలిపారు. రూ.2.41 కోట్ల అంచనా వ్యయంతో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటుచేస్తున్నారు. ఈ మొత్తంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నిధుల నుంచి రూ.1.69 కోట్లను సర్దుబాటు చేస్తారు. మిగిలిన రూ. 72.45 లక్షలను జిల్లా మినరల్ ఫౌండేషన్ ఫండ్స్ నుంచి కలెక్టర్ సమకూరుస్తారు. డిజిటల్ తరగతి గదుల ఏర్పాటును పారదర్శకంగా ఈ టెం డర్ ద్వారా పనులను అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటిగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మంజూరుచేసే నిధుల వ్యయం చేసిన తరువాత జిల్లా మినరల్ ఫౌండేషన్ (డీఎంఎఫ్) నిధులను వ్యయం చేయమన్నారు. డీఎంఎఫ్ ఫండ్ నిధుల కోసం ప్రత్యేకంగా జాతీయ బ్యాంకులో ఖాతా తెరవాలని, నగదు పుస్తకం కూడా ప్రత్యేకంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డీఎంఎఫ్ ఫండ్స్ నుంచి ఎటువంటి అడ్వాన్సులు మం జూరు చేయరని, పనిపూర్తయిన తరువాతే మొత్తం అమౌంట్ విడుదల చేస్తారని తెలిపా రు. డిజిటల్ తరగతి గదుల ఏర్పాటుకు పరిపాలనా పరమైన మంజూరు లభించిన తరువాత ఏడాది లోపు పనులు పూర్తి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంజూరైన పాఠశాలలు ఇవి

జిల్లాలో మొత్తం 161 పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు మంజూరయ్యాయి. ఒక్కో తరగతి గది ఏర్పాటుకు రూ.1.50లక్షలు వ్యయం చేస్తారు. కాగా, యర్రగొండపాలెం మండలం లో 4 ఉన్నత పాఠశాలకు, పుల్లలచెరువు మండలంలో 3, త్రిపురాంతకం మండలంలో 5, కురిచేడు మండలంలో 5, దొనకొండమండలంలో 5, పెద్దారవీడు మండలంలో 4, దోర్నాల మం డలంలో 4, అర్ధవీడు మండలంలో 5, మార్కాపురం మండలంలో 6 పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు మంజూరయ్యాయి.

అలాగే, తర్లుపాడు మండలంలో 7, కొనకనమిట్ల మండలంలో 3, పొదిలి మండలంలో 4, దర్శిమండలంలో 7, ముండ్లమూరు మండలంలో 1 , తాళ్ళూరు మండలంలో 5, అద్దంకి మండలంలో 4, బల్లికురవ మండలంలో 7, సంతమాగులూరు మండలంలో 4, చీరాల మండలంలో 2, మార్టూరు మండలంలో 1, వేటపాలెం మండలంలో 1, జె.పంగులూరు మండలంలో 4, ఇంకొల్లు మండలంలో 1, కొరిశపాడు మండలంలో 3 పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు మంజూరయ్యాయి.

అదేవిధంగా, మద్దిపాడు మండలంలో 1, చీమకుర్తి మండలంలో 4, మర్రిపూడి మండలంలో 2, కనిగిరి మండలంలో 4, హెచ.ఎం.పాడు మండలంలో 3, బేస్తవారిపేట మండలంలో 3, కంభంమండలంలో 3,గిద్దలూరు మండలంలో 5, కొమరవోలు మండలంలో 2, సి.ఎస్‌పురం మండలంలో 3, వెలిగండ్ల మండలంలో 3, పెద చెర్లోపల్లి మండలంలో 5, పొన్నలూరు మండలంలో 2, కొండపి మండలంలో 1, సంతనూతలపాడు మండలంలో 3, నాగులుప్పలపాడు మండలంలో 2, చినగంజాం మండలంలో 1, టంగుటూరు మండలంలో 2, జరుగుమల్లి మండలంలో 4, వలేటివారిపాలెం మండలంలో 2, పామూరు మండలంలో 3, లింగసముద్రం మండలంలో 2, ఉలవపాడు మండలంలో 2, గుడ్లూరు మండలంలో 1, సింగరాయకొండ మండలంలో 3 ఉన్నత పాఠశాలలకు డిజిటల్ తరగతి గదులు మంజూరయ్యాయి.

డీఈవో పూల్ టీచర్లు ఎంఈవో ఆధీనంలో ఉండాలి

ఒంగోలు విద్య: జిల్లాలో కోరుకొనేందుకు స్థానాలు లేక డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు వారు పనిచేస్తున్న మండల విద్యాధికారిని సంప్రదించి ఆయన ఆధీనంలో ఉండాలని డీఈవో బి.విజయభాస్కర్ తెలిపారు. డీఈవో పూల్‌లో ప్రస్తుతం 59 మంది తెలుగు పండితులు, 39 మంది హిందీ పండితులు, 15 మంది పీఈటీలు, నలుగురు ఫిజికల్ సైన్స్ స్కూలు అసిస్టెంట్లు ఉన్నారు. రెండు, మూడు రోజుల్లో డీఈవో పూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికి స్థానాలు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు.

కాగా, ఎస్‌జీటీ ఉర్దూ టీచర్ల బదిలీల కౌన్సిలింగ్ కూడా మంగళవారం ముగిసింది. బదిలీ కోసం మొత్తం 132 మంది ఎస్‌జీటీ ఉర్దూ టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి ఉదయమే కౌన్సెలింగ్ నిర్వహించి పంపించినట్లు డీఈవో తెలిపారు.

విద్యాశాఖ అధికారులకే ఎస్ఎస్ఏ పీవో పోస్టులు

ఒంగోలు విద్య: సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారులుగా పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్లు, ఉపవిద్యాధికారులను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు స్కూలు ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వాములు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పద్మకుమారి, జ్ఞానేశ్వరరరావు, కోశాధికారి జగన్మోహనరాజు తెలిపారు. ప్రాజెక్టు అధికారులుగా ఇతర శాఖల వారిని నియమిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. తమ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని ఎస్ఎస్ఏ పీవోలుగా ఏడీలు, డిప్యూటీ ఈవోలను నియమించేందుకు ప్రతిపాదనలు పంపిన కమిషనర్‌కు కృతజ్ఞతలుతెలిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై 23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్,వైద్య రంగాలవారికి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సీపీఎస్ నుంచి వీఆర్వోలను మినహాయించాలి

- **12న ఒంగోలులో ప్రాంతీయ సదస్సు**
- **సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ**

ఒంగోలు కలెక్టరేట్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సిపిఎస్) స్కీం నుంచి గ్రామ రెవెన్యూ అధికారులను మినహాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ కోరారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ప్రాంతీయ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థాక వీఆర్వోల సంఘ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఈనెల 12వ తేదీన ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ప్రధానంగా సీపీఎస్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, వీఆర్వోల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ

ప్రాంతీయ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాత సర్వీసును పరిగణలోకి తీసుకొని సీపీఎస్ విదానం నుంచి వీఆర్వోలను తప్పించాలన్నారు. మరో వైపు వీఆర్వోల పదోన్నతులు కూడ పెండింగ్‌లో ఉన్నాయని, ఆ సమస్యలను కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము మాట్లాడుతూ జిల్లాలో వీఆర్వోలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యల పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే 176 మంది వీఆర్వోల సర్వీస్ రెగ్యూలరైజ్‌తో పాటు కారుణ్య నియామకాలు, పెండింగ్ ఇంక్రిమెంట్లు వంటి సమస్యలు పరిష్కారం అయ్యాయని, ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్న వీఆర్వోలకు పదోన్నతులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వీఆర్వోలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందులనుంచి అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రతి అంశానికి వీఆర్వోను బాధ్యులను చేయడం తగదన్నారు. వీఆర్వోలకు కూడా లాగిన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలకు లాగిన్ ఇస్తే ఎక్కడ పెండింగ్ ఉందో జిల్లా అధికారులకు తెలుస్తుందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాము కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వైపీ రంగయ్య మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 12వ తేదీన జరిగే వీఆర్వోల ప్రాంతీయ సదస్సులో జిల్లాలోని వీఆర్వోలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మార్కాపురం డివిజన్‌లో వీఆర్వోలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. విలేఖరుల సమావేశంలో వి.మనోహర్‌రెడ్డి, కే.జానయ్య, భాస్కరరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో జర్నలిస్టుల శిక్షణా కేంద్రం ఏర్పాటుకు సహకరించాలి

- **వ్యక్తిగతంగా, ఆర్థికంగా తోడ్పాటు**
- **ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవీ**

ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలో జర్నలిస్టులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ఒంగోలులో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవీ సుబ్బారావు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో ఐవీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడారు. దేశంలోనే జిల్లా జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు



ఐవీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఈదరమోహన్

ఉందని తెలిపారు. ఎక్కడైనా అంకితభావంతో పనిచేస్తారనే నమ్మకం జిల్లా జర్నలిస్టులపై ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలోని జర్నలిస్టులను బాగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందుకోసం తాను వ్యక్తిగతంగా తీసుకోని ఆర్థికంగా కూడ తోడ్పాటు తీసుకొని ఈ కేంద్రాన్ని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏర్పాటు చేయ నున్నట్లు చెప్పారు. అందుకోసం జిల్లాలోని జర్నలిస్టులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కోటిరెడ్డిలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఐవీని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు బొకేలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ఈదర మోహన్‌బాబు, సత్య కేబుల్ డైరెక్టర్ అంకబాబులు ఐవీకి బోకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు ఎ.సురేష్, షేక్ ఇఫ్తేకర్‌బాషా, నూకతోటి శరత్‌బాబు, టివి రావు, వెంకట్రావు, సురేష్ రెడ్డి, సాక్షి శ్రీనివాస్, విసా శ్రీనివాస్, నాయక్, దాసరి కనకయ్య, మన్నం మాధవరావు, జయరాజ్, రాంబాబు, సత్య కేబుల్ అజయ్, పొన్నూరి శ్రీనివాసులు, మురళీ తదితరులు ఐవీ సుబ్బారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు.

బధిరుల స్కూలులో అన్నదానం

ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని బధిరుల పాఠశాలలో ఐవీ సుబ్బారావు జన్మదినోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బధిరుల పిల్లలతో కలిసి ఐవీ సుబ్బారావు జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఐవీ సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నం మాధ వరావు, వెంకట్రావు, ఎపియుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు ఎ.సురేష్, సురేష్ రెడ్డి, వెంకట్రావు, జయరాజ్, దాసరి కనకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలలో తాగునీటి కోసం రూ.85.52 లక్షలు మంజూరు

ఒంగోలుకర్నూల్‌రోడ్డు: జిల్లాలోని మూరుమూల గిరిజన ప్రాంతాలలోగల గ్రామీణ ప్రజలకు త్రాగునీరు జారీ అందించేందుకు బారీగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ ఆయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా అదికారులు గుర్తించిన గిరిజన ప్రాంతాలలో త్రాగునీరు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్న దృష్టి ఆయా ప్రాంతాలలో త్రాగునీరు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 699 ప్రాంతాలకు సీఎం ఫండ్ నంచి రూ105 కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ రూరల్‌డెవలప్‌మెంట్ కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోగల నాలుగు ప్రాంతాలకు రూ 85 .52 లక్షల మంజూరు జరిగాయి. వైపాలెం నియోజకఢర్గ పరిధిలో గల మారుమూల ప్రాంతాలకు గరిజన ప్రాంతాలైన అలాటంకు రూ20.83 లక్షలు, ఒక్కింటికి రూ17.93లక్షలు, మిలాపల్లికి రూ18.89 లక్షలు, అల్లపాలెంకు రూ27.87 లక్షలు మంజూరయ్యాయి.



ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే స్వామి

మీ బిడ్డలైతే ఇంత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తారా?

- **గురుకుల ప్రిన్సిపాల్‌ను నిలదీసిన ఎమ్మెల్యే స్వామి**
- **శానిటేషన్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు ఫోన్**

కొండపి: మూడు వారాల కిందట గురుకుల పాఠశాలను సందర్శించి, పిచ్చిచెట్లును తొలగించండి, లేకపోతే విద్యార్థినులను పాములు కాటేస్తాయని హెచ్చరించినా? బాధ్యతారహితంగా ప్రవర్తిస్తారా? అని కొండపిలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సీరియస్ అయ్యారు. సోమవారం రాత్రి గురుకుల పాఠశాలలోని బాలికను పాము కరిచిందన్న విషయం జర్నలిస్టుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే మంగళవారం మధ్యాహ్నం గురుకుల పాఠశాలను సందర్శించారు. బాలిక ఆరోగ్యంపై ఆరా తీశారు. పాము పిల్ల సార్ అని ప్రిన్సిపాల్ అనడంతో, బాలికలు పాము బాలిక కాలికి చుట్టుకుందని వివరించారు. పాము బాలిక కాలికి చుట్టుకుంటే చిన్న పాము అని ఎలా చెప్తారు? అని ఎమ్మెల్యే ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. తాను ప్రత్యేకంగా డైనింగ్ హాల్, బాత్ రూంల దగ్గర మొలిచిన పిచ్చిచెట్లను చూపించి పాములు తిరుగుతాయని గతంలో విజిట్‌కు వచ్చినపుడు హెచ్చరించా కదా? ఇంత నిర్లక్ష్యమా? అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు శానిటేషన్ కాంట్రాక్టర్‌కు ప్రిన్సిపాల్‌తో ఫోన్ చేయించారు. నలుగురు శానిటేషన్ సిబ్బందికి ముగ్గురే ఉన్నారన్న విషయం తెలుసుకుని వారితో ఎందుకు పని చేయించడం లేదని ఎమ్మెల్యే అడిగారు. శానిటేషన్ కాంట్రాక్ట్ పొందిన అగ్రిమెంటు తీసుకురమ్మని, వచ్చాక తహసీల్దార్ శ్రీశిల్పను పరిశీలించాలని కోరారు. కళాశాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయాలని బాలికలు నిర్భయంగా కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదులు రాసి వేయాలని ఎమ్మెల్యే సూచించారు. వెంటనే జేసీతో ఫోన్‌లో మాట్లాడారు. శానిటేషన్ సరిగా చేయించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, గురుకులను సందర్శించాలని జేసీని ఎమ్మెల్యే ఫోన్‌లో కోరారు. కళాశాలలోని డైనింగ్ హాల్, బాత్‌రూంలు, భవనాల పరిసరాలను డ్రైనేజీ కాల్వలను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యుత్ లైట్లు వెలగడం లేదని ఎమ్మెల్యే నిర్ధారించారు. ఎమ్మెల్యే వెంట కొండపి ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, జన్మభూమి మండల కమిటీ సభ్యులు బొడ్డపాటి యల్లమంద నాయుడు, బత్తుల నారాయణస్వామి తదితరులున్నారు.



ఆహ్వానం పలికేందుకు గేటు వద్ద ఉండే అమ్మాయిలు

మన ఉల్లాసమే వారి ఉపాధి మార్గం

● రోజురోజుకూ మారుతున్న వివాహ వేడుకల నిర్వహణ తీరు ● ఖరీదైన ఆతిథ్యంతో మండపాలు కళకళ
● స్వాగతం చెప్పే దగ్గర్నుంచి అన్నింటా సపర్యలు ● అందుకోసం ప్రత్యేక బృందాలు



పెళ్లికూతురిని మోసుకొచ్చే పల్లకి



కాబోయే వధూవరులను మండపానికి తీసుకొచ్చే టాంజా


ఒంగోలు కల్చరల్ : ఇంటిముందర తాటాకు పందిళ్లు.. వాటి చుట్టూ పచ్చటి మామిడి తోరణాలు.. చుట్టూ మెలికల ముగ్గులు.. నడుమ చెక్క బల్లలతో వేసిన కల్యాణవేదిక. ఇక వచ్చే అతిథులను సాదరంగా పలకరిస్తూ ఆహ్వానించే పట్టుపంచె కట్టిన పెద్దాయన. ఇది ఒకప్పటి పెళ్లివారింటి దృశ్యం. కాలం మారింది. అభిరుచులూ మారిపోతున్నాయి.

ఖరీదైన ఫంక్షన్ హాలు, మిరుమిట్లుగొలిపే విద్యుత్ దీపాలంకరణలు, రంగురంగుల పూలు ప్లాస్టిక్ పేపర్లతో వహ్వా అనిపించే కల్యాణ వేదిక. ఇలా వివాహ వేడుకల్లో వచ్చిన 'ఖరీదైన' మార్పు అతిథులకు ఉల్లాసాన్నిస్తుంటే.. ఎంతో మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది.

పెళ్లి అంటే హోదాను చాటుకునే ఖరీదైన వేడుక

ప్రస్తుతం పెళ్లి అంటే కేవలం సంప్రదాయమే కాకుండా తమ హోదాని చాటుకునే ఖరీదైన వేడుకగా కూడా మారింది. ఆ వేడుకలో రోజుకో కొత్తదనం వచ్చి చేరుతోంది. వచ్చే అతిథులను మీరే మా మహారాజులంటూ ఫంక్షన్ హాలు గేటు దగ్గరే సాదరంగా స్వాగతం పలకటానికి సైనికుడి రూపంలో వేషధారులు. ఇక లోపలికి అడుగుపెడుతుండగానే చూపుతిప్పుకోలేనం త అందమైన మగువలు గుబాళించే పూలను మన చేతికిచ్చి స్వాగతం పలుకుతారు. ఫంక్షన్‌హాలు లోపల కూర్చోగానే ప్రత్యేకమైన దుస్తుల్లో వయ్యారంగా నడిచివచ్చే వనితలు శీతలపానీయాలు అందిస్తారు. ఇలా అడుగడుగునా ప్రత్యేకతను కనబరిచే వీరెవరికి పెళ్లివారితో బంధుత్వం కానీ, పరిచయం కానీ ఉండదు. అదే వారికి ఆ రోజుకి ఉపాధినిస్తుంది. ఇందుకోసం ప్రతి చోట కళాబృందాలు నడుస్తున్నాయి.

సహజంగా కళాబృందాలలో పనిచేసే వారికి వారువేసే వేషాన్ని బట్టి దినవారి భత్యం ఉంటుంది. ఒక సైనికుడికి ఏడు వందల రూపాయలు ఉంటే, జోకర్ వేషగానికి వెయ్యి రూపాయల వరకు ఉంటుంది. వివిధ భంగిమలలో, అలంకరణలలో మనకు కనిపించే ఆడవారిని మాత్రం విజయవాడ, హైదరాబాదు, మహారాష్ట్ర, బెంగళూరు తదితర ప్రదేశాల నుంచి కళాబృందాల నిర్వాహకులు రప్పిస్తారు. వీరికిచ్చే దినసరి భత్యం కూడా ఎక్కువే. ఇక ఇటీవల వివాహ వేడుకల్లో మనకు తరచూ కనిపించేది పల్లకి, గుర్రపు బగ్గీలు. వీటిని కూడా జిల్లాలోని కళాబృందాల నిర్వాహకులు సరఫరా చేస్తారు. వీటి అద్దెలు రూ.25 వేలనుంచి రూ.50 వేల వరకు ఉంటాయి. మన మనసుకు ఉల్లాసం కలిగించే వివాహం ఇతర వేడుకలు ఇప్పుడు చాలా మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. ఈ వృత్తినే నమ్ముకున్న వారు శుభకార్యాలు లేని సమయంలో మాత్రం ఏంచేయాలో తోచని స్థితిలో ఉన్నారు.



మండపంలో ఆకర్షణగా యువతి



వివిధ రకాల వేషధారులు



ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

-మిరియాల ప్రవీణ్‌కుమార్, శ్రీ సాయిజానపద కళాబృందం యజమాని

మేము కూచిపూడి కళాకారులం. దానికి ఇప్పుడు ఆదరణ అంతగా లేదు. ఎన్నో ఏళ్లుగా పెళ్లిళ్లకు ఇతర కార్యక్రమాలకు జానపద కళాకారులు, వివిధ వేషధారులు, గుర్రపు బగ్గీలు, జీపురథాలు, పల్లకీలు సరఫరా చేస్తున్నాం. మా దగ్గర దాదాపు 200మంది కళాకారులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కూచిపూడి నుంచి వచ్చిన వారే. ఇటువంటి వేషాలకు కావాల్సిన సరంజామా, గుర్రాలను కొనటానికి లక్షల రూపాయలు వెచ్చించాలి. ప్రభుత్వం తరఫు నుంచి ఎటువంటి సహకారం లేదు. సబ్సిడీ రుణాలిస్తే బాగుంటుంది. మా దగ్గర ఉండే గుర్రాలు ప్రమాదవశాత్తు మరణిస్తే లక్షల రూపాయలు నష్టం వస్తుంది. వాటికి భీమా సౌకర్యం కూడా లభించటం లేదు.



సంచుల్లో పాలపుట్ట గొడుగులకు నీరు పెడుతున్న రమాదేవి, సిద్ధంగా పాలపుట్టగొడుగులు

పాలపుట్టగొడుగు సాగు భళా

- రాణిస్తున్న డ్వాక్రా మహిళ

- డ్వాక్రా సంఘ సభ్యురాలిగా తీసుకున్న రుణమే పెట్టుబడి

చీరాల : కృషితో నాస్తి దుర్భిక్షం... లక్ష్యం, సంకల్ప బలంగా ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు. డ్వాక్రా గ్రూపు మహిళలు అన్నింటా రాణిస్తున్నారు. కొందరు తాము తీసుకున్న రుణాన్ని పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేసి అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు. కుటుంబ పోషణలోనూ కీలకపాత్ర వహిస్తున్నారు. పేరాలలోని మహేశ్వరి స్వయం సహాయక సంఘం సభ్యురాలు బి. రమాదేవి పాలపుట్టగొడుగుల సాగులో రాణిస్తున్నారు. చీరాల మునిసిపాలిటీ పరిధిలో పేరాల మహేశ్వరి స్వయం సహాయక సంఘంలో బి.రమాదేవి సభ్యురాలు. ప్రభుత్వ చేయూతతో ఆమె తన కాళ్ల గ్రూపు ద్వారా ఆమె తీసుకున్న రూ.40 వేల రుణంతో పాటు మరికొంత సొంత వేసుకుని పాలపుట్టగొడుగుల సాగు చేపట్టారు. ఆమె భర్త శ్రీనివాసరావు ఆమెకు సాగులో సహకరిస్తున్నారు. పుట్టగొడుగుల్లో సాధారణంగా రెండు రకాలు ఉంటాయి. ఒకటి పాలపుట్ట గొడుగులు. రెండు ఆయిస్టర్ రకం. వీటిలో తీరప్రాంతంలో పాలపుట్టగొడుగుల సాగు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 4 నుంచి 5 కిలోల వరకు దిగుబడి తీస్తున్నారు. కిలో రూ.300 వరకు విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సమస్య లేదని చెప్తున్నారు. మైసూరు నుంచి విత్తనాలు దిగుమతి చేసుకుంటారు. కిలో రూ.125. భార్యాభర్తలతో పాటు ఓ సహాయకురాలిని కూడా నియమించుకున్నారు. ఖర్చులు పోను నికరాదాయం చూస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో పుట్టగొడుగుల సాగులో శిక్షణ పొంది సాగు చేపట్టటంతో సాగు కొంత సులువుగా ఉంటుందంటున్నారు. ఈ సాగును విస్తరించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆమె చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్లేఫీల్డ్స్

కనిగిరి : ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సౌకర్యాల వసతి అంటే ప్లేఫీల్డ్స్ కల్పించనుంది. ఉపాధి హామీ పథకం నిధులతో విద్యార్థులకు ఆటల పోటీల సౌకర్యం ఏర్పడనుంది. ప్రభుత్వ హైస్కూల్స్‌లో క్రీడామైదానాలు లేకపోవటం, ఉన్న చోట ఆటలకు సంబంధించి వసతులు లేక విద్యార్థులు క్రీడా పోటీలకు క్రమేపీ దూరమవుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో జిల్లాలోని 284 ఉన్నత పాఠశాలల్లో క్రీడా వసతి కలుగనుంది. ఒక్కో హైస్కూల్‌లో రూ.5లక్షలు నిధులు కేటాయించారు.


ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతుల కల్పనకు కృషి జరుగుతుండగా ఇటీవల కాలంలో క్రీడా వసతుల కల్పనలో కొంతమేర వెనుకబడిఉంది. ప్రభుత్వం క్రీడా వసతుల కల్పనకు నడుంబిగించింది. విద్యార్థుల్లో క్రీడా ఆవశ్యకతను పెంపొందించేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు వినియోగించుకొని ప్రతి హైస్కూల్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టు, వాకింగ్ ట్రాక్, ఇతర ఆటల పోటీల వసతులను కల్పించాలనే లక్ష్యంగా నిర్ణయించారు. ఒక్కో హైస్కూల్‌కు వీటి వసతులకు రూ. 5లక్షలు కేటాయించారు. ఇందులో రూ. 3.50లక్షలు మెటీరియల్ కాంపొనెంట్‌గాను, రూ. 1.50 లక్షలు లేబర్ కాంపొనెంట్‌గా గుర్తించారు. ఆయా హైస్కూళ్ల పరిధిలోని జాబ్‌కార్డు కలిగిన కూలీలకు ఈ పనిలో పాల్గొంటారు. జిల్లాలోని 284 ఉన్నత పాఠశాలలకు రూ.14.20 కోట్ల నిధులు కేటాయించి క్రీడావసతుల పనులు ప్రారంభించారు.

31 పాఠశాలల్లో క్రీడా వసతుల ఏర్పాటు

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో విద్యార్థులకు క్రీడావసతి ప్లేఫీల్డ్స్ 31 ప్రభుత్వ హైస్కూల్స్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఏరువారిపల్లి, తక్కెళ్లపాడు, సీఎస్‌పురం, పీసీపల్లి, బొట్లగూడూరు, కంభాలదిన్నె హైస్కూల్స్‌లో ప్లేఫీల్డ్స్ నిర్మాణాలను ప్రారంభించారు. కొంతవరకు హైస్కూల్ స్థాయిలో విద్యార్థుల ఆటల పోటీలకు ఇబ్బందులు తీరనున్నాయి. అంతేకాకుండా హైస్కూల్ స్థాయిలో విద్యార్థులు ఎక్కువగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలకు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రభుత్వం ఈ క్రీడలను ప్రోత్సహించే దిశగా సౌకర్యాలు కల్పిస్తోంది.

- జిల్లాలో 284 హైస్కూల్స్‌లో క్రీడా సౌకర్యాలు
- ఒక్కో ఉన్నత పాఠశాలకు రూ. 5లక్షల కేటాయింపు
- కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టుల ఏర్పాటు
- క్రీడా ప్రతిభకు మరింత మెరుగు

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరుగుతోంది



దేవిరెడ్డి రామిరెడ్డి, హెచ్‌ఎం, శీతారామపురం

హైస్కూల్స్‌లో ప్లేఫీల్డ్స్ ఏర్పాటు ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరుగుతోంది. పాఠశాలలకు క్రీడామైదానాలు ఇతర వసతులు అవసరం. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలి. మంచి ఆరోగ్యంతోపాటు చురుకుదనంగా ఉంటారు. ప్లేఫీల్డ్స్ ప్రభుత్వం ఏర్పాటు చేయటం మంచి పరిణామం.

ప్లేఫీల్డ్స్‌తో క్రీడావసతులు



రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎం, గురవాజీపేట

ప్రభుత్వం ప్రతి హైస్కూల్‌కు ప్లేఫీల్డ్స్ ద్వారా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి కలుగుతుంది. మైదానాలున్నా క్రీడావసతులు లేక విద్యార్థుల్లో క్రీడాసాధనకు ఉపయోగపడతాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 5లక్షలతో పాఠశాలల్లో క్రీడా ప్లేఫీల్డ్స్ ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థులు మంచి క్రీడాకారులుగా తయారవుతారు.




ఏరువారిపల్లి హైస్కూలులోప్లేఫీల్డ్ నిర్మించే హైస్కూల్ క్రీడా మైదానం

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

-జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్

మక్కెన వెంకటక్రిష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

టంగుటూరు : ఆరోగ్య పరిరక్షణపై తప్పనిసరిగా ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ సూచించారు. మక్కెన వెంకటక్రిష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం కోటయ్య సౌజన్యంతో మంగళవారం స్థానిక క్యాండీ పోర్టు ఆవణలో ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మారిన వాతావరణం, మనిషి బిజీ షెడ్యూల్ కారణంగా కొన్ని రకాలు జబ్బులు ఆవరిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ఇలాంటి వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేస్తున్నందున వారి ఆరోగ్య స్థితి తెలుస్తుందని చెప్పారు. ప్రభుత్వం కూడా ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తిస్తే నివారణ అత్యంత సులభమని చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఇలాంటి సమాజసేవా కార్యక్రమాల ద్వారా దివంగత మక్కెన వెంకట క్రిష్ణారావు మన మధ్యనే ఉంటాడన్నారు. తన తండ్రి దివంగత ఎన్‌టీఆర్ సేవా దృక్పథంతో అమ్మ పేరున బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని స్థాపించారని, అదే ఆసుపత్రి వైద్యులు నేడు ఇక్కడ వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైద్య శిబిరంలో పాల్గొనడం తన తల్లికి నివాళి అర్పించినట్లు ఉందని చెప్పారు. ఎస్పీ బి సత్యఏసుబాబు పాల్గొన్నారు. విజయవాడ ఆంధ్రా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, హైద్రాబాద్ ఐకేర్ హాస్పటల్ వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, జడ్పీటీసీ సభ్యురాలు పటాపంజుల కోటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులులు పద్మ, శ్రీదేవి, పారిశ్రామికవేత్త బెల్లం కోటయ్య, టీడీపీ యువనాయకుడు దామచర్ల సత్య, ఆంధ్రా ఆసుపత్రి వైద్యనిపుణులు రమణమూర్తి, బెజవాడ వెంకటేశ్వర్లు, బెల్లం సునీల్, బ్లెలం రవిచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌చంద్, పక్కన పురందేశ్వరి, ఎమ్మెల్యే స్వామి, ఎస్పీ సత్యఏసుబాబు, నేతలు

'కనపర్తి'.. కక్కుర్తి...!

- యథేశ్చగా ప్రభుత్వ భూముల కబ్జా
- ఎకరాకు లక్ష చెల్లిస్తే ఆన్‌లైన్‌లో నమోదు
- గత తహసీల్దార్ హయాంలో అడ్డగోలుగా నిబంధనలు బేఖాతరు
- ఈ తతంగంలో మరో ఇద్దరు వీఆర్‌ఏలూ, అధికార పార్టీ నేతలూ భాగస్వాములు
- వాన్‌పిక్ భూముల జీవో రద్దుతో అవీ మాయం

ప్రభుత్వ భూములు ఫలహారం మాదిరి పంచుకున్నారు. రెవెన్యూ అధికారులకు ముడుపులిస్తే చాలు అవన్నీ సొంత భూములుగా మార్చేస్తున్నారు. ఎకరా ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తే లక్ష రూపాయలు, అనువంశీకంగా కొనుగోలు చేసినట్లు భూరికార్డుల్లో పేర్లు మార్చేసి ఆన్‌లైన్‌లో ఎక్కిస్తే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా కనపర్తి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను యథేశ్చగా పంచుకోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.



కనపర్తిలో 1400 సర్వేలోని ప్రభుత్వ భూములు

కనపర్తి(నాగులుప్పలపాడు) : మండలంలో సముద్ర తీర ప్రాంతమైన కనపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. వందల ఎకరాలను అత్తసొమ్ము అల్లుడు దానం చేసిన చందంగా అక్రమార్కులకు ధారాదత్తం చేశారు. ఈ అక్రమ వ్యవహారమంతా గత తహసీల్దార్ హయాంలో ఇద్దరు చిరుద్యోగులను అడ్డుపెట్టుకొని స్థానిక రాజకీయ నేతల తోడ్పాటుతో నడిచినట్లు సమాచారం. బలిజ సంఘం పేరుతో ఉన్న భూముల్లో రేపల్లెకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి చేపల చెరువుల సాగు నిమిత్తం అమ్మకాలు ప్రారంభం కావడంతో ఈ భూకుంభకోణం బయటపడింది. ఆ సంఘానికి చెందిన భూముల్లో రెండు గ్రూపులుగా మారి భూములు అమ్మే క్రమంలో ఒక గ్రూపునకు డబ్బులు రాగా, మరో గ్రూపునకు డబ్బులు చెందలేదు. ఆ గ్రూపునకు చెందిన రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది.

కనపర్తి గ్రామ పరిధిలో సుమారు 3వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. సర్వే నంబరు 1400 నుంచి 1600 నెంబరు పరిధిలో అధికంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా, మండలానికి కొత్త తహసీల్దార్ వచ్చినప్పుడల్లా భూమాయలు జరుగుతూనే ఉంటాయి. సాగులో ఒకరుంటే, అదే భూమికి మరో ముగ్గురికి పట్టాలు ఇస్తుంటారు. ఏ ఒక్క సర్వే నెంబర్‌లోనైనా రికార్డుల్లో పేర్లు మారుతూనే ఉంటాయి.

అసలు భూస్వరూపం

కనపర్తిలో 1905 నుంచి 1959 సంవత్సరం మధ్య వరకు వివిధ సర్వే నెంబర్లలో భూములుండేవి. అప్పటి నుంచి 1970 వరకు సర్వే నెంబర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 1970-78 మధ్యకాలంలో సబ్ డివిజన్ చేయడం, భూములను రీసర్వే చేసే క్రమంలో ఎక్కువ మంది నిరుపేదలకు ప్రభుత్వం వాటిల్లో డీకే పట్టాలు పంపిణీ చేసింది. అలా 1983లో ఒకసారి, 1990లో మరోసారి సుమారు 2వేల మందికి పైగానే పట్టాలిచ్చింది. దీనికి తోడు స్వాతంత్ర్య సమరమోధులు, మాజీ సైనికోద్యోగులకూ భూములిచ్చింది. వాటిల్లో ఎక్కువ భూములు సాగుకు పనికి రానివే. రికార్డుల్లో అయితే పేర్లుంటాయేగాని సాగులో మాత్రం రైతులు ఉండనే ఉండరు.

లాభసాటి వ్యాపారంగా భూపందేరం

కనపర్తి ప్రభుత్వ భూములంటేనే ప్రభుత్వ ఉద్యోగులకు లాభసాటి వ్యాపారంగా మారిందన్న ఆరోపణలున్నాయి. లక్షరూపాయలకు ఎకరాభూమి వస్తుందన్న ఆశతో చెరువుల యజమానులు, ఇతర వ్యాపారులు ఇందులో భాగస్వాములయ్యారు. అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బకింగ్ హామ్‌కాలువకు తూర్పువైపున ఉన్న వేల ఎకరాల భూములను ఆ సంస్థకు కట్టబెట్టింది. టీడీపీ అధికారంలోకి రాగానే వాన్‌పిక్ సంస్థ ఇచ్చిన భూముల జీవోను రద్దు చేశారు. తిరిగి ఆ భూములను కూడా గతంలో భూమి హక్కులున్న యజమానులు తిరిగి భూములు దక్కించుకొనేందుకు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారు. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే అమ్ముకోవడం చూస్తే కంచే చేను మేసిన చందంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఎకరా లక్షకు ప్రభుత్వ భూమి ధారాదత్తం

2015 నుంచి 2016 మధ్య కాలంలో పనిచేసిన తహసీల్దార్ ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారు. మండలంలో పనిచేస్తున్న ఇరువురు వీఆర్‌ఏలను సహాయకారులుగా ఉంచుకొని కనపర్తి గ్రామానికి చెందిన కొందరి నాయకులతో వీరందరూ కుమ్మక్కై ఈ బాగోతం నడిపారు. ఎకరా భూమిని పేరు మార్చి ఆన్‌లైన్‌లోకి ఎక్కిస్తే లక్ష రూపాయలు వసూళ్లు చేశారు. ఇలా వంద ఎకరాలకు పైగా అక్రమార్కులకు కట్టబెట్టినట్లు సమాచారం. దీంతో పాటు భూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా ఉన్న భూములను అనువంశీకం, కొనుగోలుగా ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపించేందుకు ఒక్కో ఎకరాకు పదివేల నుంచి 30వేల రూపాయల వరకు వసూలు చేసి సుమారు 200 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను సొంత భూములుగా మార్చినట్లు తెలిసింది.

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరోటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **థర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం థర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజీ సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. **ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------**
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. **స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------**
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. **మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------**
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. **పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------**
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. **కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------**
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. **హాంకాంగ్: చైనా:: వాటికన్: --------**
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. **ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------**
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. **వినడం: చెముడు:: మాట్లాడడం: --------**
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. **భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------**
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. **హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------**
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. **తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----**
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. **సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------**
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. **రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----**
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. **ఓనం: కేరళ:: బిహు: ------**
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. **ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------**
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. **శిల్పం: రూపం:: పాట ------**
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఎఎ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఎ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఎఎ - ఎన్‌సిఆర్ఎ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఎఎ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఎ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్ట్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి, చెన్నై, మదురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్’ గ్రంథ రచయిత ఎవరు?


హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్


కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ


బాలగంగాధర్ తిలక్


అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాఫికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్డ్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

		15) డి	24) బి	33) డి	42) సి
1) బి	8) ఎ	16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
2) ఎ	9) బి	17) బి	26) సి	35) డి	44) బి
3) సి	10) సి	18) సి	27) డి	36) డి	45) సి
4) బి	11) డి	19) డి	28) ఎ	37) సి	46) బి
5) ఎ	12) బి	20) బి	29) బి	38) బి	47) సి
6) డి	13) ఎ	21) సి	30) డి	39) ఎ	48) డి
7) సి	14) ఎ	22) ఎ	31) సి	40) బి	49) బి
		23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబిబిఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ అండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

చిన్నారులకు టీకా పడింది



చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఎర్రగొండపాలెం : టీకా బాలలకు శ్రీరామ రక్ష అని డాక్టరు ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, నలంద హైస్కూల్‌లో తట్టు, పొంగు వ్యాధి నిరోధక టీకాలను విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. తొలిరోజు 1749 మందికి టీకాలు వేయడం జరిగిందని నాయక్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు భూమిరెడ్డి పద్మజ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌యం షేక్ మహబూబ్ సుబానీ, నలంద హైస్కూల్ ప్రతినిధి రామకృష్ణారెడ్డి, డాక్టరు శ్రీనునాయక్, హెల్త్ సూపర్ వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మీజిల్స్ రూబెల్లా వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎంఆర్ వ్యాక్సిన్‌ను మండలంలోని అన్ని పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ వారు చిన్నారులకు టీకాలు వేశారు. చిన్నారులకు ఈ టీకా వేయవచ్చని వైద్యాధికారి అమీర్ ఆలీ తెలిపారు. స్థానిక కస్తూర్బా పాఠశాల, జడ్పీ పాఠశాలతో పాటు మరికొన్ని పా ఠశాలలో విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ వ్యాక్సిన్‌తో తట్టు, పొంగు వ్యాధులను పూ ర్తిగా అరికట్టవచ్చన్నారు. అన్నసముద్రం వై ద్యాధికారిణి కవితా దీప్తి ఆధ్వర్యంలో గణపవరం గురుకుల పాఠశాలతోపాటు మరి కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు వేశారు. కా ర్యక్రమంలో హెచ్‌ఎస్ ఎన్.అంజమ్మ, వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజశేఖరరెడ్డి, పూర్ణచంద్రరావు, మారుతి దేవి, వైద్య సిబ్బం ది, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల: చిన్న దోర్నాల గ్రామంలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను వైద్యాధికారి చెంచయ్య మంగళవారం ప్రారంభించారు. తట్టు, ఆటలమ్మ వంటి వ్యాధులు సోకకుండా ఉం డేందుకు ఈ టీకాను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూర్యకుమారి, భరత్ భూషణ్ పాల్గొన్నారు.

అర్హులకు ఎన్టీఆర్ ఇల్లు

ఎర్రగొండపాలెం : అర్హులైన పేద ప్రజలను పక్కా గృహాలకు ఎంపిక చేస్తామని తహసీల్దార ఎం.రత్నకుమారి తెలిపారు. మంగళవారం వీర భద్రాపురంలో జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొని మా ట్లాడుతూ వీరభద్రాపురం గ్రామంలో గత సంవత్సరం జరిగిన ప్ర జా సాధికార సర్వేలో 445 మంది నివాస గృహాలు లేని లబ్ధిదారులను గుర్తించామని అన్నారు. గ్రామ సభలో 405 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అన్నారు. మిల్లంపల్లి గ్రామంలో 388 మందిని గుర్తించాచి పరిశీలిస్తున్నామని ఎంపీడీవో టి.హనుమంతారావు అన్నారు. వీరభద్రాపురం హౌసింగ్ ఏఈ ఆనందబాబు, సర్పంచి బుజ్జిబాబు, ఎంపీటీసీ ఐ.ప్రసాదు, జన్మభూమి కమిటీ సభ్యులు, కార్యదర్శి పి.రామసుబ్బయ్య, సర్పంచ్ పెద్దరాజయ్య, నీటి సంఘం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో గణపవరం విద్యార్థుల ప్రతిభ



విజేతలతో ఉపాధ్యాయులు

త్రిపురాంతకం : గురుకుల పాఠశాల విద్యార్థులు కీడ్రల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జులై 29, 30 తేదీలలో మచిలీపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి 4వ స్టూడెంట్ ఒలంపిక్ స్టేట్ గేమ్స్ 2017-18లో అండర్-14 విభాగంలో కబడ్డీ, ఖోఖోలో విన్నర్స్‌గా, వా లీబాల్‌లో రన్నర్స్‌గా ప్రతిభను చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వి ద్యార్థులు ఈ నెల 25 నుంచి 30 వరకు మహారాష్ట్రలో జరిగే పోటీలలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు మోహనరెడ్డి, రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసులు, పీఈటీ రాంబాబు తదితరులు అభినందించారు.

బోగస్ జాబ్ కార్డులపై విచారణ

పుల్లలచెరువు : ఒకే కుటుంబంలోని భార్యా భర్తలు, పిల్లలకు వేరువేరుగా జాబ్ కార్డులు పొంది, ఉపాధి హామీ, వాటర్‌షెడ్, వెలుగు శాఖల ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకం పేరుతో కోట్లాది రూపాయలు వృథా అవడంపై సింగిల్ జాబ్ కార్డులపై జిల్లా డ్వామా పీడీ పోలప్ప ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా అధికారులు పుల్లలచెరువు మండలంలోని బోగస్ జాబ్ కార్డులపై మూడు టీములు విచారణ చేపట్టారు. చాపలమడుగు పంచాయతీలోని చాపలమడుగు, చెన్నంపల్లి, సి.కొత్తపల్లి, యండ్రపల్లి పంచాయతీ, కొమరోలు పంచాయతీ కుందంపల్లి, రంగనపాలెం గ్రామాల్లోని కొందరు దళారులు బోగస్ జాబ్ కార్డులు సృష్టించి లబ్ధి పొందుతుండడంతో గ్రామంలోని కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫర్యాదు చేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది. దీంతో 2006 నుంచి ఇప్పటి వరకు లబ్ధిపొందిన వారి జాబితా సేకరించారు. కార్యక్రమంలో అధికారులు రాజేష్, వెంకట్రావు, రామారావు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

పెద్దారవీడు: అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆర్డీవో పి.కిశోర్, డీఎస్పీ రామాంజనేయులు విచారణ చేపట్టారు. బొమ్మనబోయిన సుబ్బయ్య 3 వారాల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెల్సిందే. తన మూడున్నర ఎకరాలలో మిర్చి ఎకరా, కంది బొబ్బర్లు ఎకరన్నరలో వేశారు. రెండు బోర్లు కూడా వేయగా దానిలో ఒక బోరులో నీరు రాలేదు. వీటన్నింటికి ఐదున్నర లక్షలు అప్పు చేశారు. పంట పండక, అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్డీవో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఆయనతోపాటు తహసీల్దార్ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ముక్కంటి, ఏవో సుదర్శనరాజు, ఏఈవో బుజ్జిబాయి, ఎంఆర్‌ఐ భ్రమరాంబ, వీఆర్‌వో శ్రీనివాస రెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

గృహ లబ్ధిదారుల ఎంపిక

పుల్లలచెరువు : ప్రజాసాధికార సర్వే ప్రకారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఐటీవరం, పిడికిటివారిపల్లె పంచాయతీల్లో 600 మంది అర్హులు ఉన్నారని హౌసింగ్ ఏఈ రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఆ పంచాయతీల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూపర్‌డెంట్ గంగాధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

త్రిపురాంతకం: రామసముద్రం ఎస్సీ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కేటీ మల్లికార్జున్ నాయక్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సబ్జెక్టుల్లో వెనుబడినవారిపై శ్రద్ధ చూపాలన్నారు.

పథకాలతోనే గిరిజనుల ఆర్థికాభివృద్ధి

ఎర్రగొండపాలెం : ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోపర్చుకొని, ఆర్థికంగా ఎదగాలని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఎస్‌వో అంజమ్మ అన్నారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల్లో అవగాహన కల్పించేందుకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల వైస్ ప్రిన్సిపాల్ శ్యాం వర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

పెద్దారవీడు: గొబ్బూరు, సానికవరంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను అం గన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. కా ర్యక్రమంలో ఎ.నాగేశ్వరమ్మ, ఎం.నాగలక్ష్మి, హైమావతి, రంగ లక్ష్మి పాల్గొన్నారు.

'ఉపాధి'తో అభివృద్ధి : ఎమ్మెల్యే డేవిడ్‌రాజు

త్రిపురాంతకం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే డేవిడ్ రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చిన ఉపాధి హామీ పనుల బహిరంగ ప్రజావేదిక కార్యక్రమానికి ఎ మ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా ఉపాధి హామీ పనులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులతో త్రిపురాంతకం మండలంలో ఎక్కువ అభివృద్ధి జరుగుతుందన్నారు. కూలీలందరూ సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఉపాధి పథకాన్ని కూలీలందరూ వంద శాతం ఉపయోగించుకోవాలని, గతంలో రూ.30 ఉండే కూలీల వేతనం ఇప్పుడు రూ.190కి పెరిగిందన్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారా ఆడిట్ గ్రామ సభల్లో అడుగగా కూలీలంతా సక్రమంగా జరిగాయని తెలిపారన్నారు. అన్ని పనులకు మ్యాచింగ్ గ్రాంట్‌తో పనులు పూర్తి చేస్తున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో నియోజకవర్గంలో సీసీ రోడ్లు వంద శాతం పూర్తి చేస్తామన్నారు. లోపాలు ఉంటే గ్రామసభల సమయంలో సరి చేసుకోవాలన్నారు. గ్రామాలలో రాజకీయ వ్యక్తిగత కారణాలతో పిటీషన్‌లు పెడుతున్నారని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పంట సంజీవినిలో యంత్రాలను ఉపయోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయని, కూలీలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇస్తే పరిశీలించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ పీడీ గంగాభవాని, ఏపీడీ వెంకటేశ్వరరావు, షార్ట్ డైరెక్టర్ శ్రీకాంత్, ఎస్‌పీఎం గౌరీశంకర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రవి, ఎంపీపీ నీలం చెన్నమ్మ, ఎంపీడీవో కె.మాణిక్యరావు, తహసీల్దార్ జయపాల్, ఏపీవోలు అలీఉస్మాన్, నాగ ప్రసాదు, ఎస్‌ఆర్‌పీ కనకారావు, డీఆర్పీలు పాల్గొన్నారు.



బహిరంగ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డేవిడ్‌రాజు

గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణే లక్ష్యం

పెద్ద దోర్నాల: గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఐటీడీఏ పీవో మురళి అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల బాలికల పాఠశాలలో ఆదివాసి ఆరోగ్యం కార్యక్రమాన్ని పీవో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం ఉద్దేశించి పీవో మురళి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుంచి ఏప్రిల్ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య పరీక్షల నిర్వహణకు నర్సును నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో బెంజిమెన్, సూపరింటెండెంట్ పార్థసారధి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి నూతన హెచ్‌ఎంలు

త్రిపురాంతకం: మండలంలోని 6 ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎంలుగా ఆరుగురిని ఎంఈవో కేటీ మల్లికార్జున్ నాయక్ మంగళవారం విధుల్లో చేర్చుకున్నారు. మరో 5 పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. బయోలాజికల్ సైన్స్ 1, ఫిజికల్ సైన్స్ 1, లెక్కలు 1, ఇంగ్లీషు 1 భర్తీ కాగా, తెలుగులో ఐదురుగురు, హిందీలో ఇద్దరు ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈవో తెలిపారు.

పెద్దారవీడు: దేవరాజుగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వై.సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

పెద్ద దోర్నాల: వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఏవో వసంతరావు అన్నారు. నల్లగుంట్ల, వై.చెర్లోపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ కరువు ఏర్పడిన నేపథ్యంలో వరి, జొన్న వంటి పైర్లు సాగు చేసుకోవాలని ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పొదిలి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీడీవో పి.ఝాన్సీరాణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ కె.నరసింహారావు అధ్యక్షతన జరుగుతుందని చెప్పారు. కావున మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, మండల అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.


ప్రమాణపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు

ప్రమాదంపై ప్రమాణం

మార్కాపురంవన్‌టౌన్ : రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసు స్టేషన్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా పోలీసులు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పని చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారని డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులతో ప్రమాదాలకు బాధ్యుడిని కాబోనని ప్రమాణం చేయించారు. ప్రతి వ్యక్తి తనకు తాను ప్రమాదాలకు కారణం కాకుండా ఉండాలని, మద్యం సేవించిన వారికి, డ్రైవింగ్ రానివారికి వాహనాలు ఇవ్వబోమని ప్రతిజ్ఞ చేయాలన్నారు. రహదారి నిబంధనలు పాటించి, హెల్మెట్ ధరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రమాణ పత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ బి. శ్రీనివాసరావు, ఎస్ఐలు శ్రీకాంత్, మల్లికార్జున, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్‌లో ఘనంగా అన్నా పుట్టినరోజు వేడుకలు

మార్కాపురంవన్‌టౌన్: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు జన్మదిన వేడుకలు కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య కేక్ కట్ చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బిలీఫ్ బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం మార్కాపురం ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు శ్రీనివాస్, జ్ఞానవర్ధన్, రాజశేఖర్, రంగనాయులు, బలరాం, రామమోహన్, ఏవో ప్రభాకర్ పాల్గొన్నారు.

శిశు మరణాలకు వ్యాక్సిన్‌తో కట్టడి

- తొలి రోజే 2297 మందికి వ్యాక్సిన్
- డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

మార్కాపురంవన్‌టౌన్ : తట్టు పొంగు రాకుండా శిశు మరణాలు జరగకుండా ప్రభుత్వం రెండు రోగాలకు ఒ కే వ్యాక్సిన్ కార్యక్రమం అ మలు చేస్తున్నదని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.పద్మావతి అన్నారు. పట్టణంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఎం ఆర్ టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభమయ్యాయి. సాయిబాలాజీ మోడల్ స్కూల్, కమలా కాన్సెప్ట్ పాఠశాలలో 12 టీ ముల వైద్య బృందాలు టీకాలు వేశాయి. మొత్తం 2297 మంది విద్యార్థులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పద్మావతి తెలిపారు. వైద్య ఆ రోగ్య శాఖ, శ్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 7 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో టీకాలు వేస్తామన్నారు. మిగిలిన వారికి ఈ నెల 31 వరకు టీకాలు వేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి రియాక్షన్ వచ్చినా వైద్య సేవలు అందించేందుకు చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. రవీంద్రారెడ్డి, డాక్టర్ హరిప్రసాదు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మినిల బృందం నియమించామన్నారు. నలుగురు సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో టీకాలు వేస్తున్నారని గజ్జలకొండ వైద్యాధికారిణి కె. హిమబిందు ఈ టీముకు నాయకత్వం వహిస్తారన్నారు. కార్యక్రమంలో సాయిబాలాజీ పాఠశాల ప్రిన్సిపాల్ కె. రంగయ్య, కమలా విద్యా సంస్థల వైస్ చైర్మన్ పెనుగొండ పవన్ కుమార్, సూపర్ వైజర్లు టి. విజయలక్ష్మి, కాశయ్య, సయ్యద్ బాను, లక్ష్మినారాయణ, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.


ఎంఆర్ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది


సీమంతాలు చేస్తున్న సీడీపీవో

ముర్రుపాలు ప్రాణరక్ష

తల్లి ప్రసవిం చిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని రూరల్ సీడీపీవో షేక్ రమిజాభాను అన్నారు. మండలంలోని వేములకోటలో తల్లిపాల వారోత్సవాలు మం గళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రు పాలే బిడ్డకు మొదటి టీకా అని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. వీటిని 2 సంవత్సరాల వరకు కొనసాగించాలని తెలిపారు. అంగన్ వాడీలు ముర్రుపాల ప్రాముఖ్యతను, తల్లుల సమావేశాల ద్వారా గృహ దర్శనాల ద్వారా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంజీవరెడ్డి, కార్యకర్తలు జయలక్ష్మి, రాములు, సరిత, సరళ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. కొండేపల్లి రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రమిజాబీ, నీలోఫర్, కౌన్సిలర్ ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

భారమైన పశుపోషణ

తక్కువ ధరకు పశువుల విక్రయం

తర్లుపాడు: పశ్చిమ ప్రాంతంలో పశు సంపద రోజురోజుకు తగ్గిపోతోంది. పంటలు పండకపోవటంతో సాగులో నష్టాలను చవిచూసిన రైతులకు ఎంతో కొంత చేదోడుగా ఉంటే పశుపోషణ భారంగా మారింది. కొందరు రైతులు పశువులను పోషించలేక అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఒక వైపు కరువుతో, మరో వైపు వర్షాభావ పరిస్థితులతో పశు పోషణ భారమైంది. దీంతో మూగజీవాలను అమ్మకానికి పెడుతున్నారు. గత సంవత్సరం నుంచి తీవ్ర కరువు పరిస్థితి నెలకొనడంతో పశుగ్రాసం లేక పశువులు అలమటిస్తున్నాయి. ఏ ఒక్క చెరువుల్లో కూడా నీరు లేకపోవటంతో పశువులు తాగునీటికి సైతం అల్లాడిపోతున్నాయి. గ్రామాలలో వ్యవసాయం నిర్వీర్యమవుతుండటంతో రైతన్నలు కాడి పక్కన పడవేస్తున్నారు. దీంతో పల్లెల్లో ఎద్దులతో వ్యవసాయం కూడా తగ్గుముఖం పడుతుంది. ప్రస్తుతం పశువులకు ప చ్చి మేత లేకపోవటంతో 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవికి రైలులో వెళ్లి గడ్డిని తెచ్చుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వరి గడ్డి ట్రాక్టర్ 15 వేల నుంచి 20 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. కరువు మండలాల్లో ప్రభుత్వం సబ్సిడీపై దానాను, పశుగ్రాసాన్ని సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

అంకితభావంతో పని చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో కాశీశ్వరరావు

మార్కాపురంవన్‌టౌన్: ఉపాధ్యాయులు క్రమశిక్షణ కలిగి అంకిత భావంతో పని చేయాలని ఉప విద్యాశాఖాధికారి ఎం.కాశీశ్వరరావు అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోనే తలమానికంగా నిలిచి వందేళ్ల చరిత్రను పూర్తి చేసుకున్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కీర్తి ప్రతిష్ఠలు మరింత ఇనుమడించేలా పని చేయాలన్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ఉన్న ఈ పాఠశాల అనేక ఉపాధ్యాయ, విద్యా సంబంధ సమావేశాలకు, శిక్షణలకు కేంద్ర బిందువు అన్నారు.

సమిష్టిగా ఐ కృతతో పని చేసి విద్యార్థుల, పాఠశాల అభివృద్ధిలో కృషి చేయాలన్నారు. జీవితంలో విలువైనది పాఠశాలల్లో విద్యాబోధన అని ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. రెగ్యులర్‌గా తరగతులు నిర్వహించి బోధన మరింత మెరుగు పరచాలన్నారు. చదువులు, ఆటలలో ప్రథమ స్థానంలో ఉండే ఈ పాఠశాల ప్రతిష్ఠ మరింత పెంచాలన్నారు.


స్వచ్ఛ్ శపథ్ చేస్తున్న అధ్యాపకులు

'స్వచ్ఛ'లో భాగస్వాములు కావాలి

మార్కాపురంవన్‌టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం విద్యార్థులు ఆ యా గ్రామాలలో అ మలు పరచాలని యస్‌వి కెపి కళాశాల ప్రిన్సిపాల్ జి.ధర్మానాయక్ అన్నారు. ఎస్వీకేపీలో స్వచ్ఛ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధర్మానాయక్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు స్వచ్ఛాంధ్ర ప్రదేశ్, స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. విద్యార్థులు తమ గ్రామాలలో, ప్రజలను చైతన్య పరచి ఈ కార్యక్రమాలపై పాల్గొనేలా అవగాహన కల్పించి ఆచరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా ఆ గస్టు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూస్తామన్నారు. అనంతరం స్వచ్ఛ్ శపథ్ చేయించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌లు ఎన్.విశ్వాసరావు, జీకేఎల్ సీహెచ్ నాసరయ్య, వైస్ ప్రిన్సిపాల్ టీవీసీసీ చలమయ్య, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ టి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో గుర్తించిన వారికే పక్కా గృహాలు

పొదిలి : ప్రజా సాధికార సర్వేలో గుర్తించిన లబ్ధిదారులకు పక్కాగృహాలు మం జూరు అవుతాయని తహసీల్దార్ పి.విద్యాసాగరుడు అన్నారు. మంగళవారం అక్కా చెరువు గ్రామంలో సర్పంచ్ వేల్పుల కృప మ్మ అధ్యక్షత జరిగిన సభలో ఆయన మా ట్లాడారు. పల్స్ సర్వేలో 40 మందిలో అర్హు లను గుర్తించమన్నారు. ఇప్పటికే మొదటి విడత గృహాలు మంజూరు అయి నిర్మాణపనులు చేపట్టారన్నారు. గ్రామసభలో గుర్తించిన పేర్లు మంజూరు కోసం ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ పల్స్ సర్వే ఆధారంగా ఇల్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇంటి నిర్మాణానికి కేంద్రప్రభుత్వం రూ.2లక్షలు మం జూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎవీ రవిశంకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, టీడీపీ నాయకులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• సినిమాలు

మార్కాపురం

శ్రీనివాస	- వైశాకం
రాధాకృష్ణ	- డిజె
సాయిబాలాజి	- ఫిదా
విశ్వేశ్వర	- దండుపాళ్యం-2
జగదీశ్వరీ	- గౌతమ్‌నంద
విజయా	- నిన్ను కోరి

పొదిలి

వెంకటేశ్వర	- ఫిదా
హరికృష్ణ	- గౌతమ్‌నంద
రాఘవేంద్ర	- పటేల్ ఎస్ఐఆర్

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన



స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.

ఆల్ప్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్-ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్



1. I would if I could, and if I couldn't, how could I? You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం


1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

నవ్వుల్ నవ్వుల్




రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

చుక్కలు కలపండి




దారి కనుక్కోండి



చెప్పగలరా?

జాబిలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క
చెప్పగలరా? : జాబిలి
జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు
జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB

దేవరపల్లి దళితులకు తక్షణ న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

నక్కా ఆనంద్‌బాబును ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అమరావతిలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో ముఖ్యమంత్రి సమావేశమై దేవరపల్లి సమస్యపై చర్చించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ, జిల్లాకు చెందిన మంత్రి శిద్దా రాఘవరావు, ముఖ్యమంత్రి సూచనతో దేవరపల్లిలో పర్యటించిన బృందంలో సభ్యులైన మంత్రి ఆనంద్‌బాబు, ఎర్రగొండపాలెం శాసనసభ్యుడు డేవిడ్ రాజుతోపాటు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు హాజరయ్యారు. వాస్తవానికి దేవరపల్లి సమస్యతోపాటు, అద్దంకి నియోజకవర్గ నాయకుల మధ్య నెలకొన్న అధిపత్య పోరు, తాజాగా అక్కడ నెలకొన్న సమస్యలపై కూడా చంద్రబాబు చర్చిస్తారని భావించారు. అయితే ముఖ్యమంత్రి దేవరపల్లి సమస్యపైనే ప్రధానంగా మాట్లాడారు. ఇటు స్థానిక శాసనసభ్యుడు ఏలూరి, అటు ఇన్‌చార్జి మంత్రి, జిల్లాకు చెందిన మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ ఇచ్చిన సమాచారానికి తోడు, ప్రభుత్వ సూచనతో అక్కడికి వెళ్లి వచ్చిన ఆనంద్‌బాబు, డేవిడ్‌రాజుల నుంచి కూడా వివరాలు తెలుసుకున్నారు. పార్లమెంట్ సమావేశాలకు వెళ్తున్నందున ఎంపీ మాల్యాద్రి ముందుగానే తన అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్ తన అభిప్రాయాన్నీ తెలిపారు. వీటన్నింటికీ తోడు ఇటు వామపక్షాలు, అటు ప్రజా సంఘాలు, ఇంకోవైపు వైసీపీ దళితులకు మద్దతుగా చేపట్టిన ఉద్యమం తీరుతెన్నులపై ముఖ్యమంత్రి సమాచారం తెప్పించుకున్నట్లు తెలిసింది.

మొత్తం అంశాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి దేవరపల్లి సమస్యకు తక్షణం ఫుల్‌స్టాప్ పెట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. అక్కడ దళితులు సంతృప్తి పడేవిధంగా చూడాలని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. 'చట్టం ఎలా ఉన్నా దళితులు సాగు చేసుకుంటున్న భూమిని చెరువు పునరుద్ధరణకు తీసుకున్నారు. అందువలన వారు భూములు కోల్పోయారు. ఒకవైపు దళితుల ఆర్థికాభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని వారికి భూములను ప్రభుత్వం కేటాయిస్తుంటే, మరో వైపు వారి ఆధీనంలో ఉన్న భూములను తీసుకోవడం సరికాదు!' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అదేసమయంలో ఇతర వర్గాల ప్రజలు చెప్పిన అభిప్రాయం ప్రకారం అక్కడ నీటి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉన్నదని, ఆ విషయంలోనూ మనం న్యాయం చేస్తామన్నారు. అందరినీ సమన్వయం చేసుకుని అన్ని వర్గాల సంక్షేమాన్ని మనం కాపాడతామన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని సూచించారు. తక్షణం భూములు కోల్పోయిన వారికి భూములు సమకూర్చే అంశంపై దృష్టి పెట్టాలని స్పష్టంగానే చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంలో ప్రధాన పాత్ర పోషించాలని మంత్రి ఆనంద్‌బాబును ఆదేశించారు. ఇతర అంశాలను సమన్వయం చేసుకోవాలని మిగిలిన నాయకులకు సూచించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే ఏలూరినుద్దేశించి 'మీ ఆలోచనలో న్యాయం ఉండవచ్చు. కానీ, సామాజిక న్యాయాన్ని కూడా మనం పరగణలోకి తీసుకోవాలి. ప్రజలందరి మధ్య సమన్వయాన్ని పెంపొందించాలి. కొన్ని సందర్భాల్లో న్యాయమైన డిమాండ్ పరిష్కారానికి కొన్ని ఇబ్బందులు ఉండవచ్చు. ఆ కారణంతో సామాజిక న్యాయాన్ని పక్కన పెట్టకూడదు' అని చంద్రబాబు అన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చెప్పిన స్పష్టమైన నిర్ణయాలతో సంతృప్తి చెందిన మంత్రులు, నాయకులు మీ అభిప్రాయాలు, నిర్ణయాలు, ఆదేశాలకు అనుగుణంగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

సీఎంను కలిసిన బలరాం

అద్దంకి నియోజకవర్గంలో నెలకొన్న తాజా పరిణామాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కొన్ని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని మంత్రులు నారాయణ, రాఘవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ భావించారు. తదనుగుణంగా ఈ అంశాన్ని కూడా సీఎం వద్ద ప్రస్తావించేందుకు సిద్ధమై వెళ్లారు. అదే సమయానికి శాసన మండలి సభ్యుడు కరణం బలరాం అక్కడకు చేరారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన అక్కడికి వెళ్లినట్లు చెప్తున్నారు. వీరందరికన్నా ముందు ఆయన చంద్రబాబు వద్దకు వెళ్లారు. ఆ తర్వాత కొద్ది నిమిషాల వ్యవధిలోనే మంత్రులు, జనార్దన్ కూడా లోపలికి వెళ్లారు. ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడేముంది, మరోసారి కలుద్దాం అంటూ లేచి ముందుకు సాగారు. ఆయనతోపాటు కారు వద్దకు వెళ్లిన దామచర్ల అద్దంకిలో పరిస్థితులకు సంబంధించి కొన్ని విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికిప్పుడు మాట్లాడాల్సిన అంశాలు ఏమున్నాయని, అవసరమైతే రెండు మూడురోజుల్లో కలుద్దామని అన్నట్లు తెలిసింది.

తొలుత ముఖ్యమంత్రి వద్దకు వెళ్లిన బలరాం అద్దంకి నియోజకవర్గంలో ఆది నుంచి టీడీపీలో ఉన్న శ్రేణులకు సంక్షేమ కార్యక్రమాల అమలులో అన్యాయం జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. పక్కా గృహాలు, పింఛన్‌ల మంజూరులో టీడీపీలోని పాత వారికి లబ్ధి చేకూరడం లేదని, ఈ విషయంలో వారికి న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. కొత్తగా పార్టీలో వచ్చిన వారికి అన్ని సౌకర్యాలు సమకూరుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అన్ని అంశాలను అలకించిన చంద్రబాబు అందరికీ న్యాయం చేయడం మన ధర్మమని, ఆ విషయంలో లోపం రానివ్వమని అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిసింది. ఈ సందర్భంగా బలరాం రాజకీయపరమైన అంశాలను ముఖ్యమంత్రితో ప్రస్తావించారా? లేదా? అన్నది తెలియరాలేదు. నిజానికి ముఖ్యమంత్రిని బలరాం కలిసి కొన్ని మాసాలు గడిచింది. ప్రస్తుతం ఆయన్ను కలిసే సమయానికి నియోజకవర్గాల పునర్విభజన ఉండదన్న నిర్ణయం వెల్లడైంది. ఈ నేపథ్యంలో తన కుమారుడు వెంకటేష్ రాజకీయ భవితవ్యంపై చంద్రబాబుతో బలరాం సంభాషించారా? లేదా? అన్నది చర్చనీయాంశమైంది. ఈ విషయమై బలరాంను ప్రశ్నించగా తాను కేవలం పార్టీ కార్యకర్తలు, అభిమానుల న్యాయం జరగాల్సిన అంశాలను మాత్రమే ప్రస్తావించానని స్పష్టం చేశారు. అద్దంకి విషయంలో అనుమానాలను నివృతి చేసుకునేందుకు మరోసారి ఆయన్ను కలవాలని మంత్రులతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ఏసీబీ వలలో ఫైర్ ఆఫీసర్

ఒంగోలు క్రైం : ఒంగోలులోని అగ్నిమాపక స్టేషన్ ఆఫీసర్ ఎం.వి. సుబ్బారావు ఏసీబీ వలకు చిక్కారు. ఓ ఆసుపత్రికి సంబంధించి ఎన్‌వోసీ రెన్యువల్‌కు రూ. 35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు ఆయన్ను అరెస్టు చేసి నెల్లూరుకు తరలించారు. తాను తీసుకునే లంచంలో ఉన్నతాధికారులకు కూడా వాటా ఉంటుందని సుబ్బారావు స్వయంగా ఏసీబీ అధికారులకు చెప్పడంతో ఆ వైపు కూడా విచారణ ప్రారంభించారు.

ఒంగోలు అరవై అడుగుల రోడ్డులో ఉన్న విజయా ఆసుపత్రికి సంబంధించిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) రెన్యువల్ కోసం అక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.జె.వి. శ్రీనివాస్ గత ఏడాది డిసెంబర్‌లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బారావును సంప్రదించారు. అప్పటి నుంచి ఆయన తిరుగుతున్నా అధికారులు స్పందించలేదు. చివరికి మీసేవ కేంద్రానికి వెళ్లాలని చెప్పడంతో శ్రీనివాస్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మీసేవ కేంద్రంలో రూ. 10,300 చెల్లించి ఎన్‌వోసీ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి అగ్నిపమాక శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సర్టిఫికెట్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బారావును సంప్రదించగా ఎన్‌వోసీ ఇచ్చేందుకు రూ.



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



ఫైర్ ఆఫీసర్‌ను ఏసీబీకి పట్టించి విజయ ఆసుపత్రి మేనేజర్ శ్రీనివాస్

50వేలు లంచం డిమాండ్ చేశారు. తొలుత రూ. 15వేలు తీసుకున్నాడు. మిగిలిన రూ. 35 వేలు ఇస్తే పని అయిపోతుందని చెప్పారు. దీంతో శ్రీనివాస్ ఈనెల 27న ఏసీబీ డీఎస్పీ తోట ప్రభాకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు సూచన మేరకు ఫైర్ ఆఫీసర్ సుబ్బారావుకు మంగళవారం విజయా ఆసుపత్రి మేనేజర్ శ్రీనివాస్ రూ. 35వేలు లంచం ఇస్తుండగా డీఎస్పీ తోట ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లు పట్టుకున్నారు. ఫైర్ ఆఫీసర్‌ను అరెస్టు చేసి నెల్లూరుకు తరలించారు.

అవినీతికి పాల్పడితే జైలుకే : ఏసీబీ డీఎస్పీ

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు అవినీతికి పాల్పడితే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ తోట ప్రభాకర్ హెచ్చరించారు. లంచాలు డిమాండ్ చేసే వారి వివరాలను ప్రజలు తమకు తెలియజేయాలని కోరారు. అగ్నిపమాక శాఖ ఒంగోలు ఫైర్ ఆఫీసర్ సుబ్బారావు రూ. 35వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారని తెలిపారు. తాను తీసుకున్న లంచంలో జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, సహాయ అగ్నిమాపకాధికారికి కూడా కొంత మొత్తం ఇవ్వాల్సి ఉంటుందని సుబ్బారావు చెప్పారన్నారు. వారి పాత్రపై కూడా విచారణ చేస్తామన్నారు.



పగాకు

ఒంగోలు ఆంధ్రజ్యోతి : సరుకు తక్కువగా ఉంటే డిమాండ్ అధికంగా ఉంటుంది. ఇది ఆర్థిక సూత్రం! అయితే దక్షిణాదిలో ఈ ఏడాది పొగాకు మార్కెట్ మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా సాగింది. సాధారణంగా ఈ ప్రాంతంలో పండే పంటలో ఈ ఏడాది 60శాతం తగ్గింది. పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి కన్నా 30శాతం మేర దిగుబడి తక్కువ వచ్చింది. అయినప్పటికీ ధరలు ఆశించిన స్థాయిలో లభించకపోగా, కనీసం పెరుగుదల కూడా కన్పించలేదు. ఈ ఏడాది కిలోకు గరిష్ఠ ధర రూ. 135 ఇస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు మొరపెట్టుకున్నా వ్యాపారులు ఆలకించ లేదు. ప్రస్తుతం పొగాకు వేలం ముగింపు దశకు చేరగా సగటు ధర కిలోకు రూ. 115 మించి లభించే అవకాశం కన్పించడం లేదు. దీంతో ఈ ఏడాది పంట సాగు చేసిన ప్రతి రైతూ నష్టం చవిచూడక తప్పడం లేదు.

భారీగా తగ్గిన ఉత్పత్తి

జిల్లాలో మూడేళ్ల క్రితం 130 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తి కాగా అప్పటి మార్కెట్ సంక్షోభంతో ధరలు లేక రైతులు అప్పులపాలయ్యారు. పదుల సంఖ్యలో ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఆ ఏడాది సగటున కిలోకు రూ. 98 ధర లభించగా అధిక ఉత్పత్తి ఇందుకు కారణమని అటు వ్యాపారులు, ఇటు పొగాకు బోర్డు అధికారులు చెప్తూ వచ్చారు. ఆ ఏడాది పరిస్థితితో కోలుకోలేని దెబ్బతిన్న పొగాకు రైతులు గత ఏడాది పంట సాగు తగ్గించారు. దక్షిణాదిలోని రెండు రీజియన్‌ల పరిధిలో 72 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే ఉత్పత్తి జరగ్గా సగటున కిలోకు రూ. 109 మేర ధర దక్కింది. ఈ రెండేళ్ల ప్రభావంతో సీజన్‌లో పంట ఉత్పత్తి మరింత తగ్గింది. ధరల్లో మాత్రం పెద్దగా మార్పు లేదు. ఈ ఏడాది దక్షిణాదిలోని 14వేలం కేంద్రాలలో 84 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి 55 మిలియన్ కిలోలు (65శాతం) పండినట్లు బోర్డు అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మార్చి 15న పొగాకు కొనుగోళ్లను ప్రారంభించారు.

ఒడిదుడుకుల మధ్య కొనుగోళ్లు

ఈ ఏడాది పంట సాగు, పెట్టుబడి ఖర్చులు, ఉత్పత్తి సరిగా రాకపోవడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని సగటు ధర కిలో రూ. 135కు తగ్గకుండా ఇవ్వాలని పొగాకు వేలం ప్రారంభ సమయంలో రైతుల నుంచి గట్టి డిమాండ్ వచ్చింది. బోర్డు అధికారులు కూడా ఒత్తిడి పెంచడంతో కొందరు వ్యాపారులు ఆరంభంలో సానుకూలంగా వ్యవహరించారు. కిలో గరిష్ఠ ధర రూ. 160తో వేలంప్రారంభించారు. అలా పక్షం రోజులు మార్కెట్ సజావుగానే సాగింది. ఆతర్వాత వ్యాపారులు ధరలను తగ్గించడంతోపాటు, కొన్ని రకాల గ్రేడ్‌ల కొనుగోలుకు ఆసక్తి చూపలేదు. దీంతో మేలు రకం, మీడియం గ్రేడ్‌లకు ధరలు తగ్గగా అధికంగా పండిన లోగ్రేడ్ కొనుగోళ్లు సక్రమంగా లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. జూన్‌లో జీఎస్టీ గొడవతో వేలం ప్రక్రియ అసలు ముందుకు సాగలేదు. అలా తీవ్ర ఒడిదుడుకులను ఎదర్కొన్న పొగాకు మార్కెట్ గత నెలలో కాస్తంత గాడినపడినట్లు కన్పించింది. వ్యాపారులు పోటీపడి ధరలు పెంచారు. మేలు రకం గ్రేడ్‌ల ధర కిలో రూ. 169 నుంచి 190, అక్కడి నుంచి రూ. 203 వరకు కూడా వెళ్ళాయి. మీడియం గ్రేడ్‌ల ధరలు కిలో రూ. 160కు చేరువయ్యాయి. అయితే మేలు రకం, మీడియం గ్రేడ్‌లలో 95శాతం పంట కొనుగోలు చేశాక ఆ ధరలు ఇచ్చినా రైతులకు ఏమాత్రం ఉపయోగడలేదు. దీంతో సగటు ధరలు తగ్గిపోయాయి.

ముగింపు దశలో మార్కెట్

ప్రస్తుతం మార్కెట్ ముగింపు దశకు చేరింది. పంట ఉత్పత్తి తగ్గడంతో మన జిల్లాతోపాటు, నెల్లూరు జిల్లాలోని 14 వేలం కేంద్రాలకు బదులు ఈ ఏడాది 12 కేంద్రాల్లోనే అధికారులు కొనుగోళ్ల ప్రక్రియన నిర్వహించారు. వాటిలో ఇప్పటికే ఏడు కేంద్రాల్లో అధికారిక పంట కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇక ఐదు కేంద్రాల్లో మాత్రమే వేలం జరుగుతుండగా ఈ వారంలో మరో మూడు, నాలుగు కేంద్రాలలో ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకు సుమారు 56 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయగా సగటు ధర కిలోకు రూ. 118 వరకు లభించింది. మరో మూడు, నాలుగు మిలియన్ కిలోలు కొనుగోలు చేయాల్సి ఉండగా అందులో 99శాతం లో గ్రేడ్ ఉన్నట్లు సమాచారం. దీని వలన సగటు ధర ఇంకా తగ్గనుంది. వేలం ముగిసే నాటికి సగటు ధర కిలోకు రూ. 115 మించే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో పంట సాగు చేసిన ప్రతి రైతు నష్టపోవడం ఖాయమైంది.

రానున్న సీజన్‌పై బోర్డు దృష్టి

ప్రస్తుత సీజన్ పొగాకు వేలం ముగింపు దశకు చేరడంతో రానున్న సీజన్ పంట సాగు, ఉత్పత్తి ఖరారుపై పొగాకు బోర్డు దృష్టి పెట్టింది. ఇప్పటికే అటు వ్యాపారులు, ఇటు రైతుల నుంచి బోర్డు అధికారులు అభిప్రాయ సేకరణ చేశారు. గత ఏడాది పరిమాణం మేరకే రానున్న సీజన్‌కు పంట సాగు, ఉత్పత్తికి అనుమవ్వాలని రైతులు ఇప్పటికే బోర్డు అధికారులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 133 మిలియన్ కిలోలకు ఇండెంట్ ఇచ్చిన వ్యాపారులు ఉత్తరాదిలోనూ, దక్షిణాది నల్లనేలల్లోనూ గతం కన్నా ఎక్కువ అనుమతి ఇచ్చి దక్షిణాది తేలిక నేలల ప్రాంతంలో తగ్గించాలని కోరినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఎల్ఎస్ ప్రాంత రైతు నేతలు మంగళవారం సాయంత్రం కందుకూరులో సమావేశమై చర్చించారు. తమకు అనుమతి తగ్గిస్తే పెట్టుబడులు పెరిగి నష్టపోతామని నల్లరేగడి ప్రాంత రైతులతో సమానంగా తమ ప్రాంతంలో కూడా పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని బోర్డును కోరుతూ తీర్మానించారు. బ్యారన్‌కు రూ. 5 లక్షలపరిహారం ఇస్తే పొగాకు సాగు నుంచి పూర్తిగా వైదొలుగుతామని ప్రకటించారు.

టీకాతో వ్యాధుల నుంచి రక్ష

■ కలెక్టర్ వినయ్‌చంద్ ■ ఒంగోలులో మీజిల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ ప్రారంభం

ఒంగోలు నగరం : చిన్నారులకు వ్యాధుల నుంచి రక్షణ కల్పించి ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రభుత్వం టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నదని కలెక్టర్ వాడరేవు వినయ్‌చంద్ తెలిపారు. మంగళవారం స్థానిక రాంనగర్ రెండో లైనులోని పాఠశాలలో ఆయన మీజిల్స్ రూబెల్లా (ఎంఆర్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీకాల ద్వారా ఇప్పటికే అనేక వ్యాధులను నిరోధించగలిగామన్నారు. కొత్తగా రూపొందించిన ఎంఆర్ టీకా ద్వారా తట్టు, పొంగు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ప్రాణాంతకమైన ఈ రెండు వ్యాధులు ఇక దరిచేరవన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం వచ్చేనెల 8వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. జిల్లాలో 8.57లక్షల మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 9నెలల వయసు నిండిన వారి నుంచి 15 సంవత్సరాల లోపు వారందరికీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమారి, డీఎంహెచ్‌వో డాక్టర్ యాస్మిన్. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శంకుంతల, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులోని వ్యాక్సినేషన్ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్‌చంద్


మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఆర్‌జేడీ శ్రీనివాస్

తల్లిపాలు అమృతం

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ శ్రీనివాస్

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

ఒంగోలు నగరం : తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ టి.వి. శ్రీనివాస్ అన్నారు. ముర్రుపాలు తాగించడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఒంగోలు రాంనగర్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ ముర్రుపాలు తాగించడం వలన శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగించి ముర్రుపాల ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం చేయాలని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచించారు. సభలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీ దుర్గ, కేర్ సంస్థ ప్రతినిధి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో భారీ వర్షం

• పలు చోట్ల నిలిచిన వర్షపు నీరు
• రాకపోకలకు ఇబ్బందులు


ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

అద్దంకి టౌన్ : అద్దంకిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట సేపు ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు రోడ్లు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో మోకాలు లోతు నీరు నిలిచిపోయింది. ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్, అవుట్ గేట్‌ల వద్ద వర్షపు నీరు భారీగా నిలవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదేసమయంలో కళాశాలలు, పాఠశాలలు కూడా వదలి పెట్టడంతో బస్టాండ్ కిటకిటలాడింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆట స్థలంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో చిన్నారులు ఆ నీటిలో ఆడుకుంటు ఉత్సాహంగా గడిపారు. ఇక అద్దంకి పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో పలు ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం పూర్తి కాక మురుగు నీరు రోడ్లపైకి పొంగింది. పలు కాలనీలలో మట్టి ఓడ్లపై వర్షపు నీరు నీలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పొలాలు దున్ని సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.


ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిలిచిన నీరు

ఉద్యోగులపై సీఎం సానుకూల స్పందన

మూడు నెలల్లో అనేక సమస్యల పరిష్కారం

అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు, అమరావతి జేఏసీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్ : ఉద్యోగుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల దృక్పథంతో ఉన్నారని అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. మూడు నెలల్లో అనేక సమస్యలను ఆయన పరిష్కరించారన్నారు. ఒంగోలులోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులను 30 ఏళ్ల సర్వీసుకే తొలగిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. దాన్ని ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. అమరావతి జేఏసీ ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించారన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించారన్నారు. సీపీఎస్ పరిధిలో పనిచేస్తున్న లక్షా 87వేల మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ, పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అటువంటి వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఎందుకు పనిచేస్తారని ఆయన ప్రశ్నించారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుకునేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బొప్పరాజు తెలిపారు. సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో ఆర్టీసీ కార్మికుల 60 రోజుల సమ్మె విషయం, ప్రభుత్వ వైద్యుల సమస్యలను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తున్నదన్నారు. రాష్ట్రంలో వారం రోజుల నుంచి ప్రభుత్వ ఉద్యోగులను 30 ఏళ్ళ సర్వీసుకే తొలగిస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారుతో మాట్లాడిన తర్వాతనే తాను చెప్తున్నానని బొప్పరాజు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా స్వేచ్ఛగా ఉద్యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపన

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం పంచాయతీ కార్యాలయ నూతన భవనానికి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.15 లక్షలతో నిర్మించే నూతన పంచాయతీ కార్యాలయానికి శంకుస్థాపనతో పాటు రూ.35 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లుకు శంకుస్థాపన చేయనున్నారు.

8 మందికి సీఎం సహాయనిధి

అద్దంకి: వైద్య చికిత్సలు పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 8 మందికి రూ.22.75 లక్షలు ఎల్‌వోసీలు మంజూరైనట్లు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకికి చెందిన కొవ్వూరి సుబ్బులుకు రూ.3.50 లక్షలు, గొర్రెముచ్చు సుబ్బారావుకు రూ.3.25 లక్షలు, గుంజి శ్రీనివాసరావుకు రూ.5 లక్షలు, శింగరకొండపాలెంకు చెందిన ఎర్రిబోయిన వెంకటేశ్వర్లుకు రూ.3.5 లక్షలు, పరిటాలవారిపాలెంకు చెందిన కుందుర్తి లింగమూర్తికి రూ.3.25 లక్షలు, కుందుర్రుకు చెందిన మన్నేపల్లి రాంబాయమ్మకు రూ.1.50 లక్షలు, ధైవాలరావూరుకు చెందిన కొలసన కోట మల్లయ్యకు రూ.3.25 లక్షలు, కల్లంవారిపాలెంకు చెందిన భవనం సుబ్బారెడ్డికి రూ.1.50 లక్షలు ముందస్తు వైద్యసహాయం కోసం మంజూరైనట్లు తెలిపారు.

రంగస్థల కళాకారుడు సోడిశెట్టి మృతి

అద్దంకి: పట్టణంలోని బలిజపాలెంకు చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు సోడిశెట్టి వెంకటేశ్వర్లు (85) అనారోగ్యంతో మంగళవారం ఉదయం స్వగృహంలో మృతిచెందారు. ఆయన బ్రహ్మంగారి పాత్రలో నటించి మెప్పించారు. మరికొన్ని పౌరాణిక పాత్రల్లో



కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అద్దంకి రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు అద్దంకి నాగేశ్వరరావు, తంగెళ్ల నరసింగరావు, యాదాల కాశీరాజు, తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పాతమాగులూరు హత్యకేసు కొట్టివేత

సంతమాగులూరు: మండలంలోని పాతమాగులూరులో 2013లో సంచలనం సృష్టించిన అడకా పద్మ హత్య కేసును కొట్టివేస్తూ బుధవారం ఒంగోలు కోర్టులో జడ్జి తీర్పు చెప్పారు. నిందితుడు అడకా కృష్ణను నిర్ధోషిగా విడుదల చేస్తూ తీర్పు ఇచ్చారు.

మౌలా నగర్‌లో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

- కాలువలు పూడి ఎక్కడ నీరు అక్కడే
- నిరసన వ్యక్తం చేసిన స్థానికులు

అద్దంకి టౌన్: కాలువలు సక్రమంగా పనిచేయక వర్షపునీరు భారీ స్థాయిలో నిలిచిపోయి ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం మౌలానగర్‌లో చోటుచేసుకుంది. ఇక్కడ మురుగునీరు వచ్చే కాలువలకు, ప్రధాన రహదారి వెంబడి నూతనంగా నిర్మించిన డ్రైనేజీకి పొంతన లేకపోవడంతో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయాయి. మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుండటంతో ఎవరూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో కొద్దిసేపు స్థానికులు ప్రధాన రహదారిపై వాహనాలు ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం గ్రామ పంచాయతీ అధికారులు ఎస్కవేటర్‌తో వర్షపునీరు బయటకు పోయేందుకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రైనేజీ పక్కనే మరో కాలువ తీసి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. దీంతో



మట్టిని తొలగిస్తున్న ఎస్కలేటర్, డ్రైనేజీ పక్కనే తీసిన కాలువ

వర్షపు నీరు వెళ్లటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాలువ తీసినట్లుగా అక్కడ బోర్డులు ఏర్పాటు చేశారు.

చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలి



అద్దంకిలో వ్యాక్సిన్ వేస్తున్న మెడికల్ ఆఫీసర్ నాగభూషణం

అద్దంకి టౌన్ : ప్రభుత్వం చిన్నారులకు మీజిల్స్, రూబెల్లా వ్యాధులను ఒక్క టీకాతో నివారించే కార్యక్రమం చేపట్టిందని దీనిని 9 నెలల నుండి 15 సంవత్సరాలలోపు చిన్నారులందరు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్ పర్సన్ పరిమి దయామణి అన్నారు. మంగళవారం బంగ్లారోడ్డులోని భాష్యం స్కూల్‌లో ఎంఆర్ టీకా ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయామణి మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 8 వరకు ఈ టీకా కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ప్రభుత్వం ఉచితంగా అందించే వ్యాక్సిన్‌ను అర్హులైన చిన్నారులందరి అందిలా చూడాలన్నారు. అందుకు తల్లిదండ్రులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు డాక్టర్ సిహెచ్.నాగభూషణం చిన్నారులకు టీకాను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నారాయణరావు, మండల విద్యాశాఖ అధికారి నూనె విజయకుమార్, డాక్టర్ శశికాంత్, డాక్టర్ జయచంద్ర, ఆరోగ్య విస్తర్ణాధికారి నీలం రామకోటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ జి.వి.ఎస్.శాస్త్రి, రాజవర్ధిని, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతమాగులూరు మండలంలో...

మండలంలోని ఏల్చూరు, సంతమాగులూరు గ్రామాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేసినట్లు డాక్టర్ నారాయణ తెలిపారు. మొత్తం 2926 మంది చిన్నారులు ఉండగా 2381 మందికి వేయటం జరిగిందన్నారు. కొంతమంది చిన్నారులు పాఠశాలలకు హాజరు కాకపోవటం వలన 81% మాత్రమే వ్యాక్సిన్ వేయటం జరిగిందన్నారు. వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులందరు ఆయా గ్రామాలలోని ఎఎన్ ఎమ్‌లను సంప్రదించి తప్పని సరిగా ఎమ్ఆర్ వ్యాక్సిన్ ను వేయించుకోవాలని డాక్టర్ నారాయణ తెలిపారు.

మేదరమెట్లలో...

కొరిశపాడు మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాలలో మేదరమెట్ల ఆ రోగ్యం కేంద్రం డాక్టర అవినాష్ బృందం వేస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మాధవీలత పరిశీలించారు. 1601 మంది పిల్లలకు టీకాలు వేసినట్లు వారు తెలిపారు.

పంగులూరు మండలంలో...

పంగులూరు, కొండమంజులూరు, ముప్పవరం, చందలూరు కశ్యాపురం గ్రామాల్లో మంగళవారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 2,031 మంది బాల బాలికలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఝాన్సీలక్ష్మి, శ్రీనివాసరావు, టి.కృష్ణయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలో దరఖాస్తుల పరిశీలన

సంతమాగులూరు: మండలంలోని ఏల్చూరు, మామిళ్ళపల్లి గ్రామాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సభలు జరిగాయి. గతంలో గ్రామాల్లో జరిగిన సాధికారిత సర్వేలో నివేశన స్థలాల కోసం, ఎన్టీఆర్ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పరిశీలించి నిజమైన లబ్ధిదారులను గుర్తించటం జరుగుతుందని తహసీల్దారు టి.ఎల్.కాంతారావు అన్నారు. నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి పట్టాలు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నూతన గృహాలు మంజూరు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ్రాది నాయుడు, హౌసింగ్ ఏఈ ప్రకాష్‌రావు, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మనాయుడు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవాలి

సంతమాగులూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో బుదవారం సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ టి.ఎల్.కాంతారావు అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇస్తామని చెప్పారు. లేకుంటే రెండు రోజుల్లో అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు తల్లి పాల వారోత్సవాల ప్రారంభం

సంతమాగులూరు: తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం సంతమాగులూరులో తల్లి పాల వలన కలిగే ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించటం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో తప్పనిసరిగా తల్లి పాల వారోత్సవాలు నిర్వహించాలని కార్యకర్తలను సూచించారు.

నేడు రెండు గ్రామాలలో గ్రామసభలు

సంతమాగులూరు: మండలంలోని కొమ్మాలపాడు, మక్కెనవారి పాలెం గ్రామాలలో బుధవారం గ్రామసభలు నిర్వహించటం జరుగుతుందని తహసీల్దార్ టి.ఎల్.కాంతారావు అన్నారు. సాధికారికత సర్వేలో నివేశన స్థలాలు, గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించటం జరుగుతుందని చెప్పారు.

4న కొండమంజులూరులో విగ్రహ పునః ప్రతిష్ఠ

పంగులూరు: మండలంలోని కొండమంజులూరు గ్రామంలో ఈ నెల 4వ తేదీన ఉదయం 9.30 గంటలకు పోలేరమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరగనుంది. గ్రామస్తులు ఐక్యంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వేద పండితులు శ్రీశైలనాధన్ అయ్యంగారి పర్యవేక్షణలో ప్రారంభించారు. మంగళవారం రాత్రి పోలేరమ్మ తల్లి విగ్రహానికి సముద్ర స్నానానికి తోడ్కొని వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా కార్య క్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన యాగశాలను సిద్ధం చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



పోలేరమ్మ ఆలయం, సిద్ధం చేసిన యాగశాల

అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేసేందుకు నిధుల మంజూరు

అద్దంకి: మండలంలోని రెండు అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా ఉన్న నేపథ్యంలో వాటిని పూర్తి చేసేందుకు రూ.6 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో హేమాద్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వెంపరాల ఎస్సీ కాలనీలో, చెరువుకొమ్ముపాలెం ఎస్సీ కాలనీలో ఉన్న రెండు భవనాలు పూర్తి చేసేందుకు ఒక్కొక్క దానికి రూ.3 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

సినిమా గైడ్

అద్దంకి

కళామందిర్ - ఫిదా
శ్రీరామ - డీజే
మినీ విఎన్‌ఎస్ - గౌతమ్‌నందా

మేదరమెట్ల

నారాయణ
చిత్రాలయ - గౌతమ్‌నందా

పేకాట శిబిరంపై దాడి

చీరాలటౌన్ : చీరాల మండలం ఆదినారాయణపురంలో పేకాట శిబిరంపై మంగళవారం టూటౌన్ పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ. 1400లు స్వాధీనపరచుకున్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

చీరాలరూరల్ : విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఈపూరుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపూరుపాలెం ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

భూ పోరాటానికి విరాళాల సేకరణ

చీరాల : పర్చూరు మండలం దేవరపల్లిలో దళితులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి పోరాటానికి అవసరమైన నిధుల కోసం సీఐటీయూ, పలు ప్రజా సంఘాల నాయకులు మంగళవారం చీరాల పట్టణంలో విరాళాలు సేకరించారు. కారంచేడు గేటు సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహ కూడలి నుంచి విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శి ఎన్.బాబూరావు, వసంతరావు, బలహీన వర్గాల సమాఖ్య ప్రతినిధి గోసాల ఆశీర్వాదం, గోసాల సుధాకర్, గొట్టిపాటి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

చీరాల : చర్చి కాంపౌండ్ సమీపంలోని మున్సిపల్ స్పెషల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు సర్దార్ గౌతు లచ్చన్న జ్ఞాపకార్థం బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ముఖర్జీ, ఫెడరేషన్ నాయకులు న్యాయవాది మస్తాన్‌రావు, యెనుముల యానాదిరావు, మండా సత్యనారాయణ, గుంటి ఆదినారాయణ, జ్వాలా నరసింహం, అన్నం సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్యామల, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కౌలు రైతులకు బ్యాంకులలో రుణాలు

చీరాల : కౌలు రైతులు ప్రభుత్వపరంగా ఇస్తున్న కౌలురైతు గుర్తింపు కార్డుల ద్వారా బ్యాంకులలో రుణాలు పొందవచ్చని ఏవో ఫాతిమా చెప్పారు. మంగళవారం పెర్లవారిపాలెం, కీర్తివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కౌలు రైతులు ఆధార్‌కార్డు, పొలం పాస్‌పుస్తకం జిరాక్స్, పంట వేసినట్లు ధ్రువీకరణతో రుణాలు పొందవచ్చన్నారు. దీంతో పాటు అన్ని రాయితీలు కౌలు రైతులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారులు సాంబశివరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాలటౌన్ : చీరాల మండలం ఈపూరుపాలెంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. విజయలక్ష్మీ థియేటర్ సమీపంలో ఉండే ఒక దుకాణం వద్ద మృతదేహాన్ని గుర్తించారు. వీఆర్వో ఫక్రుద్దీన్ ఫిర్యాదు మేరకు ఎస్సై దాసరి ప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీరాలలో సినిమాలు

థియేటర్		సినిమా
మోహన్	-	ఫిదా
సంగం	-	గౌతమ్‌నందా
సాయిప్యాలెస్	-	శమంతకమణి
శాంతి	-	డీజే

భారీ వర్షంతో జలమయమైన వీధులు

చీరాలటౌన్ : పందిళ్ళపల్లి - వేటపాలెం ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. చీరాలలో ఒక మోస్తరు వర్షం పడింది. దీంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు గంట వరకు విడవని వానతో ఎక్కడి వారు అక్కడే ఉండి పోవాల్సి వచ్చింది. ప్రధాన రహదారులపై సైతం నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు.



చినగంజాంలో రోడ్డుపై నిలిచిన నీరు

చినగంజాం మండలంలో...

చినగంజాం మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. చినగంజాంలోని అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధానంగా చినగంజాం-సోపిరాల రోడ్డులో సుమారు మోకాలి లోతు వర్షపు నీరు చేరింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సాధారణంగా చిన్నపాటి వర్షానికే చినగంజాం సెంటర్‌లో రహదారిపై వర్షపు నీరు నిలుస్తుంది. భారీ వర్షం కావటంతో ఇతర రోడ్లు కూడా జలమయం అయ్యాయి. వర్షానికి నిల్వ ఉన్న ఉప్పు కొఠారు వద్ద నిల్వ ఉన్న ఉప్పు రాశులలోకి ఒకింత వర్షపు నీరు చేరి ఉంటుందని, దీని వలన కొంతమేర ఉప్పు కరిగే అవకాశం ఉండచ్చని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలలో ఇదే పెద్ద వర్షం. దీంతో ఆకుకూరలు, కూరగాయల సాగుదారులకు ఉపశమనం కలిగింది.

ఇంకొల్లు మండలంలో...

ఇంకొల్లులో మంగళవారం సాయంత్రం రెండు గంటల పాటు ఎడతెరపని వర్షం కురిసింది. గత 20 రోజులుగా పదునైన వర్షం పడితే విత్తనాలు విత్తుకుందామని రైతులు ఎదురుచూస్తుండగా మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వేసిన పత్తిపంటకు కూడా ఈ వర్షం మేలు చేస్తుందని అంటున్నారు.

2700 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్

చీరాలఅర్బన్ : తట్టు, పొంగు వ్యాధులు రాకుండా ముందస్తుజాగ్రత్త చర్యలలో భాగంగా ఎం.ఆర్ వ్యాక్సిన్ టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం చీరాల పీపీపీ యూనిట్ ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ప్రారంభమైంది. తొలిరోజు స్కూల్‌లోని 2700 మందికి టీకాలు వేశామని వైద్యాధికారిణి డాక్టర్ పి.కమలశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో పాల్, శ్యామ్, అరుణ, సుధ తదితర ఆరోగ్యశాఖ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



చీరాలలో టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

వేటపాలెం మండలంలో...

బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యాంసన్ మాట్లాడుతూ మండలం పరిధిలో 9,713 మంది పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోవడం జరిగిందని తెలిపారు. 1300 మందికి వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిదని తెలిపారు.

వైద్యఖర్చులకు దాతల చేయూత

చీరాలఅర్బన్ : ప్రమాదవశాత్తూ మహిళామండలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి, అనాధ అయిన శివ కాలు విరిగి చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేరాడు. అతని వద్ద ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు లేకపోవడం, కాలుకు సర్జరీ చేయాల్సిందేనని వైద్యులు తేల్చి చెప్పటంతో భాష తెలియని శివ కన్నీటి పర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న లారీ అసోసియేషన్ ప్రతినిధులు జి.మురళి, టి.మాణిక్యాలరావు వైద్యఖర్చులు అందజేస్తామని ముందుకు వచ్చారు. వీరితో పాటు డాక్టర్ కొండలరావు సహకారంతో తాను కూడా ఉచితంగా వైద్యం అందజేస్తానని ఎముకల, కీళ్ళ వైద్య నిపుణురాలు డాక్టర్ శారదాబాయి హామీ ఇచ్చారు. దాతల దాతృత్వాన్ని పలువురు అభినందించారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

వేటపాలెం: బ్యాంకులో ఖాతా ఉన్న ప్రతిఒక్కరూ తమ ఆధార్ నెంబర్‌ను ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ వై.ప్రసాద్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణలో ఎన్‌ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో కూలీలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆధార్ అనుసందానం చేసుకోని వారికి కూలి డబ్బులు తమ ఖాతాలకు జమ కావని తెలిపారు. బ్యాంకులో ఖాతా లేని వారు వెంటనే ఖాతాలు ప్రారంబించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం సంతోషం, సిబ్బంది శ్యాంసన్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్రగాయాలు

చీరాలటౌన్ : విద్యుదాఘాతంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పర్చూరు మండలం వీరన్నపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వీరన్నపాలెంగ్రామంలో జాన్సన్ అనే వ్యక్తి విద్యుత్ స్థంభం ఎక్కి లైన్లు సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని 108లో వెంటనే చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు రిఫర్ చేశారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

డీఎస్పీ ప్రేమ్‌కాజల్

చీరాలటౌన్ : రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని జన జీవనస్రవంతిలో భాగం కావాలని చీరాల డీఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్ సూచించారు. చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మీ ప్రవర్తన మార్చుకుంటే రౌడీషీట్ ఎత్తివేసేలా ఎస్పీకి సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో 8 మంది రౌడీషీటర్లు, ఎస్సై వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

చీరాలఅర్బన్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్ని సబ్జెక్టుల పుస్తకాలు వెంటనే పంపిణీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ తన్నీరు విజయ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చీరాల సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి విద్యారంగ సమస్యలపై సమీక్షించామన్నారు. ఈ సమావేశంలో పవన్‌కుమార్, ప్రతాప్‌కుమార్, స్టాలిన్, మనోజ్, రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

వేటపాలెం: విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం బండ్ల బాపయ్య హిందూ డిగ్రీ కళాశాల్లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాల ని, స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో చురుగా పాల్గొని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి, వైస్ ప్రిన్సిపాల్ డి.నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘ ఉపాధ్యక్షుడి ఎంపిక

వేటపాలెం: వేటపాలెంకు చెందిన పట్టభద్రుల సంఘం సభ్యుడు, వంకా శ్రీనివాసరావు జిల్లా మానవహక్కుల సంఘం ఉపాధ్యక్షుడి ఎంపికైనట్లు పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మంగళవారం తెలిపారు. బుధవారం ఒంగోలులోని హోటల్ మౌర్యాలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలిపారు. శ్రీనివాసరావుని క్యాష్యూ మాన్యుఫ్యాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సుధాకర్, సెక్రటరీ జి.ఆంజనీయులు, ఎం.విద్యాసాగర్, పి.శివప్రసాద్, న్యాయవాది ప్రసాద్, పట్టభద్రుల సంఘం సభ్యులు అబినందించారు.

అత్యున్నత విద్యాబోధనే ఆల్టస్ లక్ష్యం

చీరాల : ప్రాథమిక దశ నుంచి విద్యార్థులకు అత్యున్నత విద్యాబోధనే లక్ష్యంగా చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్భాగమైన ఆల్టస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన జరుగుతుందని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి తేళ్ళ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. అందులో భాగంగా విద్యతో పాటు విజ్ఞాన విహార యాత్రలకు సంబంధించి అవగాహన కల్పించేందుకు మంగళవారం వేటపాలెం మండలం పరిధిలోని కనకనాగవరపమ్మ గుడి, చుట్టుపక్కల ప్రాంతాలలోని పండ్ల తోటలను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సామాన్యశాస్త్ర అధ్యాపకురాలు లతాఫ్లోరెన్స్ ఆయా పండ్ల తోటల వాడుక పేరు, శాస్త్రీయ నామాలను విద్యార్థులకు వివరించారు. ప్రతినెలా ఇలాంటి విజ్ఞాన విహారయాత్రలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్టస్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్ కురియాకోస్, ప్రిన్సిపాల్ సుశీలా కురియాకోస్‌లు విద్యార్థులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

వేటపాలెం: మండలం పరిధిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు బుధవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దారు మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిదిలో గతంలో నిర్వహించిన ప్రజా సాధికార సంస్థ సర్వేలో 6,594 మంది గృహాలు లేనట్లు నమోదు చేయించుకోవడం జరిగిందని తెలిపారు. వీరిలో అర్హులను గుర్తించడానికి గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 2న పందిళ్లపల్లి, అక్కాయిపాలెం, 3న పుల్లపాలెం, పాపాయిపాలెం, 4న వేటపాలెం, చల్లారెడ్డిపాలెం, 5న దేశాయిపేట, 7న రామన్నపేట, 8న కొత్తపేట గ్రామ పంచాయతీల వద్ద ఉదయం 10 గంటలకు గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అర్హులు గ్రామసభలకు రావాలని సూచించారు.

లబ్ధిదారుల ఎంపికకు సహకరించాలి

చీరాల రూరల్ : మండల పరిధిలోని బుర్లవారిపాలెం గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఇళ్లు లేని వారి వివరాలు సేకరించేందుకు సహకరించాలని తహసీల్దారు తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో ఇల్లు లేవని నమోదు అయిన వారి వివరాలను మంగళవారం గ్రామసభలో గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు కురిచేడు మండల సర్వసభ్య సమావేశం

కురిచేడు : మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 3న మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపీపీ గడ్డం వెంకట రత్నమ్మ అధ్యక్షతన స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస రావు తెలిపారు. సమావేశంలో మండల అభివృద్ధి అంశాలపై చర్చ జరుగుతుందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. అధికారులు ప్రగతి నివేదికలను తీసుకుని రావాలన్నారు.

రామలింగమ్మకు టీడీపీ నాయకుల నివాళులు

దర్శి : మండలంలోని ఎర్ర ఓబనపల్లిలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన గుంటూరు రామలింగమ్మ(75) మృతదేహాన్ని దర్శి మండల టీడీపీ అధ్యక్షుడు నారపుశెట్టి పిచ్చయ్య, మండల ప్రధాన కార్యదర్శి మారెళ్ళ వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

నేడు స.హ. చట్టం దినోత్సవం

దొనకొండ : సమాచారహక్కు చట్టం దినోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కావేటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు.

చినుకులకే చిత్తడి..

అధ్వానంగా కాశీపురం రోడ్డు

బురదమయమై రాకపోకలకు ఇబ్బందులు



ఛిద్రమైన కాశీపురం రోడ్డు

పడమర కాశీపురం (కురిచేడు) : మండలంలోని పడమర కాశీపురం రోడ్డు బురదమయమైంది. మంగళవారం తెల్లవారు జామున కురిసిన కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్ర వాహనాల చక్రాలకు మట్టి అతుక్కుని ముందుకు కదలడం లేదు. కొన్ని వాహనాలు రోడ్డుపై నుంచి పక్కకు జారిపోతున్నాయి. బురదలో చిక్కుకుపోయిన వాహనాలను తీసేందుకు వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చిన ప్రతిసారీ సమస్య పునరావృతం అవుతుందని ప్రజలు చెబుతున్నారు. కల్లూరు నుంచి పడమర కాశీపురం వరకు తారు రోడ్డును నిర్మించాలని వారు కోరుతున్నారు.

దర్శిలో మోస్తరు వర్షం

దర్శి : దర్శి ప్రాంతంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ మండిపోయింది. రెండు గంటల సమయంలో మబ్బులు పట్టి ఉరుములు, గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో పలుచోట్ల కరెంటు తీగలు తెగిపోయి, విద్యుత్ సరఫరాకు కొంత సేపు అంతరాయం కలిగింది. ఈ వర్షం వల్ల సాగుచేసిన పైర్లు జీవనం పోసుకొనే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా దర్శి, దొనకొండ మండలాల్లో పిడుగుపాటుకు నలుగురు మృతిచెందడం విషాదాన్ని నింపింది.

కురిచేడులో..

కురిచేడు : మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. పడమర గంగవరం, గంగదొనకొండ, రెడ్డెన్నపల్లె గ్రామాలలో గంట పాటు వర్షం పడింది. ఈ వర్షం ఇటీవల సాగు చేసిన పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారు జామున కూడా చెదురుమదురు జల్లులు పడ్డాయి. కొంతకాలంగా వేసవిని తలపిస్తూ ఎండలు కాయడం వల్ల పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ దశలో మంగళవారం కురిసిన వర్షానికి పంటలు జీవం పోసుకునే అవకాశం ఉంది.

ముండ్లమూరులో

ముండ్లమూరు : మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఇది కంది, పెసర, సజ్జ పంటలకు ఉపకరిస్తుంది. మారెళ్ళ, ఈదర, జమ్మలమడక, మక్కెనవారిపాలెం, నాయుడుపాలెం, సూళ్లికళ్లపల్లి, తూర్పు కంభంపాడు, పులిపాడు, రెడ్డినగర్, పెద్ద ఉల్లగల్లు, పసుపుగల్లు కూడా మోస్తరు వర్షం కురవగా వేముల, బొప్పూడివారిపాలెం, భీమవరం గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి.

రైతుల పక్షపాతి లాల్ అహ్మద్

కురిచేడు : ఎన్నెస్పీ ఆపరేషన్, మెయింటెనెన్స్ డివిజన్ డీఈఈ లాల్ అహ్మద్ రైతుల పక్షపాతి అని ఎమ్మెల్సీ కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. లాల్ అహ్మద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం స్థానిక ఎన్నెస్పీ కార్యాలయంలో సోమవారం రాత్రి భారీ ఎత్తున జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని లాల్ సేవలను కొనియాడారు. ముందుగా కరణం బలరాం ఆయనను సత్కరించారు. అనంతరం ఎన్నెస్పీ ఉద్యోగులు, స్నేహితులు, రైతులు సన్మానించారు.



ఎన్నెస్పీ డీఈ లాల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎన్నెస్పీ సిబ్బంది

పిల్లలందరికీ ఎంఆర్ టీకాలు వేయాలి

● ఎంపీపీ వెంకట రత్నమ్మ



టీకా వేస్తున్న దృశ్యం

కురిచేడు : పిల్లలందరికీ తప్పనిసరిగా ఎంఆర్ టీకాలు వేయాలని ఎంపీపీ గడ్డం వెంకట రత్నమ్మ సూచించారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మార్ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు టీకా వేయడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని కోరారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసు గల వారందరికీ వ్యాక్సిన్ వేయాలని వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. ప్రధానంగా పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో వేయడం వల్ల ఎక్కువమంది పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విజయ కుమార్, ఏఎన్ఎం కుమారి, కురిచేడు సొసైటీ అధ్యక్షుడు కమతం నాగిరెడ్డి, బాలయ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి : రైతులు పైర్ల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ విస్తరణాధికారి ఎన్.శశి సూచించారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సాగుచేసిన కంది, సజ్జ, పెసర పైర్లలో తెగుళ్లు, పురుగుల నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆత్మ శాఖ తరుపున పత్తి పైరు ప్రదర్శన క్షేత్రాలు సాగుచేసిన రైతులకు పురుగుమందులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం వై.నాగభూషణం, ఎంపీఈవోలు ఎస్.అఖిల్, షేక్ షమీర్ పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

అనుమతులు లేకుండా మందుగుండు విక్రయిస్తే చర్యలు



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్

దొనకొండ : మండలంలోని ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుగుండు విక్రయాలు జరిపినా, గోడౌన్‌లలో భద్రపరచినా చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్సై కె.అజయ్‌కుమార్ హెచ్చరించారు. దొనకొండలోని పలు వ్యాపార సంస్థలకు చెందిన గోడౌన్‌లను మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుగుండు భద్రపరచటం వల్ల అకస్మాత్తుగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీని వల్ల ప్రజలకు ప్రాణనష్టం జరుగుతుందన్నారు. వ్యాపారస్థులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు



వైఆర్ జడ్పీ స్కూల్లో బాధ్యతలు స్వీకరిస్తున్న హెచ్ఎం అరుణ

కురిచేడు : అంతర్గత బదిలీలో భాగంగా స్థాన చలనం పొందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం ఆయా పాఠశాలల్లో బాధ్యతలు తీసుకున్నారు. కురిచేడు వైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఇక్కడకు కనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సీహెచ్ అరుణ కుమారి హెచ్ఎంగా బాధ్యతలు తీసుకున్నారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాస మూర్తి వైదన జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లారు.

బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనిత బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాధ్యతలు తీసుకోగా ఇక్కడకు కిరణ్ కుమారి బదిలీపై వచ్చారు. పొట్లపాడు ఉన్నత పాఠశాలకు దొనకొండ మండలం మంగినపూడి ఉన్నత పాఠశాల నుంచి టీవీ సుబ్బారావు విధుల్లో చేరారు. ఉపాధ్యాయుల కూడా బదిలీపై వెళ్లిన వారు, రిలీవ్ కాగా ఇక్కడకు వచ్చిన వారు విధుల్లో చేరుతున్నారు.

అర్హులందరికీ ఇళ్లు

దర్శి : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పక్కా గృహాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. ఎర్ర ఓబనపల్లి, పోతకమూరు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో మండలంలోని తూర్పు వీరాయపాలెం, తూర్పు చౌటపాలెం గ్రామాల్లో ఎంపీడీవో ఆంజనేయశాస్త్రి అధ్యక్షతన మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసాధికార సర్వే సందర్భంగా దాఖలైన దరఖాస్తుల్లో అర్హులైన పేదలను లబ్ధిదారులుగా గ్రామసభల ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు.

బడి బయట పిల్లల గుర్తింపు వేగవంతం

కురిచేడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో బడి బయట పిల్లలను గుర్తించి, వారిని సమీప పాఠశాలలో చేర్పించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు ఎంఈవో ఆర్.వస్రాం నాయక్ తెలిపారు. బడి ఈడు పిల్లలందరూ విధిగా పాఠశాలల్లోనే ఉండాలని ఆయన కోరారు. సీఆర్పీలు పిల్లల గుర్తింపు కార్యక్రమం చేపట్టారన్నారు. మంగళవారం కురిచేడు ప్రభుత్వ వైద్యశాల వద్ద బడి బయట ఉన్న పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులతో ఎంఈవో మాట్లాడి, పిల్లలను పాఠశాలలో చేర్పేలా ఒప్పించారు. అలాగే మండలంలో ఉన్న అన్ని పంచాయతీల్లో బడిబయట పిల్లలను గుర్తించి, పాఠశాలకు పంపేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

బడిబయట పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈవో వస్రాం నాయక్



సినిమాలు •

దర్శి

వెంకటేశ్వర	-	ఫిదా
శ్రీనివాస	-	దండుపాళ్యం-2
శివశంకర్	-	గౌతమ్‌నంద
భాస్కర్	-	డిజె

ఆంధ్రజ్యోతి
13
దర్శి
ప్రకాశం • బుధవారం 2 ఆగస్టు 2017
దర్శి | దొనకొండ | కురిచేడు | ముండ్లమూరు | తాళ్లూరు

అర్హులందరికీ ఇళ్లు

ముండ్లమూరు : అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని తహసీల్దార్ బి.గంగాధరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని శంకరాపురం గ్రామంలో అర్హులకు ఇళ్లు మంజూరు చేసేందుకు సందర్శించారు. ఎంతమందికి ఇళ్లు అవసరమో గుర్తించారు. నూజెళ్లపల్లిలో ఎంపీడీవో వెంకటరెడ్డి అర్హులను గుర్తించారు. ఈదరలో హౌసింగ్ ఏఈ రవిశంకర్ శ్రీనివాసరావు అర్హుల జాబితాను సేకరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో సీహెచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

● ఏడీఏ మాలకొండారెడ్డి

పసుపుగల్లు (ముండ్లమూరు) : రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేయించుకోవాలని అద్దంకి డివిజన్ ఏడీఏ ఇ.మాలకొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను నమోదు చేసుకుంటే సాగు ధ్రువీకరణ పత్రాలు ఇస్తారన్నారు. వాటి ద్వారా రుణసదుపాయం పొందచ్చని తెలిపారు. భూసార పరీక్షలు చేసుకుని, వాటి ఆధారంగా మందులు వాడాలని సూచించారు. ప్రధానమంత్రి పంటల బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో జెడ్.శ్రీధర్, డీసీ చైర్మన్ నవులూరి పెద్ద అంజయ్య, విస్తరణాధికారి కోటేశ్వరరావు, కిషోర్, ఎంపీఈవోలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మాలకొండారెడ్డి

ఎంఆర్ టీకా తప్పనిసరి

ముండ్లమూరు : పిల్లలకు తప్పనిసరిగా ఎంఆర్ టీకా వేయాలని ముండ్లమూరు సర్పంచ్ మేదరమెట్ల వెంకట్రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జె.కమల, మండల టీడీపీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంఈవో ఉన్నం పెద సుబ్బారావు, సూపర్‌వైజర్ బాలస్వామి, సీహెచ్‌వో నరసింహారావులు పాల్గొన్నారు.



టీకా వేస్తున్న దృశ్యం

దేవరపల్లి బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ముండ్లమూరు : పర్చూరు మండలం దేవరపల్లి దళితులకు మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం విరాళాల సేకరణ చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్ సెంటర్‌లో సేకరించగా రూ.4,320 వచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు బోడపాటి హనుమంతరావు, తోట తిరుపతయ్య, గంగినేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా మొక్కలు పెంచాలి

● ఏపీఎం జ్యోతిప్రసాద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం జ్యోతిప్రసాద్‌బాబు

ముండ్లమూరు : మండలంలోని ప్రతి గ్రామంలో రహదారులకు ఇరువైపులా మొక్కలను పెంచాలని ఏపీఎం జ్యోతిప్రసాద్‌బాబు కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సర్పంచులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిగ్రామంలో ముఖ్యమైన రహదారులు గుర్తించి మొక్కలు నాటుతామని తెలిపారు. కిలోమీటర్ల పొడవున 400 మొక్కలను తప్పనిసరిగా పెంచాలన్నారు. సమావేశంలో చావా బ్రహ్మయ్య, నిడమానూరి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ గంగినేని శేషగిరిరావు, గండి బెంజిమెన్, సీసీలు వి.కోటేశ్వరి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో మీజిల్స్, రుబెల్లా వ్యాధులు దూరం



వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్

దర్శి : చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయిస్తే మీజిల్స్, రుబెల్లా వ్యాధులు సోకకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని చందలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా మండలంలో పాఠశాలలోని విద్యార్థులకు మొదటిరోజు 2,585 మందికి వ్యాక్సిన్ వేయవలసి ఉండగా, 2459 మందికి అందించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూనల సంజీవయ్య, రాష్ట్ర కనీస వేతన సవరణ సంఘ డైరెక్టర్ శోభారాణి, ఎంపీహెచ్‌వో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

దొనకొండ : దొనకొండలో మంగళవారం 84 శాతం ఎంఆర్ వ్యాక్సిన్ పూర్తిచేశారు. 2363 మంది 1988 మందికి వేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి విజయ్‌కుమార్, మహిళా వైద్యాధికారి హెప్సీబాలు హెచ్‌ఈవో కె.చంద్రశేఖర్‌బాబు, సూపర్‌వైజర్ ఇజ్రాయేలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తూళ్లూరులో..

తాళ్లూరు : చిన్నారుల్లో తట్టు, రుబెల్లా వంటి వ్యాధులు సక్రమించకుండా ఎంఆర్ టీకా ఉపయోగపడుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.సుధామణి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీసరస్వతీ హైస్కూల్‌లో ఎంఆర్ టీకాలు వేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాసంస్థల అధినేత ఏవీ రమణారెడ్డి, ఏఎన్‌ఎం నాగరత్నమ్మ పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తయినా.. బిల్లు ఇవ్వడం లేదు

● మహిళ ఆవేదన



వెంకటరమణమ్మ నిర్మించుకున్న గృహం

వీరేపల్లి (దొనకొండ) : నిర్మాణం పూర్తయిన గృహానికి బిల్లు మంజూరు చేసేందుకు అధికారులు తనను రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని మండలంలోని వీరేపల్లి గ్రామానికి చెందిన భీమినేని వెంకటరమణమ్మ అనే మహిళ వాపోతుంది. 2011లో ఇందిరమ్మ గృహం మంజూరుకాగా అప్పట్లో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా నిర్మాణం చేపట్టలేదని, తిరిగి 2014లో అధికారుల ఆదేశాల మేరకు గృహ నిర్మాణం ప్రారంభించుకొని బేస్‌మట్టం పూర్తి చేసుకోగా బిల్లు మంజూరు చేశారని తెలిపింది. హౌసింగ్ అధికారులు తన గృహాన్ని 2015-16 ఏపవై పథకంలోకి మార్చు చేశామని, నిర్మాణం పూర్తి చేయాలని తెలపడంతో గ్రామంలో అప్పులు చేసి నిర్మాణం పూర్తిచేసినట్టు చెప్పింది. అప్పటి నుంచి నేటి వరకు దాదాపు రెండేళ్లుగా బిల్లు మంజూరు కాలేదని వివరించింది. హౌసింగ్ అధికారులను అడిగితే బ్యాంకులో ఖాతాలో వేశామని, బ్యాంకు వద్ద వెళితే జమకాలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. రెండేళ్లగా బిల్లు మంజూరు కాకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు ఇబ్బందులు పెడుతున్నారని, అధికారులు తమ కుటుంబ పరిస్థితి అర్థం చేసుకొని బిల్లు మంజూరు చేయాలని కోరుతోంది.

బ్యాంకులో పెండింగ్‌లో ఉంది..

వెంకటరమణమ్మకు ఫైనల్ బిల్లు రూ.42 900 ఆమె అకౌంట్‌లో జమ అయింది. బ్యాంకులో పెండింగ్‌లో ఉంది. పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

-లక్ష్మోజీ హౌసింగ్ ఏఈ

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

తాళ్లూరు : తాళ్లూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో మంచినీటి సరఫరా చేయనందున బోరు నీటిని సేవిస్తూ ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఎంపీపీ, జడ్పీటీసీల వద్ద వాపోయారు.మంగళవారం ఉదయం ఎంపీపీ జీవోమ్‌పే, జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డిలు స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో 200 మంది ఉన్నామని, బబుల్స్‌తో తెస్తున్న వాటర్ ఎటుకీ సరిపోవడం లేదని విద్యార్థులు చెప్పారు. స్పందించిన మారం వెంకటరెడ్డి ఇంచార్జి వార్డెన్‌తో ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు తెలపడంతో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు

నిరుద్యోగులకు భృతి ఇవ్వాలి



నిరుద్యోగులకు దరఖాస్తులు అందిస్తున్న డీవైఎఫ్ నాయకులు

దర్శి : ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న యువకులకు నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఇంటింటికి ఉద్యోగం ఇస్తామని లేదా నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించినప్పటికీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించి జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సందుసాయి, షేక్ పీరుసాహెబ్, కిజిజి స్కూల్ డైరెక్టర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాల వారోత్సవాలు

తాళ్లూరు : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తల్లిపాలవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుంటే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్ వాడీ కార్యకర్తలు సీహెచ్ ఏసమ్మ, ఎల్.రమణకుమారి, కె.నాగబాల, ఆళ్ల విజయలక్ష్మి, కె .సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ నిధులు స్వాహా!

ఉపాధి హామీ, వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా ఎక్కడ ఎటువంటి అవకాశం ఉన్నా... వాటిద్వారా ప్రభుత్వ సొమ్మును ఎలా కొల్లగొట్టాలని అక్రమార్కులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల కోట్ల రూపాయలు నిధులు కొల్లగొట్టినట్లు సామాజిక తనిఖీల్లో బహిర్గతమవుతుండగా పుల్లలచెరువు మండలంలో మరో స్వాహాపర్వం బయటపడింది. ఇప్పటివరకు జరిగిన అక్రమాలకు ఇది భిన్నమైంది. ఈ ఏడాది మార్చితో గడువు ముగిసి క్లోజ్ చేసిన వాటర్‌షెడ్ నిధులను ఎవరికీ తెలియకుండా జూన్, జూలై నెలల్లో బిల్లులు చేసి ఏకంగా 7లక్షల 31వేల 795 రూపాయలను పలువురు లబ్ధిదారుల ఖాతాలకు మళ్లించారు.

- ఆఫీస్ లాగిన్‌తో ఖాతాలకు రూ.7లక్షలు మళ్లింపు
- అధికారుల చేతివాటం
- విషయం బయటకు రావటంతో రిక'వరీ'

ఎర్రగొండపాలెం రూరల్: పుల్లలచెరువు మండలం ముటుకుల వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ కాలపరిమితి మూడేళ్లు పూర్తి అవటంతో మార్చినెల నుండి దానిని క్లోజ్ చేశారు. అందులో ఇక ఎటువంటి పనులు చేయటానికి వీలులేదు. ఇదే వాటర్‌షెడ్ పరిధిలోని మర్రివేముల గ్రామంలో పలు పనులకు సంబంధించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ముఖ్యంగా హార్టికల్చర్ కార్యక్రమాల్లో మొక్కలు లేకుండానే కోట్ల రూపాయల నిధులు స్వాహా చేశారు. దీనితోపాటు పంట సంజీవని కుంటల నిర్మాణంలో కూడా అక్రమాలు జరిగి యంత్రాలు ఉపయోగించినట్లు ఫిర్యాదులు చేయటంతో అధికారులు విచారణ జరిపి అందులో వాస్తవాలు ఉన్నట్లు గుర్తించి వాటర్‌షెడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తిని తొలగించారు. ఇతనిని తొలగించిన తరువాత కూడా అధికారులతో కలిసి తన అక్రమాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. ఇందులో భాగంగా ఇప్పుడు వెలుగుచూసిన బాగోతం ఇది.

మర్రివేములలోని పలువురు రైతుల ఖాతాల్లో హార్టికల్చర్ కార్యక్రమానికి గాను దాదాపు 15మంది ఖాతాలకు జూన్ 3 నుంచి జూలై 9వ తేదీ మధ్య 7లక్షల 31వేల795 రూపాయలను మళ్లించారు. మార్చినెలతో వాటర్ షెడ్ గడువు ముగిసింది కదా మరి నిధులు ఎలా వచ్చాయని అడిగితే తొలగించబడ్డ వ్యక్తి అధికారులకు తెలియకుండా ఆఫీసులాగిన్ ఉపయోగించి నిధులు ఖాతాలకు మళ్లించినట్లు చెబుతున్నారు. అతను చేస్తే బిల్లులు ఖాతాలకు రావాలంటే అధికారికంగా 'కీ' ఇవ్వాలికదా? అది అధికారులు ఇచ్చిందేకదా అంటే దానికి సమాధానం లేదు. ఇదంతా బయటకు రాదనుకుని అధికారులు, తొలగించబడ్డ వ్యక్తి కలిసి చేసిన పని అని పలువురు ఆరోపిస్తున్నారు. విషయం బయటకు రావటంతో ప్రాజెక్ట్ అధికారులు వెంటనే సదరు వ్యక్తిని పిలిపించుకుని అప్పటివరకు ఖాతాల్లోకి వచ్చిన నగదును వారి ద్వారా తెప్పించుకుని జిల్లా అధికారులకు వాస్తవం వివరించుకుని నిధులు రికవరీ చేస్తున్నట్లు నచ్చజెప్పుకున్నారు. ఇంకా ఖాతాల్లో కి రాకుండా ఉన్న నగదును ముందుగానే నిలిపివేశారు. ఇంత జరగటానికి గతంలో పనిచేసిన వ్యక్తితో అధికారులకు ఉన్న లాలూచీ, అక్రమాలకు అలవాటుపడ్డ వారి నైజంతోపాటు ఎంత వచ్చినా మీ వాటా పోగా మిగిలింది మాకు ఇస్తే చాలనుకునే లబ్ధిదారులు వెరసి ప్రభుత్వ నిధులు అప్పనంగా ఈ గ్రామంలో కాజేస్తున్నారు.

ఖాతాలకు నగదు వచ్చిన వారి వివరాలు

హౌస్‌హోల్డ్‌కోడ్	పేరు	నగదు
1210201005010479	వెంకటకృష్ణారెడ్డి	45,840
1210201005010482	శివలక్ష్మి	1,30,556
1210201005010743	శిరీషాదేవి	1,44,500
1210201005010501	వెంకటనారాయణ	58,300
1210201005010480	మంగమ్మ	45,840
1210201005010352	మస్నెమ్మ	51,158
1210201005010742	సీతారావమ్మ	86,700

వసతులు ఫుల్...ఆపరేషన్లు నిల్

- నిలిచిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

అద్దంకి: కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నా... అత్యధిక శాతం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. అద్దంకి క్లష్టర్ పరిధిలో 6 పీహెచ్‌సీలు ఉండగా ఏ ఒక్కచోట కూడా కుటుంబ నియం త్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. దీంతో ప్రయివేటు వైద్యశాలలను ఆశ్రయించి వేలకు వే లు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కా భవనాలు, అన్నింటికి మించి ఆధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నా అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి.

అద్దంకి క్లష్టర్ పరిదిలో పరిధిలో మోదేపల్లి, కొరిశపాడు, మేదరమెట్ల, ప్రాసంగులపాడు, పంగులూరు, మారెళ్ళలో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క పీహెచ్‌సీ పరిధిలో కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. ఇక అద్దంకి కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచిపోయి ఏడాది దాటిపోయింది. పాత భవనం మరమ్మతుల పేరుతో నిలిచిపోయిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ఇంకా ప్రారంభం కాలేదు. అద్దంకిలో గతంలో నెలకు సరాసరిన 30 నుండి 40 వరకు కు టుంబ నియం త్రణ ఆపరేషన్‌లు చేసేవారు. ప్రత్యేక క్యాంప్‌లు పెట్టినప్పుడైతే పెద్ద ఎత్తున బటన్ హోల్ ఆపరేషన్ లు జరిగేవి.



ఏళ్ళ తరబడి తాళాలు తీయని మోదేపల్లి పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

బల్లికురవ మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీలో మూడు నెలలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచి పోయాయి. రూ.75 లక్షలతో అధునాతన భవనాన్ని, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటుచేశారు. వైద్య ఆరోగ్య శాఖ, సిబ్బంది నిర్లక్ష్యంతో గత మూడు నెలల నుండి ఇక్కడ ఆపరేషన్లు జరగడం లేదు. సీనియర్ వైద్యాధికారిణి ఉండి కూడా ఆపరేషన్లు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మోదేపల్లి పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ తలుపులు ఏళ్ల తరబడి తీయకపోవటంతో గది కూడా బూజు పట్టి పోయింది. ఇక ప్రాసంగులపాడులో ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. కొరిశపాడు, మేదరమెట్లలలో కుటుం బ నియంత్రణ ఆపరేషన్ లు చేసేందుకు శిక్షణ పొందిన వైద్యులు లేరు.

అద్దంకి క్లష్టర్ పరిధిలో అద్దంకి సీహెచ్‌సీతో పాటు 6 పీహెచ్‌సీలు ఉన్నా ఏ ఒక్కచోట కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగక పోవటంతో బాలింతలు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఒంగోలు వెళ్ళాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధిక వ్యయం అయినా స్థానికంగానే ప్రయివేటు వైద్యశాలల్లో కుటుంబ నియం త్రణ ఆపరేషన్ లు చేయించుకుంటున్నారు. దీంతో కనీసం పది వేల నుండి 15 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని పీహెచ్‌సీలలో కుటుంబ నియం త్రణ ఆపరేషన్‌లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా అద్దంకి సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

వారం రోజుల్లో ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం

డాక్టర్ నాగభూషణం, వైద్యాధికారి, సీహెచ్‌సీ, అద్దంకి



పాత భవనం మరమ్మతులు పూర్తయ్యాయి. ఆపరేషన్ థియేటర్ కూడా సిద్ధ అయ్యింది. టెస్టింగ్‌కు ల్యాబ్‌కు పంపించగా రిపోర్టు కూడా వచ్చింది. వారం రోజులలో మరలా కు టుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం.

కాగితాలకే పరిమితమైన కంభం-ప్రొద్దుటూరు రైలుమార్గం

కంభం: కంభం - ప్రొద్దుటూరు, ఒంగోలు - దొనకొండ మార్గాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. పశ్చిమప్రాంత వాసులకు నేటికీ సింగిల్‌లైన్ ట్రాకే దిక్కు. అదికూడా గుంటూరు, గుంతకల్ మార్గంలో ఉన్న ప్రాంతాలే. ఈ నేపథ్యంలో కంభం - ప్రొద్దుటూరు, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ల ప్రతిపాదనలు ఉనికిలోకి వచ్చాయి. వాటి ప్రతిపాదనలో నడికుడి - శ్రీకాళహస్తి మార్గానికి అధికారుల్లో కదలిక వచ్చి భూసేకరణ చేస్తున్నా కంభం - పొద్దుటూరు మార్గం మాత్రం ప్రతిపాదనలోనే ఉంది. జిల్లా మొత్తం మీద తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో రెండు రైల్వే లైన్లు మాత్రమే ఉన్నాయి. మొదటిది విజయవాడ - చైన్నై మార్గం కాగా, రెండవది గుంటూరు - గుంతకల్ లైన్. విస్తీర్ణపరంగా ఈ రెండు చాలా దూరంలో ఉన్నాయి. కానీ ఈ రెండింటిని కలిపేలా రైల్వేమార్గం లేకపోవడంతో ప్రయాణికులకు రోడ్డుమార్గమే దిక్కైంది.

ఇదిలా ఉంటే 1997 - 98లో రైల్వేశాఖ శ్రీకాళహస్తి - నడికుడి రైల్వే మార్గానికి అనుమతులు రావడంతో కేంద్ర అధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్ ఇప్పటికే భూ సర్వేను పూర్తిచేశారు. అయితే, ప్రకాశం - కడప జిల్లాల మధ్య రవాణా మెరుగుపరచడం కోసం కంభం నుంచి ప్రొద్దుటూరు వరకు రైలు మార్గం నిర్మించాలని రైల్వేశాఖ అధికారులు పది సంవత్సరాల క్రితం అంచనాలు రూపొందించారు. ఈ అంశాన్ని రైల్వే బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించారు. అక్కడితోనే అది ఫుల్‌స్టాప్ పడింది. ఇప్పటికి రెండుసార్లు కంభం-ప్రొద్దుటూరు రైలు మార్గానికి సర్వే చేశారు. మొదటిసారి కంభం నుంచి బేస్తవారిపేట పట్టణం మీదుగా రైలేమార్గం వెళ్లేలా ప్రతిపాదనలు పంపగా దీనిపై అక్కడి ప్రజలలో వ్యతిరేకత రావడంతో రెండవసారి బేస్తవారిపేట ఊరి చివరన కొండల పక్క నుంచి వెళ్ళేలా సర్వే చేశారు. ఈ అంశాన్ని రైల్వే బడ్జెట్‌లో కూడా ప్రతిపాదించారు. అక్కడితోనే అది ఫుల్‌స్టాప్ పడింది.

ఇదిలాఉంటే నాలుగు సంవత్సరాల క్రితం రైల్వేశాఖ కంభం నుంచి ప్రొద్దుటూరు, గిద్దలూరు నుంచి ప్రొద్దుటూరు రైలుమార్గం నిర్మిస్తే ఎలా ఉంటుందో తెలుసుకునేందుకు విజయవాడకు చెందిన రైల్వే ఉన్నతాధికారులు సర్వే చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం కంభం నుంచి ప్రొద్దుటూరు మార్గమే ఉత్తమమని నిర్ధారించారు. ఇప్పటికీ ఎలాంటి అడుగు ముందుకుపడలేదు.

సొంతింటి కల సాకారమవుతున్న వేళ

- భారీగా మంజూరైన ఎన్‌టీఆర్ గృహాలు
- భూమిపూజ కార్యక్రమాలతో ఊపందుకున్న నిర్మాణాలు

రాచర్ల : పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కల నెరవేరుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌టీఆర్ గృహాలు మంజూరు కావడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతుంది.

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో ఇళ్లు లేని వారిని గుర్తించి, ఎంపిక చేసి గృహాలు మంజూరు చేయించారు. మండలంలో 2వ ఫేజ్ కింద 340 గృహాలు మంజూరయ్యాయి. ఆకవీడు, రాచర్లకు దాదాపు 50 గృహాలు కేటాయించారు. ముఖ్యంగా ప్రభుత్వం శ్రావణమాసంలో ఈ గృహ నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది. దీంతో అధికార యంత్రాం ఆ పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ఆకవీడు, సోమిదేవిపల్లి, కాలవపల్లి, గౌతవరం గ్రామాల్లో గృహ నిర్మాణాలకు భూమి పూజ చేసే కార్యక్రమం హౌసింగ్ ఏఈ షేక్ ఖదీర్‌భాషా దగ్గర ఉండి జరిపిస్తున్నారు.

2016-17 సంవత్సరంలో 193 ఎన్‌టీఆర్ గృహాలు మంజూరు కాగా 68 పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. 2017-18లో 183, గృహాలు మంజూరు కాగా ఒక్కొక్క గృహానికి రూ. 1.50 లక్షలు ప్రభుత్వం అందచేస్తుండడంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేట్టేందుకు ముందుకు వస్తున్నారు.

నిర్మించుకున్న వారికి వెంటనే బిల్లులు..

ఇళ్లను నిర్మించుకున్న వెంటనే బిల్లులు చెల్లిస్తాం. ఇందులో ఎటువంటి జాప్యం జరగదు. గ్రామాల్లో భూమిపూజలు చేసి, నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని చెబుతున్నాం.

- షేక్ ఖదీర్‌భాషా, హౌసింగ్ ఏఈ, రాచర్ల

14మంది వలేటివారిపాలెం హైస్కూలు టీచర్లు బదిలీ

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం హైస్కూలులో పనిచేస్తున్న 14 మంది టీచర్లు వివిధ పాఠశాలలకు బదిలీ అయినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్కె జిలానీబాషా తెలిపారు. బదిలీ అయిన 14మంది టీచర్ల స్థానంలో మరో 14 మంది విధులలో చేరినట్లు హెచ్ఎం జిలానీబాషా తెలిపారు.



ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రభాకర్ ఉద్యోగ విరమణ వీడ్కోలు

కందుకూరు : స్థానిక ఎస్‌బిఐలో అసిస్టెంట్ మేనేజరు హోదాలో ఉద్యోగ విరమణ చేసిన పిన్నంరాజు ప్రభాకరరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమం సోమవారం రాత్రి స్థానిక జనార్ధన స్వామి కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ ప్రభాకరరావు గత 30 సంవత్సరాలుగా ఎస్‌బిఐలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ బ్యాంకుకి ఉత్తమ సేవలు అందించటమే గాక ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు ఇతోధిక సేవలందించారని కొనియాడారు. మున్సిపల్ మాజీఛైర్మన్ దివి లింగయ్య నాయుడు, దివి సౌభాగ్య, ఆర్‌వి, ఎవి రావు, చీతిరాల గోపాల్, చలంచర్ల సుబ్బారావు, చక్కా వెంకట కేశవరావు, ఇస్కాల మధు, ఎస్‌బిఐ అధికారులు, ఉద్యోగులు పాల్గొని ప్రభాకర్ దంపతులను ఘనంగా సత్కరించారు.



సూచనలిస్తున్న డిఎంహెచ్ఓ కృష్ణానాయక్

లింగసముద్రం పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ

లింగసముద్రం: లింగస ముద్రంలోని మండల ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని కందు కూరు డిప్యూటీ డిఎంహెచ్ ఓ డా. కృష్ణనాయక్ మంగళ వారం తనిఖీ చేశారు. రికా ర్డులను పరిశీలించిన అనంత రం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోనే కాన్పులు జరిగేలా పిహెచ్‌సి అధికారులు, ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు కృషి చేయాలని చెప్పారు. గర్భిణీలు తమ ఇళ్ళ వద్ద కాన్పులు చేయించుకోకూడదని వైద్యులు, మందులు అందుబా టులో ఉండే పిహె చ్‌సిలోనే చేయించుకోవాలన్నారు. మండలంలో జరిగే మీజిల్స్ రూబెల్లా టీకా కార్యక్రమాన్ని 9 నెలలు నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు వారికి ఇవ్వాలని ఆయన సూ చించారు. ఈ కార్య క్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డా. కె సునీల్‌గవాస్కర్, సిహెచ్ఓ సుధాకర్, సూపర్‌వైజర్ కృష్ణంరాజు, ఏపిఎంఓ గౌస్‌బాషా, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సజ్జలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

వలేటివారిపాలెం: సజ్జ పంటలో యాజమాన్య పద్ధ తులు పాటిస్తే అధిక ది గుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ విస్తర ణాధికారి హర్షవర్ధన్ తెలి పారు. మండలంలోని లింగ పాలెం, నవాబుపాలెం గ్రామాలలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోం ది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా తీసుకోవాలన్నారు. పంటలో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడుకోవాలని సూచించారు.పైరుపై విచ్చలవిడిగా క్రిమిసంహారిక మందులు వినియోగించవద్దని ఆయన సూచించారు. రైతులకు నూరుశాతం సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు అందించినట్లు ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎంపిఈఓ రంగయ్య, ఉద్యానవనశాఖ ఎంపిఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

3289 మంది బాలబాలికలకు ఎంఆర్ వ్యాక్సిన్

కందుకూరు : 9 నెలల నుండి 15 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలబాలికలకు ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కందుకూరు అర్బన్, రూరల్ మండలాల పరిధిలో మంగళవారం ప్రారంభించారు. రూరల్ మండల పరిధిలోని 15 పాఠశాలల్లో 1089 మంది బాల బాలికలకు తొలిరోజు ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు మాచవరం పిహెచ్‌సి వైద్యాధికారి డా. కె.చంద్రకళ తెలుపగా అర్బన్ పరిధిలోని 8 పాఠశాలల్లో 2129 మందికి వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు వైద్యాధికారి డా. ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జడ్‌పిటిసి కంచర్ల శ్రీకాంత్ చౌదరి ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా శ్రీచైతన్యతో తహసిల్దార్ నాగభూషణం ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్ఇఓ జి. ప్రసాదు, వైద్య సిబ్బంది పర్యవేక్షించారు. ఉలవపాడు మండలం వీరేపల్లిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యాధికారి డా. బ్రహ్మయ్య పర్యవేక్షించారు.

వలేటివారిపాలెంలో...

9 నెలల నుండి 15ఏళ్లలోపు పిల్లలందరికి తప్పనిసరిగా ఎంఆర్ టీకాలు వేయించాలని ప్రధానోపాధ్యాయులు ఎస్కె జిలానీ బాషా తెలిపారు. వలేటివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుండి ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఎంఆర్‌టీకాలు కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ వరకు వేయనున్నట్లు ఆయన తెలిపారు. తట్టు పొంగు అనే రెండు రోగాలకు ఒకే వ్యాక్సిన్ ప్రభుత్వం వేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాణాంతకమైన తట్టుపొంగు రోగాలకు తప్పనిసరిగా ఎంఆర్ టీకాలు వేయించాలన్నారు. ఏఎన్ఎం రత్నకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

మండలంలోని వలేటివా రిపాలెం, పోకూరు హైస్కూళ్లలో వేస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని కం దుకూరు డిప్యూటీ డిఎంహెచ్ఓకృష్ణమూర్తి నాయక్ ఆయన తనిఖీ చేశారు. తదనంతరం స్థానిక పిహెచ్‌సిలో అంగన్‌వాడీలు, ఆశాకార్యకర్తలు శిక్షణా కార్యక్రమం నిర్వహించి సూచనలిచ్చారు. సూపర్ వైజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న కంచర్ల శ్రీకాంత్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగభూషణం

లింగసముద్రంలో...

మండలంలోని పెదపవని గ్రామంలో అన్ని పాఠశాలలు, జడ్పీ హైస్కూళ్లతో పాటు గురుకుల పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మీజిల్స్ రూబెల్లా వ్యాధుల నివారణా టీకాలను మంగళవారం ప్రారంభించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సునీల్‌గవాస్కర్ స్థానిక సర్పంచ్ సయ్యద్ నాయబ్‌రసూల్ తదితరులు ఎంఆర్ టీకాలను వేశారు.

గుడ్లూరులో...

మండలంలో 1680 మందికి ఎంఆర్ వ్యాక్సిన్‌ను వినియో గించినట్లు స్థానిక వైద్యాధికారి డా. సందీప్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలకు వైద్య ఆరోగ్య సిబ్బంది చేరుకుని 9నెలల నుండి 15 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. స్థానిక వైద్యఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పద్మావతి, ఉప వైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ సందర్శించారు. టీకా వినియోగంపై అంగన్‌వాడీ, ఆశా వైద్యసిబ్బందికి తెలి యజేశారు. స్థానిక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సి.కల్లయ్య, సిహెచ్ఓ సు బ్బారావు, ఏపిఎంఓ కె.ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, డి.వరలక్ష్మి, ఆదిలక్ష్మి, హెచ్‌డిఎఫ్ ఛైర్మన్ మేకల మాల్యాద్రి, గుడ్లూరు హైస్కూల్ హెచ్‌ఎం కమల్‌కుమార్, అంగన్‌వాడీ ఆశాకార్య కర్తలు పాల్గొన్నారు.

వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూపులు

- బెట్టకు వచ్చిన వేరుశనగ
- నెర్రెలు బారిన చెరువులు
- జీవాలకు తాగునీరు-పశుగ్రాసం కొరత
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



శాఖవరంలో బెట్టకు వచ్చిన వేరుశనగ

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండల రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వాతావరణం సక్రమంగా సహకరించడం లేదు. మండలంలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. గత నెలలో అప్పుడప్పుడు పడిన చిరుజల్లులకు గ్రామాలలో రైతులు వేరుశనగ, కంది, పెసర, సజ్జ తదితర పంటలు సాగు చేశారు. కొన్ని గ్రామాలలోని నల్లరేగడి పొలాలలో వర్షం మీద ఆధారపడి వేరుశనగ సాగు చేపట్టారు. మరికొన్ని గ్రామాలలో బోర్లలో నీళ్లు రాకపోతాయా అన్న ఆశతో వేరుశనగ సాగు చేపట్టారు. అలాగే కంది, పెసర, సజ్జ పంటలు సాగుచేశారు. అయితే వేరుశనగ బెట్టకు వచ్చి ఎండుముఖం పట్టింది. బోర్లలో నీళ్లు రావడం లేదని రైతులు చెబుతున్నారు. కంది, పెసర, సజ్జ తదితర పంటలు మొలక దశలోనే పదును లేక వర్షం పడక ఎండిపోతుంది. గతవారం రోజుల నుండి ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఆ ఎండలకు మొలకెత్తిన మొక్కలు ఎండిపోతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మూగజీవాలకు సైతం పశుగ్రాసానికి తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడింది. గత నెలలో అప్పుడప్పుడు కురిసిన చిరుజల్లులకు పచ్చికతో నేలతల్లి సింగారించుకుంది. గతవారం రోజుల నుండి వేసవిని తలపిస్తున్న ఎండలకు పచ్చిక మలమల మాడిపోయింది. మూగజీవాలకు వాగులు, వంకలు, కుంటలలో ఎక్కడా చుక్కనీరు లేవు. పశుగ్రాసం, తాగునీటికి మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి రైతులు వేరుశనగ, కంది, పెసర, సజ్జ తదితర పంటలు సాగుచేశారు. ఆ పంటలు వర్షం లేక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేరుశనగ పైరులో పురుగులు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

లింగసముద్రం: వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌ఛార్జ్ ఏఈఓ బి రవికుమార్ చెప్పారు.మండలంలోని తూనుగుంట విశ్వనాథపురం గ్రామాలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు చాగంటి చెంచులక్ష్మి, పొంతగాని జయమ్మ, ఏఈఓ సుబ్బారావు, ఎంపిఈఓ రఘు, రైతులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఉపాధి గ్రామసభలు

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం మండలంలో ఈ నెల 3,4వ తేదీలలో సామాజిక తనిఖీ అధికారులు ఉపాధిహమీ పనులపై గ్రామసభలు జరగనున్నట్లు ఏపిఓ సమీర్‌బాషా తెలిపారు. 3న వలేటివారిపాలెం, శింగమనేనిపల్లె, కొండసముద్రం, జమీన్ ఉప్పలపాడు, కళ్ళవళ్ళ, లింగపాలెం, నలదలపూరు, నూకవరం, శామీరపాలెం, శాఖవరం, చిన్నఅమ్మపాలెం, 4న అంకభూపాలపురం, అయ్యవారిపల్లె, పోలినేని చెరువు, పోకూరు, పోలినేనిపాలెం, బడేవారి పాలెం, కొండారెడ్డిపాలెం, నేకునాంపురం, నూకవరం, చుండి గ్రామాలలో గ్రామసభలు జరగనున్నట్లు ఏపిఓ సమీర్‌బాషా తెలిపారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం: మోటారుబైకు తగిలి వృద్ధుడికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక పోస్టాఫీసు ఎదురుగా మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో షేక్ రంతుసాహెబ్‌కు కాళ్లు విరి గిపోయాయి. క్షతగాత్రుడను వలేటివారి పాలెం 108లో కందుకూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్చి చికిత్స చేస్తున్నారు.

విధుల్లోకి 12 మంది ఉపాధ్యాయులు

గుడ్లూరు: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా గుడ్లూరు మండలంలో ప్రస్తుతం 12 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు ఎంఈఓ సి.కల్లయ్య మంగళవారం తెలిపారు. నాయుడుపాలెం, తెట్టు, దారకానిపాడు, అడవిరాజుపాలెం, పోట్లూరు, అమ్మవారిపాలెం, నరసాపురం, గుడ్లూరు ఆయా గ్రామాలలో పాఠశాలల్లో విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు 12 మంది బదిలీపై వివిధ ప్రాంతాలకు తరలి వెళ్లారని ఎంఈఓ తెలియజేశారు.

ఎరువుల డీలర్లకు ఈపోస్ మిషన్లపై శిక్షణ


ఈపోస్‌పై సూచనలిస్తున్న అధికారులు

కందుకూరు : ప్రతి బస్తా ఎరువు ఈ పాస్ యంత్రాల ద్వారానే విక్రయాలు చేయాల్సి ఉందని, డీలర్లంతా విధిగా ఈ పాస్ యంత్రాలను ఉపయోగించాలని కందుకూరు ఎఓ అబ్దుల్ రహీం కోరారు. కందుకూరు, సింగరాయకొండ, కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోని ఎరువుల డీలర్లకు ఈ పాస్ యంత్రాల వినియోగంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లందరికీ ఈపాస్ యంత్రాలను పంపిణీ చేశారు. యంత్రాల పంపిణీ, వాటి వినియోగంపై శిక్షణ అనంతరం డీలర్లనుద్దేశించి ఎఓ మాట్లాడుతూ ఈ పాస్ యంత్రాలతో నిమిత్తం లేకుండా ఎరువుల క్రయవిక్రయాలు చేసే అవకాశం లేనందున రైతులందరికీ అవగాహన కల్పించి వారి ఆధార్ నెంబర్లు నమోదు చేసుకోవటం ద్వారా ఈ పాస్ యంత్రాలను వినియోగించాలని కోరారు. ప్రత్యక్ష లబ్ది బదిలీ పేరుతో ఎరువుల సబ్సిడీలు నేరుగా రైతుల ఖాతాకే జమ అయ్యేలా ఏర్పాటు చేసిన ఈ పద్ధతి వల్ల అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ఎరువులు దుర్వినియోగం కాకుండా చూడవచ్చునని, ఎరువుల విక్రయాలపై అజమాయిషీ పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ రీజనల్ మేనేజరు సచ్చిదానందరెడ్డి, టెక్నికల్ ఎఓ బి.నరేంద్రబాబు, మూడు సబ్ డివిజన్లలోని ఎరువుల డీలర్లు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

15 మంది ఉపాధ్యాయులకు నూతన బాధ్యతలు


జాయినింగ్ రిపోర్ట్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు : ఉపాధ్యాయ బదిలీల కౌన్సిలింగ్‌లో భాగంగా కందుకూరు మండలానికి నూతనంగా కేటాయించబడుతున్న ఉపాధ్యాయులలో 15 మంది మంగళవారం ఎంఇఓ ఎంఎస్ రాంబాబుని కలిసి తమ జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు. విక్కిరాలపేట ప్రాథమికోన్నత పాఠశాలకు బి. శేషారావు, వి.మురళీకృష్ణ, ఎం.మధు, ఓగూరు ప్రాథమికోన్నత పాఠశాలకు కెజె డేవిడ్, కె.సామియేలు, మోపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు బి.మోహన్‌గాంధీ, యు.సాయిరామ్, మహదేవపురం ప్రాథమికోన్నత పాఠశాలకు వి.మురళీకృష్ణ, సిహెచ్ కోటేశ్వరరావు, పాలూరు ప్రాథమికోన్నత పాఠశాలకు జి.రాజు, కె.వి జయమణి, ఎన్.సుబ్రహ్మణ్యం, కృష్ణనగర్ ప్రాథమిక పాఠ శాలకు బి.కొండయ్య, మాచవరం ఎస్‌సి పాఠశాలకు వి.మాధవరావు, ఇస్కాలవారి వీధి పాఠశాలకు ఆర్.వేదవతిలు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా బాధ్యతలు స్వీకరించారని ఎంఇఓ రాంబాబు తెలిపారు.

దక్షిణాది తేలికనేలల రైతులకు పొగాకు ఉత్పత్తి పరిమితి పెంచాలి

- **త్వరలోనే గుంటూరు బోర్డు కేంద్ర కార్యాలయ ముట్టడి**
- **మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, మాజీవైస్ చైర్మన్ బాలినేని సీతయ్య**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పక్కన సీతయ్య

కందుకూరు : దక్షిణాది తేలిక నేలల్లోని పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని రైతులకు పొగాకు సాగు విస్తీర్ణం, పంట పరిమితి పెంచేందుకు బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతు నాయకులు, రైతులు కోరారు. దక్షిణాది తేలిక నేలల పరిధిలోని నెల్లూరు జిల్లా కలిగిరి, డిసి పల్లి, ప్రకాశం జిల్లా కందుకూరు 1, కందుకూరు 2, కనిగిరి, పొదిలి 1, పొదిలి 2 వేలం కేంద్రాల పరిధిలోని రైతు నాయకులు, రైతుల సమావేశం మంగళవారం స్థానిక పామూరు రోడ్డులోని పొగాకు వేలం కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పొగాకు బోర్డు మాజీవైస్ చైర్మన్ బాలినేని సీతయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై గిట్టుబాటు ధరలు, పంట సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతు నాయకులు మాట్లాడుతూ పంట విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించటం వల్ల రైతులకు తీరని నష్టం జరుగుతోందని, కొద్దిపాటి పంట ఉత్పత్తికే బ్యారన్ ఉపయోగించాల్సి వస్తున్నందున నిర్వహణ వ్యయం విపరీతంగా పెరగటమే గాక పంట సాగులో కూడా అనేక వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా గిట్టుబాటు ధరలు లభించకపోతుండటం వల్ల కూడా తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా పొగాకు సాగు లేనప్పటికీ పంట పరిమాణం నిర్ణయించటానికైనా, వ్యాపారుల ఇండెంట్లు నిర్ణయించటానికైనా సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం అర్ధరహితమని పేర్కొన్నారు. పొగాకు బోర్డుకి సంబంధించి ఉన్నతస్థాయి సమావేశం ఏదైనా గుంటూరులోనే నిర్వహించాలని లేనిపక్షంలో పొగాకు సాగు ఉన్న కర్నాటకలోని మైసూరులో జరపాలి తప్ప పొగాకుకి ఏ సంబంధం లేని హైదరాబాద్‌లో ఎందుకు జరపాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాలినేని సీతయ్య, దివి శివరాంలు మాట్లాడుతూ దక్షిణాది తేలికనేలల పరిధిలోని రైతు లకు కూడా బ్యారన్‌కి 40 క్వింటాళ్లకు తగ్గకుండా పంటకు అనుమతి ఇవ్వాలని, వ్యాపారులు ఇండెంట్ల మేరకు కొనుగోళ్లు జరిపేలా చర్యలు తీసుకోవటంతో పాటు గిట్టుబాటు ధరల కల్పనకు బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పంట నుండి స్వచ్ఛందంగా విరమించుకునేందుకు ముందు కొచ్చే రైతులకు విడతలగానైనా 10 లక్షల రూపాయల పరిహారం చెల్లించేందుకు పొగాకు బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో త్వరలోనే దక్షిణాది తేలికనేలల పరిధిలోని రైతుల ఆధ్వర్యంలో పొగాకు బోర్డు ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్ఎస్ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.రమణయ్యానాయుడు, తాటికొండ రమణయ్య, వివిధ వేలం కేంద్రాల రైతు నాయకులు మాదాల రమణయ్య, చెరువుపల్లి మాల్యాద్రి, వంకాయలపాటి లక్ష్మీనరసింహ్మాం, శివారెడ్డి, గుర్రం లక్ష్మీనరసింహ్మాం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని అవలంభిస్తే లాభసాటి

- **ఎఓ అబ్దుల్ రహీం**


సూచనలిస్తున్న ఏవో అబ్దుల్‌రహీం

కందుకూరు : రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభించటం ద్వారా లాభాలు గడించాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె అబ్దుల్ రహీం కోరారు. మండలంలోని పాలూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఓ అబ్దుల్ రహీం రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులు దుక్కిలో రసాయనిక ఎరువులకు బదులుగా దిబ్బ ఎరువు, పశువుల ఎరువు, నాడెప్ ఎరువులను వేసుకోవచ్చునని సూచించారు. దీని ద్వారా భూమిలో సేంద్రీయ కర్బనం అభివృద్ధి చెంది నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట దిగుబడులు పొందటమే గాక పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చునని చెప్పారు. పురుగులు, తెగుళ్ల నివారణకు వివిధ రకాలైన కషాయాలు వేప, ఆముదం, వెల్లుల్లి తదితర కషాయాలను గోవు పంచతముతో కలిపి పిచికారి చేసినందువలన సమర్ధవంతంగా చీడ పీడలను నివారించి విష అవశేషరహిత దిగుబడులు పొందవచ్చునని వివరించారు. డిప్యూటి తహసిల్దార్ మాట్లాడుతూ కౌలురైతులందరూ రుణ అర్హత కార్డులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాము, ఎఇఓ జి. వెంకటరావు, ఎంపిఇఓ ఇస్మాయిల్, ఆత్మ ఎపిఎం కోటేశ్వరరావు, సుబ్బరాజు, రిటైర్డ్ ప్రొఫెషర్ డా. మాలకొండయ్య గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు స.హ.చట్టం కింద సమాచారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

- **ఆర్డీఓ మల్లిఖార్జునరావు**

కందుకూరు : సమాచార హక్కు చట్టం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రజలు ఎటువంటి సమాచారాన్ని అయినా ఉచితంగా కేవలం దరఖాస్తు ద్వారా పొందవచ్చునని కందుకూరు ఆర్డీఓ జి. మల్లిఖార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత అధికారులకు అర్జీ ఇచ్చి పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు.

12వ రోజు కొనసాగిన ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

కందుకూరు : ఎస్‌సి రిజర్వేషన్లను వర్గీకరించాలన్న డిమాండ్‌తో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 12వ రోజు కూడా కొనసాగాయి. ఆనందపురం గ్రామ ఎంఆర్‌పిఎస్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ దీక్షా శిబిరంలో పాల్గొనగా చెంచయ్య పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్, విజయ్, వంశీ, వినయ్ చంద్, ప్రేమ్‌చంద్ , గోచిపాతల మోషే, మద్దాళి రమేష్, ముప్పవరపు రమేష్, ఉచ్చులూరి నిరంజన్ తదితరులు పాల్గొనగా దీక్షలో పాల్గొన్నవారికి ఆలూరి మాధవరావు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు.


దీక్షలలో పాల్గొన్న కార్యకర్తలు

'ఇఇఇ, మెకానికల్ విద్యార్థులకు మంచి భవిష్యత్'



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రామయ్య, మారుతి తదితరులు

కందుకూరు: సంప్రదాయేతర ఇంధన వనరులైన సౌరవిద్యుత్, పవన విద్యుత్, చెత్తతో విద్యుత్ (బయోమాస్ ఎనర్జీ) తయారీ, నిర్వహణలపై పరిజ్ఞానం పొందిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ విభాగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు స్వంతమవుతుందని ఏవియన్ టెక్నోవేషన్స్ సంస్థ ప్రాజెక్టు మేనేజరు మారుతి కల్పగిరి విద్యార్థులకు సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కళాశాల ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థులకు నిర్వహిస్తున్న సోలార్ ప్యానల్ పివి డిజైన్ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మారుతి మాట్లాడుతూ విద్యార్థులు వర్క్‌షాప్‌లు, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా మెరుగైన పరిజ్ఞానం పొందే వీలుందన్నారు. సోలార్ పరిజ్ఞానం ఉన్న ఎలక్ట్రికల్ విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో విద్యుత్ పంపిణీ, డిజైన్, విడిభాగాల తయారీలో సైతం ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన 'ప్రకాశం' విద్యార్థులకు జీతభత్యాలతో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తామని, ఇందులో మెరుగ్గా రాణించిన వారికి సాలీనా 2.5 లక్షల నుండి 3.5 లక్షల వేతనంతో ఉపాధి అవకాశాన్ని సైతం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ కళాశాల విద్యార్థులలో ఉపాధి నైపుణ్యాలను పెంచటానికి వారి పాఠ్యాంశాలతో పాటుగా ప్లేస్‌మెంట్స్ శిక్షణను ప్రతినిత్యం అందిస్తున్నామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఏవియన్ సంస్థ ద్వారా విద్యార్థులు ఎంచుకున్న రంగంలో ఉపాధి అందిస్తా మన్నారు. వర్క్‌షాప్‌లో శిక్షణతో పాటు సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి సులభతర మవుతుందని గుర్తించిన 'ప్రకాశం' యాజమాన్యం ఆఖరి సంవత్సరం మొదటి సెమిష్టర్‌లోనే వాటిని ప్రారంభించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ అకడమిక్ పర్సంటేజితో పాటుగా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రయోగాత్మకంగా విద్యనభ్యసిస్తే నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇంజనీర్ ఓబుల్‌రెడ్డితో పాటు కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జ్ ఎస్ఎస్ మీరావలి, అధ్యాపకులు షరీఫ్, ఏడుకొండలు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

1350 మందికి అందిన వైద్య సేవలు

టంగుటూరు: టంగుటూరు క్యాండీపోర్టులో మక్కెన వెంకటకృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరం ద్వారా మొత్తం 1350 మందికి వైద్య సేవలు అందాయి. కంటి పరీక్షలు చేయించుకున్న 189లో 44 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు.క్యాన్సర్ పరీక్షలు 150మంది చేయించుకున్నారు.అలాగే గ్యాస్ట్రిక్ విభాగం నుండి 154 మంది, ఆర్థోకు సంబంధించి 366 మంది, ఈఎన్‌టీ 189 మంది,ఇతర వ్యాధులకు వందలాదిగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన మందులు ఉచితంగానే పంచారు.

50వేల మంది కూలీలకు మెడికల్ ఇన్సూరెన్స్

టంగుటూరు: తమ సంస్థలో పని చేస్తున్న 10వేల మంది ఉద్యోగుల కుటుంబాలల్లోని 50వేల మందికి మెడికల్ ఇన్సూరెన్స్ కల్పిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం కోటయ్య ప్రకటించారు.

మంగళవారం స్థానిక క్యాండీ పోర్టులో మ క్కెన వెంకట క్రిష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ ఏడాది నుంచి పేద ఆడపిల్లల చదువుల కోసం ప్రతి ఏటా రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందిస్తానన్నారు. తమ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు కట్టుబడి ఉన్నామని, మెడికల్ ఇన్సూరెన్స్ ద్వారా వారికి ఆరోగ్య భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. వెంకట క్రిష్ణారావు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మరింత మెరుగైన సేవలు అందిస్తామని, ప్రతి ఏటా 5ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నాం అన్నారు. తమ సేవలను ఈప్రాంత ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని బెల్లం కోరారు.

వీడని వర్షాభావం

- **పంటల భవితవ్యం ప్రశ్నార్థకం**
- **ఆందోళనలో రైతాంగం**

మర్రిపూడి : వర్షాభావం వెంటాడుతోంది. వందలాది ఎకరాలలో సాగు చేసిన పైర్లు ఎండిముఖం పట్టాయి. భూగర్భ జలాలు ఇప్పటికే పాతాళంలోకి పడిపోయాయి. పుడమితల్లిని నమ్ముకుని లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే ఏమీ చేయాలని నిస్సహాయస్థితిలో అన్నదాతలు కన్నీటి పర్యాంతం అవుతున్నారు.

వ ర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మండలంలో జూన్‌లో 51.1 మిల్లీమీటర్లు వర్షపాతం కురవ వలసి ఉండగా, 46 మిల్లీమీటర్లు వర్షపాతం కురిసింది. జూలైలో 75 శాతం మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సివుండగా, కేవలం 40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన సజ్జ, కందిపైర్లు పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 4,58 హెక్టార్లలో సజ్జ, 2,080 హెక్టార్లలో కంది, 24 హెక్టార్లలో పెసర, 10 హెక్టార్లలో పశుగ్రాసం సాగు చేశారు. రైతులు పంటలు సాగుచేసేందుకు రూ.2కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. తీరా వర్షం కురవపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉంది. నాణ్యమైన



పైరు ఎదుగుదల లేని కంది పైరు



వాడుముఖం పట్టిన సజ్జ

విద్యుత్ సరఫరా జరుగుతుండడంతో వ్యవవ్యవ సాయ బోర్లలో నీరు కూడా అడుగంటి పోయిందని సజ్జ పైరుకు తడి కూడా అందించలేకపోతున్నామని మర్రిపూడికి చెందిన గొంతు నర్సారెడ్డి వాపోయారు. కంది పైరు ఎదుగుదల లేక ఎండిపోతుంది. ఇదే పరిస్థితి మరో వారం ఉంటే పంటలు నిలువునా ఎండిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారి మధుబాబు అన్నారు. ఈ ఏడాది కూడా కరువు పరిస్థితులు రైతులను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్నాయని చెప్పక తప్పదు.



పాఠశాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

సింగరాయకొండ రూరల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఊళ్ళపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంజి రామకృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత, ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలు, ఉచిత ఉన్నత విద్య, రాయితీలు, స్కాలర్‌షిప్‌లు, యూనిఫామ్, పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, కంప్యూటర్ విద్యా బోధనపై తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత విద్యావంతులైన వారికి ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరేటి లక్ష్మీనారాయణ, ఎస్‌ఎంసీ చైర్మన్ పురిణి శ్రీను, సీఆర్పీ సభ్యులు, నీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా.. చిన్నారుల ఆరోగ్య రక్ష



విద్యార్థులకు టీకాలు వేస్తున్న ఎమ్మెల్యే స్వామి

ఎమ్మెల్యే స్వామి

వెన్నూరు (కొండపి): ఎంఆర్ (మీజిల్స్, రుబెల్లా) టీకాలతో చిన్నారుల ఆరోగ్యం, భవిత భద్రమవుతుందని ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి అన్నారు. వెన్నూరులోని పెద్దిరెడ్డి లక్ష్మీ నరసారెడ్డి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఎంఆర్ వాక్సిన్ ఎమ్మెల్యే వేశారు. వ్యాక్సిన్ వేసే ముందు సబ్బుతో ఎమ్మెల్యే చేతులు శుభ్రం చేసుకున్నారు. హెల్త్ సిబ్బంది చేతులు శుభ్రం ఎందుకు చేసుకోలేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వాక్సిన్ వేస్తున్న హెల్త్ సిబ్బందిని గమనించి అడిగారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ యువ నాయకుడు దామచర్ల సత్య, ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, జన్మభూమి మండల కమిటీ సభ్యుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు, కొండపి సీహెచ్‌సీ డీసీఎస్ వాణిశ్రీ, పెట్లూరు పీహెచ్‌సీ వైద్యుడు డా.కల్యాణ చక్రవర్తి, స్కూల్ హెచ్‌ఎం కాట్రగడ్డ రవి, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులంలో

కొండపిలోని దామచర్ల ఆంజనేయులు సక్కుబాయమ్మ గురుకుల బాలికల కళాశాలలో 480 మందికి వాక్సిన్ వేశారు. కాగా కొండపి జీహెచ్‌ఎస్, గురుకుల కళాశాల, వెన్నూరు జడ్పీహెచ్‌ఎస్ స్కూళ్లలో 1126 మందికి వాక్సిన్ హెల్త్ సిబ్బంది వేశారని పెట్లూరు పీహెచ్‌సీ డా. కల్యాణ చక్రవర్తి మంగళవారం సా యంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

సింగరాయకొండ : చిన్నారులకు తటుట, పొంగు వ్యాధి నుంచి కాపాడేందుకు ఎంఆర్ టీకాను తప్పనిసరిగా వేయించాలని ఉన్నత శేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డా పద్మజ పేర్కొన్నారు. మం డలంలోని వివిధ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య సిబ్బంది మంగళవారం ఎంఆర్ వాక్సిన్‌లు వేశారు. ఈ సందర్భంగా ఒకే వాక్సిన్ ద్వారా రెండు వ్యాధులను అరికట్టవచ్చ న్నారు. అన్ని పాఠశాలల నిర్వాహక సిబ్బంది తమతమ విద్యార్థులు ఎంఆర్ వాక్సిన్‌లు వేయించుకున్నారో లేదో పరిశీలిం చాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ది కమీటీ ఛైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కూనపురెడ్డి హైమావతి,వైద్యులు డా. క్రాంతి కిరణ్,ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ,కెవి గోపాల్, ఆోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

కె. ఉప్పలపాడు (కొండపి): తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని, తప్పనిసరిగా బిడ్డకు తల్లి పాలు ఇస్తేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు అవ గాహన కలిగించారు. కె. ఉప్పలపాడులోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్య కర్తలు మంగళవారం తల్లులకు సమా వేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పోషకా హారం, గర్భవతులు, బాలింతలు తీసుకో వాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కలి గించారు.

కార్యక్రమంలో కె.ఉప్పలపాడు, దేవిరెడ్డి పాలెం కార్యకర్తలు వరపర్ల సువర్ణ, కె. ఈశ్వరమ్మ, బి. సంధ్యారాణి,అనుసూర్యమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు ఎంఆర్ వాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

వయోజనులు అక్షరాస్యులు కావాలి

సింగరాయకొండ రూరల్: ఊళ్లపాలెం గ్రామంలో వయోజన విద్యా శాఖ అధికారి కందుకూరు సూపర్ వైజర్ నారాయణరావు మంగళవారం వయోజన విద్యా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోజన విద్యా కేంద్రాల ద్వారా వయోజనులకు అక్షరాస్యత పెం చేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేయడ మైనదని వారికి తెలియజేశారు. గ్రామం లోని వయోజనులతో ఆయన మాట్లాడి వారికి విద్య వల్ల ఎన్నిలాభాలు కలుగు తాయో తెలియజేశారు. అనంతరం వయో జన విద్యాకేంద్రంలో కో ఆర్డినేటర్లు పని తీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. వీరి వెంట మండల కో ఆర్డినేటర్ చిమట సుధాకర్, గ్రామ కో ఆర్డినేటర్ అశోక్‌లు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాల హెచ్ఎంగా భారతి

సింగరాయకొండ : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా దుంపా భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొండపి మండలం వెన్నూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న ఆమె బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్.ఎం ప్రమోదను బదిలీ చేశారు.

ఉపాధి కూలీల ఆధార్ అనుసంధానం ప్రారంభం



పాకలలో కూలీల వేతన సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

సింగరాయకొండ రూరల్: పాకల, పాత సింగరాయకొండ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసిన కూలీల ఆధార్‌నంబర్‌ను, జాబ్‌కార్డు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాను అనుసంధాన కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో ఎస్కె జమీవుల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో నేటికీ ఆధార్ నంబర్ బ్యాంకు ఎకౌంటుకు అనుసంధానం కాకుండా ఉన్నా ఉపాధి వేతన దారులకు ఇదొక చక్కటి అవకాశమని ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు వినియోగించాలని వారు కోరారు. పాకల, పాత సింగరాయకొండలలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ పంచాయతీలలో గ్రామాల వారీగా తగిన శాఖ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరిస్తారని ఆయన అన్నారు. పాకల పంచాయతీలో మొత్తం 3,766 జాబ్‌కార్డులు ఉండగా పల్లెపాలెంలో 92 జాబ్ కార్డులకు సమస్య పరిష్కరించడమైందని ఆయన అన్నారు. అదేవిధంగా పాత సింగరాయకొండలోని 1050 జాబ్‌కార్డులుండగా పంచాయతీ ఆఫీసు నందు 70జాబ్‌కార్డులకు సమస్య పరిష్కరించడమైందని తెలిపారు. అన్ని గ్రామాలలో ఈ క్యాంపులను ఏర్పాటు చేసి సకాలంలో సమస్యను పరిష్కరించి పునరావృత్తం కాకుండా చూస్తామని ఆయన అన్నారు. అన్ని పంచాయతీల్లో 1వ తేదీ నుండి 14 వ తేదీ వరకు ఈ క్యాంపులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపిఓ ప్రదీప్ కుమార్, ఏపిడి జిల్లా అధికారి కాంఛాయనీదేవి, ఎఫ్ఏలు, మేట్‌లు పాల్గొన్నారు.

తట్టు, పొంగు నివారణే లక్ష్యం

సింగరాయకొండ రూరల్: తట్టు, రూబెల్లా వ్యాధి భావితరాలకు కూడా ప్రమాదమేనంటున్నారు వైద్యులు. ముఖ్యంగా టీకా వేయించుకోక వ్యాధుల బారీనపడిన బాలికలకు పెళ్ళి అయిన తరువాత వారికి అన్నీ ఇబ్బందులు వస్తాయని పరిశోధనలో తేలింది. తట్టు వ్యాధికి గురై గర్భం దాల్చిన 90శాతం మంది మహిళలకు పుట్టిన చిన్నారులలో ఇలాంటి సమస్యలు వచ్చినట్లు గుర్తించారు. పలువురికి ప్రసవ మరణాలు సంభవించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో పస్తుత కార్యక్రమంలో ముఖ్యంగా బాలికలకు కచ్చితంగా ఎంఆర్ టీకా వేయించేలా ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశారు. ప్రవేటు పాఠశాలల విద్యార్థులు, బడి బయట బాలబాలికలను దీని పరిధిలోకి తేవడంతో అందరికీ ఎంఆర్ టీకా అందనుంది. మండలంలో పది పంచాయతీలుండగా వీటిలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల బాలబాలికలు 16,496 ఉన్నారని ప్రభుత్వ వైద్యనిపుణులు సివిల్ సర్జన్ డా. పద్మజ తెలిపారు.

ఈనెల 1 వ తేదీ నుండి 17వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు అన్నీ గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. 17 బృందాలు మండలంలో పనిచేస్తున్నాయని, ఈ ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమం మూడు విడతల వారీగా చేయబడునని తెలిపారు. 2020 నాటికి తట్టు రూబెల్లా వ్యాధులను దేశం మరియు రాష్ట్రంలో పూర్తిగా నివారించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఉపాధ్యాయులు బాధ్యతగా స్వీకరించి విద్యార్థులకు వ్యాక్సిన్ అందేలా చూడాలని కోరారు.


ఏమూలకు చేరిన కంప్యూటర్లు

అటకెక్కిన కంప్యూటర్ విద్య

లింగసముద్రం: జడ్పీ హైస్కూళ్లలో ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన కంప్యూటర్ విద్య ఆటకెక్కింది. ఏడెనిమిది సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని లింగసముద్రం, మొగిలిచర్ల, పెదపవని, విఆర్‌కోట జడ్పీ హైస్కూళ్లకు కంప్యూటర్లను అందించింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని బోధించేందుకు అప్పట్లో బోధకులను కూడా నియమించింది. అయితే మూడేళ్ల పాటు ఇద్దరేసి చొప్పున బోధకులను నియమించింది. కానీ ప్రభుత్వం బోధకులకు వేతనం ఇవ్వకపోవడంతో నాలుగు సంవత్సరాల నుంచి వారు కూడా తప్పుకున్నారు. దీంతో అప్పటినుంచి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని బోధించే బోధకులు లేకపోవడంతో కంప్యూటర్లు మూలకు చేరాయి. వీటిలో కొన్ని కంప్యూటర్లు మరమ్మత్తులకు గురయ్యాయి. ఒక్క లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో సుమారు 550 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించే బోధకులు లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. హైస్కూల్ స్థాయి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కల్పించి వారిని సాంకేతికంగా ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలని తలపెట్టిన కార్యక్రమం మధ్యలోనే అటకెక్కడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన నీరు

అధ్వానంగా మంగళిపాలెం రోడ్డు

వలేటివారిపాలెం: మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని మంగళిపాలెం రోడ్డు అధ్వానంగా మారింది. గ్రావెల్ రోడ్డంతా మోకాటి లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలలో వర్షపు నీరు చేరి చిన్నపాటి నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఆ రోడ్డు కాలనీవాసులకు నరకాన్ని చూపిస్తుంది. వర్షపునీటితో నిండిన మోకాటిలోతు గుంతలలో ద్విచక్ర వాహనదారుల రాకపోకల సమయంలో పడి ప్రమాదాల బారీన పడుతున్నారు. ప్రతినిత్యం మంగళిపాలెం కాలనీ వాసులు అందరూ వివిధ పనులకు బస్టాండుకు రావాలి ముఖ్యంగా వృద్ధులు రాత్రి సమయాలలో నానా అవస్థలు పడుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అధ్వాన్నంగా మోకాటి లోతు గుంతలు ఏర్పడిన గ్రామీణ రహదారికి గ్రావెల్ వేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కళతప్పిన చినపవని ప్రాథమిక పాఠశాల

- **ఒకప్పుడు 300 మందికి పైగా విద్యార్థులు**
- **నేడు 30 మంది**
- **యూపీ నుంచి ప్రాథమిక స్థాయికి తగ్గిన పాఠశాల**
- **ఇంగ్లీషు మీడియం కోసం ప్రైవేటు స్కూళ్లకు పరుగు**

లింగసముద్రం: మండలంలోని చనపవని ప్రాథమికోన్నత పాఠశాల (యూపీ)లో విద్యార్థుల సంఖ్య మూడు పదులకు కూడా మించకపోవడంతో కళావిహీనమైపోయింది. ఒకప్పుడు మూడువందలకు పైగా విద్యార్థులున్న ఈ పాఠశాలలో నేడు కేవలం ముప్ఫై నాలుగు మంది పిల్లలు మాత్రమే ఉండడంతో జిల్లా విద్యాశాఖాధికారులు ఈ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ప్రాథమిక పాఠశాల స్థాయికి తగ్గించారు. దీంతో పాఠశాలలో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులలో ఐదుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్ళనున్నారు. ఇక కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తారు. 1998వ సంవత్సరం నుంచి ఈ పాఠశాలలో సుమారు 300ల మందికి పైగా విద్యార్థులు చదువుతుండేవారు. ప్రస్తుతం 30మంది విద్యార్థులతో 10 శాతానికి పడిపోయింది. విద్యార్థులు లేకపోవడంతో రెండుమూడు గదులు కూడా మిగిలిపోయాయి.

అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులు

అప్పట్లో చినపవని యుపి పాఠశాలలో అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులుండేవారని స్థానికులు చెప్పారు. ఆ ఉపాధ్యాయులు గ్రామంలోనే నివాసముంటూ మరో వ్యాపకం లేకుండా విద్యార్థులకు పాఠశాలలో, ఇళ్ళవద్ద విద్యాబోధన చేసేవారు. దీంతో పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా ఏటా పెరిగేది. అప్పట్లో పనిచేసిన ఉపాధ్యాయులకు పెద్దగా విద్యా అర్హతలు లేకపోయినా వారి విద్యాబోధన చేసే విధానం, విద్యార్థుల పట్ల వారు చూపే ఆదరణ ఇవన్నీ విద్యార్థుల తల్లిదండ్రులను చూరగొన్నాయి.

అయితే కాలక్రమేణా ఈ పాఠశాలలో గడిచిన మూడు నాలుగేళ్ళ నుంచి విద్యార్థుల సంఖ్య పలచబడింది. ఉపాధ్యాయులు గ్రామంలో నివాసం ఉండకపోవడం, అంకితభావంతో విద్యాబోధన చేయకపోవడం, ఉపాధ్యాయులు ఇతర వ్యాపకాలలో ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో ఉపాధ్యాయులపై నమ్మకం కొరవడింది. దీనికితోడు విద్యార్థుల తల్లిదండ్రులలో కూడా తమ పిల్లలకు ఇంగ్లీష్ మీడియంలో చదువులు కావాలని బలమైన కోరికలు ఉండడంతో వారు కందుకూరు, కావలి, పెదపవని ప్రాంతాలలో ప్రవేటు పాఠశాలల్లో, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకుంటున్నారు.


తగ్గిన విద్యార్థులకు సంఖ్య

దీంతో రోజురోజుకి పాఠశాలలో విద్యార్థులు చేరే సంఖ్య తగ్గిపోయింది. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ఎన్ని పథకాలు పెట్టినా అవి తల్లిదండ్రులు, విద్యార్థులను ఆకర్షించలేక పోతున్నాయి. దీంతో గత జూన్ నెలలో ఈ పాఠశాలలో 1వ తరగతిలో కేవలం 10 మంది విద్యార్థులు మాత్రమే చేరినట్టు తెలిసింది. ప్రస్తుతం 5 తరగతులకు కలిపి కేవలం 34మంది విద్యార్థుల రోల్ ఉన్నప్పటికీ ప్రతి రోజూ 25 నుంచి 30 లోపసు విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఉపాధ్యాయులు సమయపాలన కూడా పాటించాల్సిన అవసరం ఉంది.


ప్రాథమిక స్థాయికి తగ్గిన ప్రాథమికోన్నత పాఠశాల

ఇంగ్లీష్ మీడియం అవసరం

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చదివించేందుకు ప్రవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. తమ వద్ద చదువుకొని డిగ్రీ పాసైన విద్యార్థులు ప్రవేటు స్కూళ్లలో బోధన చేస్తున్నారని, వారివద్దకు తమ పిల్లలను చదువుల కోసం పంపిస్తున్నారు. ఇది తమకు ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి పాఠశాలల్లో ఇంగ్లీష్ కూడా ప్రవేశ పెట్టాల్సిన అవసరం ఉంది.

- వి సుబ్బానాయుడు,
ప్రధానోపాధ్యాయులు,
చినపవని ప్రాథమిక పాఠశాల

నేడు స.హ. చట్టం అర్జీల స్వీకరణ

పీసీపల్లి : ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారం పొందేందుకు సమాచారహక్కు చట్టం ద్వారా ఇచ్చే అర్జీలను స్వీకరించేందుకు బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తహసీల్దార్ షేక్ మౌలాసాహెబ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు అర్జీలు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలేందుకు సిద్ధంగా..



- శిథిలావస్థలో వంతెనలు
- భయాందోళనలో వాహనచోదకులు, ప్రజలు



కందుకూరు రోడ్డులో రెయిలింగ్ లేని వంతెన

శిథిలమైన వంతెన

కనిగిరి : కూలేందుకు సిద్ధంగా కొన్ని.. పెచ్చులూడి పడిపోతున్నవి మరి కొన్ని.. కనిగిరి ప్రాంతంలో పలు రోడ్డు మార్గాల్లో శిథిలావస్థలోని వంతెనలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. అడుగున పగుళ్లు ఇచ్చి కూలి పోతున్నా.. పైకి మాత్రం తారు పూసి సుందరంగా కప్పేస్తున్నారు. వర్షాలు, వరదలు వస్తే వాటిపై అడుగడుగునా గండమే.

కనిగిరి-కందుకూరు, కనిగిరి-హనుమంతునిపాడు, కనిగిరి-గుడిపాడు, మారెళ్ళ- పెద ఇర్లపాడు, వరిమడుగు- వెంగళాయిపల్లి, కనిగిరి- కంబం రోడ్డులోని వేములపాడు-గాయంవారిపల్లి మధ్య రోడ్డు మార్గాల్లో పలు వంతెనలు పురాతన కాలం నాడు నిర్మించడంతో శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఏళ్లతరబడి భయనకంగా ఉన్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.

100 ఏళ్ల నాటి వంతెన...

కనిగిరి-కందుకూరు రోడ్డు మార్గంలో బూడిదగుంట వాగుపై నిర్మించిన వంతెన 100 ఏళ్ల నాటిది. పెద్దపెద్ద బండరాళ్లతో నిర్మాణం జరిగింది. వంతెన రైలింగ్ గోడలు పూర్తిగా శిథిలమయ్యాయి. గ్రానైట్ రాళ్ల లోడుతో భారీ వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తుంటాయి. నిత్యం ఈ రోడ్డు మార్గంలో ట్రాఫిక్ రద్దీగా ఉంటుంది. వంతెన ఇరుకుగా ఉండటంతో పాటు రైలింగ్ గోడలు శిథిలం కావడంతో ఏమాత్రంగా అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదమే.

పంచలింగాల కొండవద్ద..

కనిగిరి- కందుకూరు రోడ్డులోని పంచలింగాల కొండవద్ద ఉన్న లోలెవల్ వంతెన శిథిలమైంది. వంతెన కిరువైపులా పాతిన రాళ్లు ఊడిపోయాయి. రాత్రి సమయంలో నిదానంగా కాకుండా వేగంగా వాహనాలు నడిపితే అంతే సంగతి. వంతెనకు ఇరువైపులా ఇసుక కోసం పెద్దగుంతలు తీశారు. దీంతో వంతెన కుంగింది. ఈ రోడ్డు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. అయినా పట్టించుకున్న పరిస్థితి లేదు.

చప్టాలు.. లోలెవల్ వంతెనలదీ అదే దారి...

కనిగిరి - కందుకూరు, కనిగిరి - వేములపాడు, కనిగిరి-గుడిపాడు రోడ్డు మార్గాల్లో పలు లోలెవల్ వంతెనలు, చప్టాలు శిథిలమయ్యాయి. మారెళ్ళ-పెద ఇర్లపాడు రోడ్డు మార్గంలో మూడు చప్టాలు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలంలో ప్రవాహం వస్తే వాహనాలు చప్టా రాళ్ళ మధ్యలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. వరిమడుగు- వెంగళాయిపల్లి వద్ద లో లెవల్ వంతెన పూర్తిగా శిథిలమైంది. ఇండికేటర్లు లేవు. వాగుకు వరద వస్తే వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. కనిగిరి- కంబం రోడ్డులోని వేములపాడు-గాయంవారిపల్లి మధ్య ఏనుగుమంద వాగుపై నిర్మించిన చప్టా వంతెన శిథిలమైంది. మహమ్మదాపురం రోడ్డులోను చప్టా పరిస్థితీ అంతే. హాజీపురం అడ్డరోడ్డు నుంచి కూటాగుండ్ల రోడ్డులో ఊరవాగుపై ఉన్న లోలెవల్ వంతెన శిథిలమైంది. ఈ వంతెనలు, చప్టాలు దెబ్బతినడంతో వాహన చోదకులు ఏమాత్ర నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా ప్రమాదాలకు గురికావల్సి వస్తుంది. రోడ్లు భవనాల శాఖ ఈఈ కార్యాలయం కనిగిరిలో ఉన్నా ఇంకెన్నాళ్లీ అగచాట్లని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పీసీపల్లిలో వర్షం

పీసీపల్లి : పీసీపల్లిలో మంగళవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రంగా ఉంది. రాత్రికి 12 గంటలకు గాలి కూడా వీయకుండా ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఒంటి గంటకు చిరుజల్లులు మొదలై 2.30 గంటల వరకు వర్షం కురిసింది. ఇది 17.2 మి.మీ.గా నమోదైంది. మండలంలోని ఇర్లపాడు, వెంగళాయపల్లి, వరిమడుగు, తలకొండపాడు, మరికంటపల్లి, పీసీపల్లిలో పదును వర్షం పడింది. ఈ వర్షంతో మెట్టపైర్లు సజ్జ, కంది పైర్లు జీవం పోసుకుంటాయని రైతులు ఆనందపడుతున్నారు. కాగా మారెళ్ళ, నేరేడుపల్లి, పోతవరం, అలవలపాడులో తగినంత వర్షపాతం నమోదుకాలేదు. ఇక్కడ కంది ఎండుముఖం పడుతుంది.

సూక్ష్మపోషకాలను వినియోగించుకోవాలి

కనిగిరి : నూరుశాతం రాయితీపై ఇచ్చే సూక్ష్మపోషకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఆర్నూరి దీప రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గురవాజీపేట, కృష్ణాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె పెసర పంటను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. పెసరలో దోమ నివారణకు ఎసిపేట్ 300 గ్రాములు ఎకరాకు పిచికారి చేయాలన్నారు. ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేసుకోవాలని తద్వారా ఇచ్చే సాగు ధ్రువీకరణ పత్రాలతో రాయితీలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు హబీబ్‌జిలాని, ఆత్మ ఏటీఎం పద్మప్రియ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

సీఎస్‌పురం (పామూరు) : పర్నూరు మండల దేవరపల్లి గ్రామంలో దళితులకు చెందిన భూముల్లో చెరువులను తవ్వించిన విషయం తెలిసిందే. బాధితులకు అండగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విరాళాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా మండలంలోని సీఎస్‌పురంలో రూ.4020 సే కరించినట్లు నాయకులు తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

పామూరు : మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో మల్లెల నారాయణ, యాదాల రామకృష్ణ, శేషమ్మ ఇంటి స్థలం వద్ద జూలై 27న ఘర్షణ దిగారు. మల్లెల నారాయణ బంధువు ఎం.లక్ష్మీదేవి పిర్యాదు మేరకు ఎస్సై ఉసా సాంబశివయ్యకేసు నమోదు చేశారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం ముగ్గురు ముద్దాలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

జాబ్ కార్డుకు బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పామూరు : ఉపాధి కూలీలందరూ తప్పనిసరిగా జాబ్‌కార్డుకు బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని బేస్తవారిపేట ఏపీడీ పద్మావతి తెలిపారు. మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేది వరకు వివిధ గ్రామ పంచాయతీల వారీగా నిర్వహించే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పడమటకట్టకిందపల్లి, చిలంకూరు, దాదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల అవగాహన సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేసుకుంటే కూలీ గిట్టుబాటు అవుతుందని సూచించారు. పనులు చేసినా బిల్లులు రాకపోవటానికి కారణం కూలీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోకపోవడమేనన్నారు. పలు బ్యాంకులకు చెందిన సిబ్బంది గ్రామసభల్లోనే బ్యాంకు ఖాతాకు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జి.శివమ్మ, గంధం జ్వాలా రాణి, ఒంటేలి నాగార్జున, టీపీ రజిని, బీసీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ ప్రతిష్ఠ వేడుకలు

సీఎస్‌పురం (పామూరు) : మండలంలోని తిమ్మరాజుపల్లి గ్రామంలో గంగమ్మ అమ్మవారి ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో ఉదయం గణపతి పూజ అఖండ దీపారాధన, గ్రామదేవత ఆహ్వానం, గమిడి తోరణ బంధన, సాయంత్రం స్వామివార్ల విగ్రహాలకు పంచామృతాభిషేకం, అంకురారోహణ, మంత్రజపం, విగ్రహాలకు జలదివాసం నిర్వహించారు. 2న అమ్మవారి గ్రామోత్సవం, 3న అమ్మవారి స్థిర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ దంతనాల వీరాచార్యులు, కుమారుడు బాలకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

పామూరు : 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లల్లో వచ్చే ప్రాణాంతకమైన వ్యాధుల నివారణకు చేపట్టిన ఎంఆర్ వ్యాక్సిన్ క్యాంపెన్‌ను సమర్ధవంతంగా నిర్వహించాలని వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఎంపీడీవో కె. రాజారావు కోరారు. స్థానిక ఆల్ఫా హైస్కూల్‌లో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఒక టీకాతో రెండు ప్రాణాంతక వ్యాధులను దూరం చేసే ఈ వ్యాక్సిన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తుందని వారు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ క్యాంపెన్‌లో పాల్గొని లక్ష్యాలను సాధించాలన్నారు. మండలంలో 15490 మంది పిల్లలకు గాను 8893 మంది పిల్లలు పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని, వారందరికీ ఈ నెల మొదటి, రెండవ వారాల్లో టీకాలు వేయడం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ టి.అహమ్మద్ ఉస్మాన్, డాక్టర్లు పి.రాజశేఖర్, టి.చెన్నకృష్ణ, ఎ.సునీత, సీహెచ్‌వో మురళీకృష్ణ, ఆల్ఫా హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఏకే రావు, వైద్యశాల అభివృద్ధి సభ్యుడు ఎస్‌డీ అహమ్మద్ గౌస్, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ పువ్వాడి, ఎంపీడీవో

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పామూరు : వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక ఖర్చులను నియంత్రించవచ్చని ఏఈవో లెక్కల మాల్యాద్రి, ఎంపీఈవో సీహెచ్ సుబ్బారావు సూచించారు. మండలంలోని మోపాడు, కొండారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆశించిన మేర వర్షాలు కురవకపోవటంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించలేదన్నారు. ఇకపై దుక్కులు దున్నుకొని భూములను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పౌజ్ నిబంధనలు వర్తించవా?

కనిగిరి టౌన్ : యూటీఎఫ్ నాయకుల శ్రీమతులకు స్పౌజ్ నిబంధనలు పాటించకపోగా ఆయా సంఘాన్ని అడ్డం పెట్టుకొని ఉపాధ్యాయ బదిలీల్లో యూటీఎఫ్ నాయకులు అక్రమ బదిలీలకు పక్షపాతంగా వ్యవహరించడం సిగ్గుచేటని బీటీఏ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు విమర్శించారు. స్థానిక బీటీఏ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పౌజ్ నిబంధనల ప్రకారం భార్య, భర్తలు అతి దగ్గరగా ఉన్నా స్థానాల్లో ఎంచుకోవాలి గానీ, వారికి అనుకూల స్థానాలను తీసుకున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ బదిలీల్లో ఒకప్పటి యూటీఎఫ్ నాయకులు అధికారిగా ఉండటం, ఆ అధికారి యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఉండేల పిచ్చిరెడ్డి, కాసు సురేంద్రరెడ్డిలు, శ్రీమతుల బదిలీల్లో సహకరించారని ఆరోపించారు. యూటీఎఫ్‌కు దక్కని స్థానా, హెచ్ఎస్, ఎంపీపీఎస్ ఖాళీలను బ్లాక్‌లిస్టులో పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.

సినిమాలు

కనిగిరి

శ్రీనివాస	- పిదా
సుదర్శన్	- గౌతమ్‌నంద

అమ్మో.. ఎన్‌హెచ్ 565



ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారి

- నెత్తురోడుతున్న రోడ్డు • రోజూ ప్రమాదాలే
- రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు శూన్యం

కనిగిరి : ఎన్‌హెచ్ 565 రాష్ట్రీయ జాతీయ రహదారి నెత్తురు తాగుతోంది. రోడ్డు నిర్మాణాలు.. అసంపూర్తిగా వదిలేయడం.. ప్రమాదాల సూచికలు ఏర్పాటు చేయకపోవడం.. మితిమీరిన వేగంతో ప్రాణాలు పోతున్నాయి.

నకిరేకల్లు నుంచి ఏర్పేడు వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి చినారికట్ల జంక్షన్ నుంచి కనిగిరి మీదుగా పామూరు వరకు కి.మీ. దూరం ఉంటుంది. మూడు నెలల కాలంలోనే ఈ రోడ్డుమార్గంలో ఎనిమిది మంది మృత్యువాత పడగా, 35 మందికి పైగా గాయపడ్డారు. ప్రమాదాల నియంత్రణకు పోలీసు అధికారులు పెద్దగా చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. ప్రమాదాలు జరిగిన సమయంలో హడావుడి చేసి ఆ తరువాత మర్చిపోతున్నారు. దీంతో పరిస్థితిలో మార్పు ఉండటం లేదు.

అసంపూర్తి నిర్మాణాలు, మలుపులే కారణం

ఎన్‌హెచ్ 565 రాష్ట్రీయ జాతీయ రహదారి లో పలు చోట్ల రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయకుండా అర్ధంతరంగా వదిలివేశారు. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. కనిగిరి- పొదిలి రోడ్డు మార్గంలోని కాశిరెడ్డి నగర్ వద్ద కల్వర్టు వద్ద రోడ్డు నిర్మించ లేదు. ఆ ప్రాంతం గుంతగా ఉంటుంది. దగ్గరికి వచ్చే వరకు కనిపించదు. జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న వాహనాలు గుంత దగ్గరకు వచ్చేలోగా కనిపించక పోవడంతో వేగాన్ని నియంత్రించలేక సడన్‌బ్రేక్ వేయటం పల్టీలు గొట్టడం జరుగుతుంది.



రహదారిపై ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

గ్రామాలకు వెళ్లే రోడ్ల ప్రాంతంలో సరైన ప్రమాద సూచికలు, శాశ్వత చర్యలు లేనికారణంగా ప్రయాణికులు బలవుతున్నారు. జాతీయ రహదారి అయితే మలుపుతీసుకునే ప్రాంతంలో 10 మీటర్ల వరకు వాహనాలు నిలుపుకునే వెసులుబాటు ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో వాహనాన్ని నిలుపుకొని ఇబ్బంది లేదు అనుకున్నప్పుడే రహదారిని దాటవచ్చు. రాష్ట్రీయ రహదారులైతే ఆ అవకాశం లేకుండా పోతుంది. అదేవిధంగా కనిగిరి-పామూరు రాష్ట్రీయ రహదారి రోడ్డు మార్గంలో మలుపులు అధికంగా ఉండటం, ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా రాష్ట్రీయ రహదారిగా ఏర్పడటంతో వాహనాలు మితిమీరిన వేగంతో ఉండటం ప్రమాదానికి కారణమైంది.

- తాజాగా హైదరాబాదు నుంచి వస్తున్న విన్నోవా వాహనం కాశిరెడ్డినగర్ వద్ద కల్వర్టు అసంపూర్తి నిర్మాణం కనిపించక కారు పల్టీలు కొట్టి అయిదేళ్ల చిన్నారి మరణించగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- దేవాంగనగర్ వద్ద ఇటీవల కారు బోల్తాపడి కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందారు.
- మాచవరం వద్ద పాఠశాలకు వెళ్తున్న విద్యార్థిని కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.
- బాలు రవీంద్రరెడ్డి భార్యతో కలిసి కొత్తూరు వద్ద వాకింగ్‌కు వెళ్తుండగా వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రికి తీసుకెళ్లగా దుర్మణం పాలైయారు.
- వగ్గంపల్లి వద్ద మోటారుసైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని మినీ లారీ ఢీకొనగా తీవ్రగాయాలకు గురికాగా గుంటూరు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.



మృతిచెందిన బాలిక (ఫైల్)

- రావిగుంటపల్లి టోల్ గేట్ వద్ద పొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొట్టడంతో బస్సులోని 20 మందికి పైగా గాయపడి కనిగిరి, పామూరు ఆసుపత్రిలో చికిత్సపొందారు.
- రావిగుంటపల్లి టోల్‌గేటు వద్ద అయిల్ ట్యాంకర్ మోటారు ఢీకొనడటంతో ఒకరికి గాయాలయ్యాయి.
- ట్రావెల్ బస్సు పామూరు బైపాసులో అదుపుతప్పి బోల్తా పడటంతో బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది తీవ్రగాయాలకు గురైయ్యారు.
- విరాట్ నగర్ వద్ద నెల్లూరురోడ్డుపై వేగంగా వస్తున్నకారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.
- వగ్గంపల్లి వద్ద కారు, మోటారుసైకిల్ ఢీకొనటంతో మోటారుసైకిల్‌పై వస్తున్న వ్యక్తితీవ్రగాయాలకు గురై మరణించారు.

రక్షణ చర్యలు తీసుకుంటాం



కనిగిరి - పామూరు రాష్ట్రీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటాం. మలుపులు వద్ద గ్రామాలకు వెళ్లే రోడ్డుమార్గాల్లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణకు ఆర్టీసీ కార్మికులు, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

- ఉప్పు శ్రీనివాసులు, ఎస్సై కనిగిరి



రక్తపు మడుగులో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి (ఫైల్)

నంద్యాల ఎన్నికల ప్రచారంలో ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న లిడ్‌క్యాప్ చైర్మన్ ఎరిక్షన్‌బాబు

కనిగిరి : నంద్యాల శాసనసభ నియోజకవర్గ టీడీపీ ఎన్నికల ప్రచారంలో లిడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ఎరిక్షన్‌బాబు మంగళవారం పాల్గొన్నారు. నంద్యాల ఏబీఎం కాంపౌండ్‌లోని జరిగిన కార్యక్రమంలో ఆయన ఎస్సీ వర్గాలను వైసీపీ నుంచి టీడీపీలోకి చేర్చడంతోపాటు మాదిగల సంక్షేమానికి చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మాట్లాడుతూ రాబోవు 15 ఏళ్లకాలంలో చంద్రబాబు సీఎంగా ఉంటేనే అభివృద్ధిలో మనరాష్ట్రం దేశంలోనే ముందుంటుందన్నారు. టీడీపీ ప్రభుత్వంలోనే దళితులకు సముచిత స్థానం లభిస్తుందని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు టీడీపీ ప్రభుత్వంలోనే ఆర్థికంగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. మాదిగ వర్గాలకు టీడీపీ ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందనేందుకు నిదర్శనంగా తనను లిడ్‌క్యాప్‌కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు. వైసీపీ నేతలు చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అడ్డుపడుతున్నారన్నారు. నంద్యాల అసెంబ్లీలో టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో మంత్రి సోమిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ చైతన్య సదస్సును జయప్రదం చేయాలి

కనిగిరి టౌన్ : విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో రాయితీ వంటి విషయాలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 7న కనిగిరిలో నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు ఆర్.విశ్వనాథాచారి, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకట శేషబ్రహ్మం కోరారు. పట్టణంలోని మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ సి.కనకాచారి, ఎమ్మెల్యే కదిరి బాబూరావు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సుబ్బారావు, చెరికచర్ల ప్రకాశరావు, శేషబ్రహ్మం, కనకరత్నాచారి, ఎన్.లక్ష్మణచారి, సుధాకరాచారి, ఈశ్వరయ్య,రామకృష్ణ పాల్గొన్నారు.

మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టాలి

కనిగిరి టౌన్ : ప్రాణాంతక వ్యాధిగా రూపాంతరం చెందుతున్న మీజిల్స్-రుబెల్లా వ్యాధులను తరిమి కొట్టేందుకు ఆరోగ్యశాఖకు ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ షేక్ చినమస్తాన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌లను వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎంఆర్ వ్యాక్సిన్‌లను 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు తప్పని సరిగ్గా వేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చిరంజీవి, కమిషనర్ కేవీ పద్మావతి ఎంపీడీవో పి.కోదండయ్యరామయ్య, ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎన్.నాగరాజ్యలక్ష్మి, ఎంవీ విజయ్‌బాస్కర్, కోఆప్షన్ పీర్లమస్తాన్ వలి, హెచ్‌ఎం పద్మావతి, ముండ్లమూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి : తట్టు, రుబెల్లా వ్యాధులను ఎంఆర్ వ్యాక్సిన్‌తో నివారించవచ్చని పీసీపల్లి వైద్యాధికారిణి డాక్టర్ సుజన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధులను నివారించేందుకు మంగళవారం నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు ఎంఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు ఆమె ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ద్వారా టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తట్టు అనేది ప్రాణాంతకమైన వ్యాధి అని, ఇది సోకిన వారు నెమోనియా, అతిసారం ఇతర ప్రాణాంతకమైన సమస్యలతో బాధపడతారన్నారు. రుబెల్లా వ్యాది సోకినవారు అంధత్వం, వినికిడి లోపం, బుద్ధిమాద్యం, పుట్టుకతోనే సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. గర్భంతో ఉన్న మహిళకు రూబేల్లా సోకినప్పుడు పుట్టబోయే శిశువుకు కూడా జననలోపాలు ఏర్పడతాయన్నారు. ముందస్తుగానే వీటి నివారణకు 9 నెలల నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన పిల్లలకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. మంగళవారం 1802 మంది విద్యార్థులకు టీకాలు వేశామని తెలిపారు. గురువారం మిగిలిన వారికి కూడా వేస్తామన్నారు.



విద్యార్థులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సుజన

రక్తదానం ఓ ఉద్యమంలా సాగాలి

కనిగిరి టౌన్ : రక్తదాన కార్యక్రమం ఓ ఉద్యమంలా సాగాలని కనిగిరి ఏరియా వైద్యశాల కమిటీ చైర్మన్ వీవీఆర్ మనోహర్‌రావు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గయాజ్ నేతృత్వంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ ఆహర లోపం కారణంగా చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారని, దాని వల్ల రక్తశాతం తగ్గి, ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అటువంటి సందర్భంలో వారికి రక్తదానం చేసిన వారిని భగవత్ స్వరూపులుగా కొనియాడాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు జేవీవీ నిర్వహించడం హర్షించతగ్గ విషయమన్నారు. గతంలో ఎన్నో మార్లు జేవీవీ నాయకులు గయాజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు విజయవంతంగా నిర్వహించారన్నారు. శిబిరంలో కృష్ణచైతన్య డిగ్రీకళాశాల విద్యార్థులు రక్తదానం చేసినందుకు అభినందించి, పత్రాలు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ షేక్ చినమస్తాన్, వైద్యశాల సూపరింటెండెంట్ పి.విజయలక్ష్మి, డాక్టర్లు సుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ ఫయాజ్, కోఆప్షన్ పీర్లమస్తాన్ వలి, కృష్ణ చైతన్యకళాశాల కరస్పాండెంట్ ఎం.కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వైద్యశాల ఆవరణలో జేవీవీ నాయకులు గయాజ్, ఫణి, రవి మొక్కలు నాటారు.



రక్తదానం శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యశాల కమిటీ చైర్మన్ మనోహర్‌రావు

వసతులు ఫుల్...ఆపరేషన్లు నిల్

అద్దంకి: కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నా... అత్యధిక శాతం పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. అద్దంకి క్లస్టర్ పరిధిలో 6 పీహెచ్‌సీలు ఉండగా ఏ ఒక్కచోట కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. దీంతో ప్రయివేటు వైద్యశాలలను ఆశ్రయించి వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పక్కా భవనాలు, అన్నింటికి మించి ఆధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్‌లు ఉన్నా అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి.

అద్దంకి క్లస్టర్ పరిధిలో పరిధిలో మోదేపల్లి, కొరిశపాడు, మేదరమెట్ల, ప్రాసంగులపాడు, పంగులూరు, మారెళ్ళలో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క పీహెచ్‌సీ పరిధిలో కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగటం లేదు. ఇక అద్దంకి కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచిపోయి ఏడాది దాటిపోయింది. పాత భవనం మరమ్మతుల పేరుతో నిలిచిపోయిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ఇంకా ప్రారంభం కాలేదు. అద్దంకిలో గతంలో నెలకు సరాసరిన 30 నుండి 40 వరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసేవారు. ప్రత్యేక క్యాంప్‌లు పెట్టినప్పుడైతే పెద్ద ఎత్తున బటన్ హోల్ ఆపరేషన్ లు జరిగేవి.



ఏళ్ళ తరబడి తాళాలు తీయని మోదేపల్లి పీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

- నిలిచిన కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

బల్లికురవ మండలంలోని గుంటుపల్లి పీహెచ్‌సీలో మూడు నెలలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిలిచి పోయాయి. రూ.75 లక్షలతో అధునాతన భవనాన్ని, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటుచేశారు. వైద్య ఆరోగ్య శాఖ, సిబ్బంది నిర్లక్ష్యంతో గత మూడు నెలల నుండి ఇక్కడ ఆపరేషన్లు జరగడం లేదు. సీనియర్ వైద్యాధికారిణి ఉండి కూడా ఆపరేషన్లు జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మోదేపల్లి పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ తలుపులు ఏళ్ల తరబడి తీయకపోవటంతో గది కూడా బూజు పట్టి పోయింది. ఇక ప్రాసంగులపాడులో ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. కొరిశపాడు, మేదరమెట్లలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేసేందుకు శిక్షణ పొందిన వైద్యులు లేరు.

అద్దంకి క్లస్టర్ పరిధిలో అద్దంకి సీహెచ్‌సీతో పాటు 6 పీహెచ్‌సీలు ఉన్నా ఏ ఒక్కచోట కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు జరగక పోవటంతో బాలింతలు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఒంగోలు వెళ్ళాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధిక వ్యయం అయినా స్థానికంగానే ప్రయివేటు వైద్యశాలల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లు చేయించుకుంటున్నారు. దీంతో కనీసం పది వేల నుండి 15 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని పీహెచ్‌సీలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అలంకారప్రాయంగా అద్దంకి సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్

వారం రోజుల్లో ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం

డాక్టర్ నాగభూషణం, వైద్యాధికారి, సీహెచ్‌సీ, అద్దంకి



పాత భవనం మరమ్మతులు పూర్తయ్యాయి. ఆపరేషన్ థియేటర్ కూడా సిద్ధం అయ్యింది. టెస్టింగ్‌కు ల్యాబ్‌కు పంపించగా రిపోర్టు కూడా వచ్చింది. వారం రోజులలో మరలా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ప్రారంభిస్తాం.

రైతుల శ్రేయస్సు కోసమే విత్తనాభివృద్ధి పథకం

మార్టూరు: రైతులు విత్తన స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా గ్రామాల్లో గ్రామీణ విత్తనాభివృద్ధి పథకం పనిచేస్తుందని ఒంగోలు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇసుకదర్శి గ్రామంలో ఒంగోలు రైతు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనాభివృద్ది పథకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. 50 మంది రైతులకు బీపీటీ 5204 రకపు వరి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో మౌలాలి, ఆత్మ పీటీఎం రాధాకృష్ణ, ఎంపీఈవో సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులకు ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానం

మార్టూరు: నాగరాజుపల్లి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలు పొందిన జాబ్ కార్డులకు ఆధార్ బ్యాంక్ ఖాతాల నెంబర్లును నమోదు చేసే కార్యక్రమం జరిగింది. జాబ్ కార్డులకు ఆధార్, బ్యాంక్ ఖాతాలు అనుసంధానం కాకపోవడంతో నాలుగు నెలల నుంచి కూలీలకు బిల్లులు రాలేదు. దీంతో అధికారులు వాటికి జమ చేసి బిల్లుల మంజూరుకు గ్రామం వచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ సుభాషిణి, సొసైటీ అధ్యక్షుడు మిన్నెకంటి కిశోర్, గ్రామ సర్పంచ్ వెంపరాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు దినోత్సవం

మార్టూరు: మండలంలో బుధవారం సమాచార హక్కు దినోత్సవం ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్ డి.మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని పొందుటకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్ : అద్దంకి మండలంలో జూలైలో జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా పలు ప్రాథమిక, పాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో నూతన ఉపాధ్యాయలు విధులలో చేరినట్లు ఎంఈవో నూనె విజయ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని నెంబర్ 1 అద్దంకి ఎంపీయూపీఎస్ స్కూల్‌లో గ్రేడ్ -2 తెలుగు, గ్రేడ్ 2- హిందీ, ఎంపీయూపీఎస్ వెంపరాలలో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్, గ్రేడ్ -2 తెలుగు, గ్రేడ్ 2- హిందీ, కోటికలపూడి ఎంపీయూపీ స్కూల్‌లో మ్యాథ్స్ అసిస్టెంట్, సోషల్ అసిస్టెంట్, గ్రేడ్ -2 తెలుగు, గ్రేడ్ 2- హిందీ, ఎంపీయూపీ స్కూల్ నాగులపాడులో బయాలాజికల్ సైన్స్ అసిస్టెంట్, గ్రేడ్ -2 తెలుగు, ఉప్పలపాడులో గ్రేడ్-2 తెలుగు, జడ్పీహెచ్‌ఎస్ గురకాయపాలెంలో గ్రేడ్ -2 తెలుగు, గ్రేడ్ 2- హిందీ, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్, సోషల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు విధులలో చేరినట్లు చెప్పారు.

మేకల కాపరి హత్య కేసులో ఐదుగురి అరెస్టు

మార్టూరు: మండల పరిధిలోని రాజుపాలెం సెంటర్ సమీపంలో దెయ్యపు వాగు బ్రిడ్జి కింద గత నెల 19వ తేదీన హత్యకు గురైన పెదగొరవరపు రామలింగం హత్య కేసులో మంగళవారం సాయంత్రం ఐదుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న రూ.2 లక్షల విలువైన 37 మేకలను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను మార్టూరు పోలీసుస్టేషన్‌లో చీరాల డీఎస్పీ ప్రేమ్ కాజల్ విలేకర్లకు తెలిపారు. ఆదిజాంబవంతు కాలనీకి చెందిన రామలింగం బ్రిడ్జి సమీపంలో మేకలను మేపుకుంటుంటాడు. గుంటూరు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన బత్తుల శ్రీను, మొగిలి శ్రీను, కాట్రోత్ రాజు అనే ముగ్గురు వ్యక్తులు రెండు రోజులు బ్రిడ్జి వద్ద రెక్కీ నిర్వహించారు. రామలింగంతో పరిచయం పెంచుకుని గత నెల 19వ తేదీన మధ్యాహ్న సమయంలో అతనితో మాట్లాడుతూ కండువాతో గొంతు నులిమి చంపి ముఖాన్ని రాళ్లతో కొట్టి వేశారు. అనంతరం 37 మేకలను తమ బంధువులైన వల్లెపు వరలక్ష్మి, బత్తుల వెంకాయమ్మతో కలసి ఆటోలో తరలించారు. మంగళవారం రాజుపాలెం సెంటర్‌లో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. బుధవారం వారిని అద్దంకి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఇంకొల్లు సీఐ ఎం.శ్రీనివాసరావు, మార్టూరు ఎస్సై నాగమల్లేశ్వరరావును అభినందించారు.

మార్టూరులో యువకుడి ఆత్మహత్య

మార్టూరు: మార్టూరులోని తూర్పు బజారులో పుట్టా ప్రసన్న కుమార్(38) అనే యువకుడు మంగళవారం వేకువజామున ఇంటి సమీపంలోని రేకుల షెడ్‌లో లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య, కుమార్తెలు పుట్టింట్లో ఉండటంతో విషయం తెలుసుకుని ఉదయాన్నే మార్టూరు వచ్చారు. వీఆర్వో ప్రసాద్ సమక్షంలో చిలకలూరిపేట వైద్యులు శవ పంచనామా నిర్వహించారు. ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీబీవీలో బోరుకు మరమ్మతులు

బల్లికురవ: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం బోరుకు మరమ్మతులు చేయించారు. ఆంధ్రజ్యోతిలో కేజీబీవీలో దాహం కేకలు అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు పాఠశాల ప్రత్యేక అధికారిణి సరళ కుమారి ఇప్పటివరకు వినియోగంలో లేని బోరులో కొత్త పైపులు వేయించారు. వారంరోజుల్లో పాఠశాల్లో కొత్త బోరు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా మినీ ట్యాంకుల ద్వారా నీటిని బయట నుంచి తెప్పిస్తున్నామని తెలిపారు.

మండల ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

అద్దంకి: అద్దంకి మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి కరి అరుణ రాజీనామా చేయగా అధికారులు ఆమోదించారు. కరి అరుణ జూలై 14వ తేదీ ఎంపీపీగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను ఆమోదిస్తున్నట్లు జిల్లా అధికారుల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి మంగళవారం ఉత్తర్వులు అందాయి. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఉపాధ్యక్ష పదవికి త్వరలో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని ఎంపీడీవో హేమాద్రి నాయుడు తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రారంభించాలి

బల్లికురవ: మరుగుదొడ్డి లేనివారు ఈ నెల 10వ తేదీ లోపు వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని తహసీల్దార్ ఎస్.వి.సుధాకర్ కోరారు. మంగళవారం అనమనమూరు వెలమవారిపాలెం గ్రామంలో తహసీల్దార్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ఇంకా 105 గృహాలకు మరుగుదొడ్లు లేనట్లుగా సర్వేలో తేలిందన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అధికారులలో టెన్షన్ టెన్షన్

- రేపు బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం
- కరణం, గొట్టిపాటి హాజరయ్యే అవకాశం
- ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లలో పోలీస్ శాఖ

బల్లికురవ: బల్లికురవ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం అంటేనే ప్రతిసారి అధికారులు, రాజకీయ నాయకులు, పోలీస్‌లలో టెన్షన్ మొదలవుతుంది. మండల ప్రజలు కూడా కూడా సమావేశం ముగిసే వరకు ఉత్కంఠగా ఎదురు చూడటం పరిపాటిగా ఉంది. పోలీసులు అయితే బందోబస్తు ఏర్పాటు చేయటం తప్పనిసరిగా మారింది. మూడునెలలకు ఒకసారి జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరగనుంది. ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌లు హాజరుకానున్నారని ఇప్పటికే ఇరు వర్గీయులు ప్రచారం చేసుకుంటున్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు కూడా ప్రత్యేక బందోబస్తుకు సిద్ధం అవుతున్నారు.

మారిన బలాబలాలు....

మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఉండగా ఎన్నికలు జరిగిన సమయంలో ఎమ్మెల్యే రవికుమార్ వర్గీయులు 8 మంది గెలుపొందగా, ఎంపీపీ ఎన్నిక సమయంలో కొత్తూరు ఎంపీటీసీ బుల్లెమ్మ భాయ్ ప్లేటు ఫిరాయించి కరణం వర్గంలోకి జంప్ కావటంతో సారెడ్డ పుల్లమ్మ ఎంపీపీ అయ్యారు. మూడేళ్ల నుంచి ఆమె కొనసాగుతున్నారు. దీంతో ఎమ్మెల్యే రవికుమార్ వర్గీయుల బలం ఏడు గురు అయ్యారు. అయితే టీడీపీలోకి చేరిన తరువాత గత నెలలో బలరాం వర్గానికి చెందిన నలుగురు ఎంపీటీసీలు ఎమ్మెల్యే రవికుమార్ వర్గంలోకి చేరారు. దీంతో కరణం వర్గంలో ఎంపీపీ సారెడ్డు పుల్లమ్మతో పాటు మరో ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే ఉన్నారు. రవికుమార్ వర్గంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలు ఉన్నారు. దీంతో ఆయన వర్గీయులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంపై దృష్టి సారించారు. ఇద్దరు నాయకులు హాజరైతే పరిస్థితి ఎలా ఉంటుందోనని అటు అధికారులు, ఇటు పోలీసుల్లో టెన్షన్ మొదలైంది.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా దశరథ

పర్చూరు: ఆంధ్రపగతి గ్రామీణ బ్యాంకు పర్చూరుశాఖ మేనేజర్‌గా డి.దశరథ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన నారాయణరావు సోమవారంతో పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో దశరథ నూతన మేనేజర్‌గా పర్చూరుకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా దశరథ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను మరింత విస్తృత పరిచి వినియోగ దార్లకు మెరుగైన సేవలు అందించే విధంగా తనవంతు కృషిచేస్తామన్నారు.

ఊరూరా మొక్కలు నాటే కార్యక్రమం

డ్వామా పీడీ ఎన్.పోలప్ప

పర్చూరు: పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్టు డ్వామా పీడీ ఎన్.పోలప్ప అన్నారు. పర్చూరులో ఉపాధి నిధుల తోపాటు, ఎన్ఆర్ఐ నిదులతో రూ.33 లక్షల వ్యయంతో చేపడుతున్న హిందూ, క్రిష్టియన్ శ్మశాన వాటిక నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ పోలప్ప మాట్లాడుతూ జిల్లాలో ప్రవాస భారతీయులతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జిల్లాలోని చీమకుర్తి, ఇడుపులపాడు, కొల్లావారిపాలెంలో తొలుత శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చే పట్టినట్టు చెప్పారు. ప్రభు త్వం ప్రతి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలను నా టే కార్యక్రమంతో పాటు 50 సెంట్ల నుంచి రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఊరూరా ఉద్యాన వనం కార్యక్రమంలో భాగంగా పార్కులను ఏర్పాటు చేసే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులను కేటాయించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సహకారం తోపాటు గ్రామస్తులు కూడా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. గతంలో లేని విధంగా ఈఏడాది ఉపాధి పనులను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏపీడీ వీరావలి, ఎపీఓ రేణుక, జన్మభూమి కమిటీ సభ్యులు కొల్లా చంద్రం, స్థానిక నాయకులు అంచా సుబ్బారావు, దొప్పలపూడి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.


శ్మశాన వాటిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ పోలప్ప


బియ్యం బస్తాలను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దేవరపల్లి దళితవాసులకు బియ్యం పంపిణీ

పర్చూరు: దేవరపల్లి గ్రామంలోని భూవివాదానికి సంబంధించిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.5వేల విలువచేసే బియ్యాన్ని ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.నిషాంత్ నేతృత్వంలో అందజేశారు. ఈ సందర్భంగా నిషాంత్ మాట్లాడుతూ ఇటీవల మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి దళితవాడను సందర్శించిన సందర్భంగా, ఆమె ఆదేశాల మేరకు బాదిత కుటుంబాలకు బియ్యాన్ని అందజేసినట్లు నిషాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లంకా శివ, కార్యదర్శి పులిపాటి రవి, నాయకులు రమేష్, చంద్రశేఖర్, అంబేద్కర్ యూత్ ప్రతినిధి నలిగిల కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు తగ్గిన కౌలు

ఇంకొల్లు: గంగవరం గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ భూమి కౌలు వేలం పాట మంగళవారం ఆ దేవస్థాన ఆవరణలో దేవాదాయశాఖ అధికారి మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగింది. గతంలో మూడు సంవత్సరాల కాలవ్యవధికి భూమి సాగు చేసుకునేందుకు కౌలు వేలం పాట నిర్వహించగా పోటీపోటీగా 4.20 ఎకరాలకు ఒక్కో సంవత్సరానికి రూ.2.90లక్షలకు పాడుకున్నారు. అయితే, గతంలో పాడుకున్న పాటదారుడు కౌలు చెల్లించకపోవడంతో అధికారులు నోటీసులు జారీ చేసి కౌలు వేలాన్ని రద్దు చేశారు. తిరిగి మంగళవారం ఆ భూమికి కౌలు వేలం పాట నిర్వహించారు. మొత్తం పది మంది రైతులు దరావత్తు చెల్లించి పాటలో పాల్గొన్నారు. ఒక సంవత్సరకాలానికి జరిగిన కౌలు వేలంలో 4.20ఎకరాలకు దుగ్గిరాల శ్రీనివాసరెడ్డి అనే రైతు రూ.1.21లక్షలకు పాడుకున్నాడు. గతంలో జరిగిన పాటలో సంవత్సరానికి రూ.2.90 లక్షలు రాగా ఈ ఏడాది జరిగిన పాటలో రూ.1.21లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. సుమారు రూ.1.70లక్షల ఆదాయం తగ్గింది. పాట నిర్వహణలో అద్దంకి ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్, మాజీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక

చినగంజాం: ప్రజాసాధికార సర్వే ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేసి గృహాలను మంజూరు చేయటం జరుగుతుందని తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ అన్నారు. మండలంలోని కడవకుదురు ప్రాథమిక పాఠశాల, గొనసపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించారు. నివేశ స్థలాలు, గృహాలు లేనివారిని గుర్తించి అర్హులైనవారికి మంజూరు చేయటం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ప్రజాసాధికార సర్వే ఆధారంగా కడవకుదురులో 595 మందిని, గొనసపూడిలో 158 మందిని గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడవకుదురు, గొనసపూడి సర్పంచ్‌లు కత్తి లాజరు, బత్తుల కళ్యాణి, ఏఈ దుర్గారమేష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు

సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మీసుధ

పర్చూరు: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు విద్యతోపాటు మెరుగైన వసతులను కల్పించటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ అన్నారు. ఆదివాసి ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా గిరిజన వసతి గృహాల్లో విద్యార్థులకు ఆరోగ్య సేవలను అందించేందుకు చేపట్టిన గిరిజన విద్యార్థుల ఆరోగ్య లక్ష్యం కార్యక్రమ యాప్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. స్థానిక గిరిజన వసతి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 35 గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఆదివాసి ఆరోగ్యం ఏర్పాటు చేయాల్సి ఉండగా తొలుత పర్చూరులోని వసతి గృహంలో ప్రారంభించటం జరిగిందన్నారు. దీనికి సంబందించి ప్రతి వసతి గృహంలో ఒక ఏఎన్ఎంను కేటాయించటం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్య విషయాల సమాచారాన్ని యాప్ ద్వారా జిల్లా కేంద్రానికి అందించే విధంగా కార్యాచరణ రూపొందించటం జరిగిందన్నారు. విద్యార్థులకు మంచి నీటి వసతితోపాటు, కాస్మోటిక్ వస్తువులను కూడా అందించే విధంగా ప్రభుత్వం అదనంగా నిధులను కూడా కేటాయించినట్టు చెప్పారు.

జెడ్పీటీసీ దాసరి ఉషారాణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, ఆర్ఎంఎస్ఏ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, జోజయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసి ఆరోగ్య యాప్‌ను ప్రారంభిస్తున్న డీప్యూటీ డైరెక్టర్ లక్ష్మీసుధ

ఎంఆర్ టీకాతో రెండు వ్యాధులు దూరం


విద్యార్థినికి టీకా వేస్తున్న వైద్యాధికారి వీరాంజనేయులు

చినగంజాం: ఎం.ఆర్ టీకాతో రెండు రకాల వ్యాధులను దూరం చేయవచ్చునని చినగంజాం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.వీరాంజనేయులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆయన ఎం.ఆర్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలల నుండి 15సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారందరికి ఈ టీకాలను వేయించేందుకు పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. తట్టు, రూబెల్లాకు టీకాలు వేయటం అత్యంత సురక్షితమని అన్నారు. చినగంజాం జడ్పీ పాఠశాల, రాజుబంగారుపాలెం యూపీ పాఠశాల, పెదగంజాం జడ్పీ పాఠశాల, పల్లెపాలెం ప్రాథమిక పాఠశాల తదితర ప్రాంతాలలో 8 టీమ్‌ల ద్వారా ఎం.ఆర్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చినగంజాం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ప్రసాద్, చినగంజాం పీహెచ్‌సీ పీహెచ్ఎన్.ఝాన్సీరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.హరిప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలు అంజమ్మ, కోటేశ్వరి, ఆశా కార్యకర్తలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరు మండలంలోని నాగులపాలెం గురుకుల పాఠశాల, ఎస్.ఎఫ్.ఎస్, ఆక్స్‌బ్రిడ్జి, చెవిటీ మూగ పాఠశాలల్లోని 960 విద్యార్థులకు కారంచేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుకన్య నేతృత్వంలోని వైద్య సిబ్బంది చిన్నారులకు టీకా మందును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకన్య మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని తమ చిన్నారులకు వ్యాధులు సోకకుండా కాపాడుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొని చిన్నారులకు వైద్య సేవలను అందించారు.

యద్దనపూడి: 2020 నాటికి రాష్ట్రంలో రూబెల్లా లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని యద్దనపూడి ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి ఎలిమెంటరీ పాఠశాలలో టీకాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖాళీ కడుపుతో ఉన్న విద్యార్థులకు వ్యాక్సిన్ వేయరాదని, ఆహారం తీసుకున్న తరువాతే వ్యాక్సిన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుశీల, తిరుమలదేవి, శిరోమణి, హెచ్ఎం వెంకటనారాయణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం: వ్యవసాయశాఖ ద్వారా అందిస్తున్న రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎన్.మేరమ్మ అన్నారు. మండలంలోని సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓలు ఆమని, కృపాసిని, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో సొంత గృహాలు లేనివారు 2107మంది

ఇంకొల్లు: ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇంకొల్లు గ్రామంలో సొంత ఇళ్ళు లేని కుటుంబాలు 2107 ఉన్నట్లు హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఇంకొల్లులో సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి జాబితాలోని పేర్లను చదివి వినిపించారు. మరో 15మంది కొత్తగా గృహాలు నిర్మించుకునేందుకు అర్జీలు అందజేశారని ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. నక్కలపాలెంలో జరిగిన గ్రామసభలో తహసీల్దార్ లక్ష్మీకుమారి పాల్గొని సర్వే ప్రకారం తయారైన లబ్ధిదారుల జాబితాలో 142మంది పేర్లను చదివి వినిపించారు. కొత్తగా మరో పది అర్జీలు గృహాలు నిర్మించుకునేందుకు వచ్చాయన్నారు. కా ర్యక్రమంలో ఆ గ్రామసర్పంచ్ గొర్రెముచ్చు ఏశమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పరిశీలన



యద్దనపూడి: మండల పరిధిలోని పూనూరు, గన్నవరం మధ్య ఏర్పాటు చేసిన కల్వర్టు, చెక్‌డ్యాంలను డ్వామా పీడీ పోలప్ప, ఏపీడీ మస్తాన్‌వలి, యద్దనపూడి ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌డ్యాం వలన కలిగే ఉపయోగాలను రంగయ్యచౌదరి, సాంబయ్యలను అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగులకు బ్యాగుల పంపిణీ

చీమకుర్తి: పట్టణంలోని ఎస్‌కేఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు అనంద్ గ్రానైట్స్ ఎక్స్‌పోర్ట్సు జనరల్ మేనేజర్ డి. కోదండపాణి మంగళవారం బ్యాగులు పంపిణీ చేశారు. ప్రతినెలా ఒక దివ్యాంగ విద్యార్థికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అంజిరెడ్డి, హెచ్ఎం డి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు పూర్

- 'అమరావతి' పనుల్లో సర్వేయర్
- 'మీకోసం'కూ అధికారుల రాంరాం
- చీమకుర్తి మండల ప్రజల కష్టాలు

చీమకుర్తి : మండల ప్రజలకు రెవెన్యూ సేవలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. అధికారుల బాధ్యతా రాహిత్యంతో చిన్న పనికి ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి పదేపదే తిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా భూముల సర్వేకు సంబంధించిన దరఖాస్తులు ముందుకు కదలడం లేదు. భూముల వివరాల ఆన్‌లైన్‌కు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. సోమవారం అయినా అధికారులంతా అందుబాటులో ఉంటారని ఆశతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వారిని నిరాశే మిగులుతోంది. కనీసం మీకోసం కార్యక్రమాన్ని కూడా క్రమం తప్పకుండా నిర్వహించక పోతుండటంతో ప్రజలు తమ గోడును చెప్పుకునే అవకాశం లేకుండా పోయింది. సోమవారం తహసీల్దార్ గ్రామ సభలకు హాజరవడంతో మీకోసం నిలిచిపోయింది. వినతి పత్రాలు ఇద్దామని వచ్చిన ప్రజలు వెనుదిరిగి వెళ్లారు. తహసీల్దార్ ఇతర కార్యక్రమంలో ఉన్నప్పుడు మీకోసం నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న మిగిలిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అర్జీలు ఇవ్వటానికి వచ్చిన వారి పట్ల తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మీకోసంకు అన్ని శాఖల నుంచి అధికారులు హాజరు కావాల్సి ఉండగా సోమవారం ఒక్కరూ రాలేదు.

మండల ప్రజలను సర్వే కష్టాలు వెంటపడుతున్నాయి. తమ భూముల సర్వే నిమిత్తం చలనా కట్టి నెలలుదాటుతున్న సర్వే నిర్వహించకపోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక్కడి సర్వేయర్ మూడు నెలలుగా అమరావతి రహదారి సర్వే పనుల్లో ఉండటం ఇందుకు కారణమైంది. పెండింగ్ దరఖాస్తులు పెరిగిపోతున్నాయి. దీంతో భూమి ఆన్‌లైన్ ప్రక్రియకు సైతం బ్రేకులు పడుతున్నాయి. తక్షణమే సర్వే కష్టాలను తీర్చాలని ప్రజలు వేడుకొంటున్నారు.



చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం

నెల నుంచి తిరుగుతున్నా



నేను ఇంటి నిర్మాణం కోసం సర్వే అవసరమై మీసేవలో చలానా కట్టాను. నెల నుంచి సర్వేయర్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాను. కాని ఆయన కన్పించడం లేదు. మీకోసంలో ఫిర్యాదు చేద్దామనుకుంటే వినతి పత్రం తీసుకునే వారే లేరు.

- అంజిరెడ్డి, చంద్రపాడు

సర్వే ఇబ్బందులు నిజమే



సర్వేయర్ అందుబాటులో లేకపోవడం వలన ఇబ్బందులు తలెత్తాయి. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. బాధ్యతా రహిత్యంగా ప్రవర్తించే ఉద్యోగులను ఉపేక్షించాం. వారిపై చర్యలకు అధికారులకు సిఫారసు చేస్తాం.

- అశోక్ వర్ధన్, తహసీల్దార్


పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

సంతనూతలపాడు : పేర్నమిట్టలోని పోలేరమ్మ తిరునాళ్ల మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలేరమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కూడా తిరునాళ్ల జరగనుంది.

పాఠశాల ఆట స్థలం అభివృద్ధికి కృషి

మద్దిపాడు : ఇనమనమెళ్లూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలం అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో సిహెచ్. కృష్ణ అన్నారు. మంగళవారం పాఠశాల ఆట స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ క్రీడలకు అనువైన కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. అందుకోసం రూ. 4.50లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మండపల్లి శ్రీనివాసరావు, మొనపాటి రామకృష్ణ, సాక్షర భారతి కోఆర్డినేటర్ డొప్పా శేషయ్య, ఏపీవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

చీమకుర్తి : కంది పంట తొలి దశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో గోపీచంద్ రైతులకు సూచించారు. మంగళవారం పిడతలపూడి, రామచంద్రాపురం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

దళితులకు సంఘీభావంగా నిధి

చీమకుర్తి : దేవరపల్లి గ్రామ దళితుల పోరాటానికి సంఘీభావంగా అవసరమైన నిధిని సేకరించే కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. అంబేద్కర్ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ ఉపాధ్యక్షుడు పూసపాటి వెంకట్రావు, పి. ఆంజేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, శివ, అల్లాడి కోటేశ్వరరావు, రామారావు, రమణ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

నాగులుప్పలపాడు : పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సమితి కార్యకర్తలు రిలే దీక్షలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు మారెళ్ల శాంత ప్రారంభించిన ఈ దీక్షల్లో నాయకులు కొమ్మూరి గరటయ్య, మల్లెల ప్రసాద్, విజయకుమార్, క్రాంతి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

చీమకుర్తి: మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు చేస్తామని ఎంపీపీ మేదరమెట్ల ఈశ్వరమ్మ తెలిపారు. రామచంద్రాపురం, పల్లామల్లి, ఏలూరిపాలెంలో మంగళవారం జరిగిన సభల్లో ఆమె పాల్గొన్నారు. ప్రజాసాధికార సర్వేలో గృహాలు లేనట్లు నమోదైన వారి పేర్లను చదివారు. పల్లామల్లిలో 252, ఏలూరివారిపాలెంలో 77, రామచంద్రాపురంలో 138 మంది సంబంధించిన వివరాలను గ్రామ సభలో బేరీజు వేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ అశోక్‌వర్ధన్, సర్పంచ్‌లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

ఉప్పుగుండూరు (నాగులుప్పలపాడు): ఉప్పుగుండూరు పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో ఎస్.ఎం. శిలార్ మాట్లాడుతూ ప్రజా సాధికార సర్వే ఆధారంగా గృహాలు లేని వారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల్లో అటువంటి వారి పేర్లు చదివి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. మరోసారి సర్వే చేసి గృహాలు అవసరమైన వారి జాబితాలను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ చలమయ్య, గ్రామ సర్పంచ్ ఎం. పెద్దబ్బాయి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పర్తి సుబ్బారావు, జన్మభూమి కమిటీ సభ్యుడు బెల్లం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మాగులూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాలపాడులో..

మద్దిరాలపాడు పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ జి. సుజాత అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో సర్వే జాబితాను చదివి వినిపించారు. సర్పంచ్ స్వర్ణ చినవెంకట్రావు, కార్యదర్శి అరుణ, కృష్ణమూర్తి, కరీమా, వీఆర్వోలు అనూక, నాగరాజు పాల్గొన్నారు.

బూరేపల్లి కాలనీలో ...

మద్దిపాడు : మండలంలోని బూరేపల్లిలో జరిగిన సభలో తహసీల్దార్ కె.ఎల్. నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలు అవసరమైన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామస్థులు, వీఆర్వోలు పాల్గొన్నారు.


గ్రామ సభలో పాల్గొన్న చీమకుర్తి ఎంపీపీ ఈశ్వరమ్మ, అధికారులు

తట్టు, రూబెల్లాను తరమికొడదాం

చీమకుర్తి : తట్టు, రూబెల్లా వ్యాధులను తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ కొత్తపు రాఘవరావు కోరారు. స్థానిక సీపీఎస్‌లో ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కందిమళ్ల గంగాధరరావు కరస్పాండెంట్ ఎన్.ఎస్. ప్రకాష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైద్యుడు డాక్టర్ జవహర్ టీకాలు వేశారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : మీజిల్స్, రూబెల్లా వ్యాక్సినేషన్‌ను సంతనూతలపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీపీ మాదాల అనిత ప్రారంభించారు. తొలిరోజు సంతనూతలపాడు పీహెచ్‌సీ పరిధిలో 1780 మందికి, వేములపాడు పరిధిలో 1134 మందికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్. సునీల్‌రెడ్డి, ఎంఈవో ఎ. దయానంద్, డాక్టర్లు విజయ కుమార్, ప్రియంవద, డాక్టర్ ఎన్. రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు : ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని మద్దిపాడులో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడియాల యానాదయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సీహెచ్‌వో దీవెనమ్మ, ఏఎన్ఎంలు ఇందిర, శ్రీదేవి, దరియ తదితరులు పాల్గొన్నారు.


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న సంతనూతలపాడు ఎంపీపీ అనిత

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

ఒంగోలు వ్యవసాయం : నగరంలోని విద్యుత్‌శాఖ డీ 3, 2 సెక్షన్ల పరిధిలో ఈ నెల 2వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం సరఫరా నిలిపేస్తున్నట్లు నగర ఏడీఈ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ3 సెక్షన్ పరిధిలోని నాగేంద్రనగర్, మారుతీనగర్‌లు, సెక్షన్ డీ 2 పరిధిలోని అన్నవరప్పాడు, బాలాజీ నగర్, రంగా భవన్, అరవకాలనీ, తదితర ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పచ్చబొట్టేసినా...!





దుకాణాల బోర్డులన్నీ పచ్చరంగులోనే...



డివైడర్లకు వేసిన పచ్చ రంగు

- చర్చిసెంటర్ నుంచి సంఘమిత్ర వరకు పచ్చదనమే..!

- గ్రీన్‌బెల్టు ఏర్పాటుకు కార్పొరేషన్ చర్యలు

ఒంగోలు కార్పొరేషన్ : నగరంలోని చర్చి సెంటర్ నుంచి దక్షిణ బైపాస్ సంఘమిత్ర ఆసుపత్రి వరకు ఇకపై అంతా పచ్చదనమే కనిపించనుంది. గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి కోసం నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఆ మార్గంలోని రోడ్‌కు ఇరువైపులా వ్యాపార షాపుల బోర్డులన్నీ గ్రీన్ బ్యాక్ గ్రౌండ్, తెల్ల అక్షరాలు మాత్రమే ఉండాలని ఆదేశించింది. ప్రజలు ఆకట్టుకునే విధంగా ఫ్లెక్సీబోర్డులు, ఎల్ఈడీ లైటింగ్ బోర్డులు తొలగించాల్సిందేనని కార్పొరేషన్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాలుగైదు రోజులుగా ఆ రోడ్ మార్గంలో పచ్చరంగు ప్రజలను ఆకట్టుకుంటుంది. ఇదిలా ఉండగా కేవలం వ్యాపార ప్రకటనలకే పరిమితం కాకుండా, సెంటర్ డివైడర్స్‌కూ పచ్చ రంగులు వేసి, అందరినీ ఆకర్షించే విధంగా పూలు బొమ్మలు వేయడంతోపాటు, డివైడర్‌లకు మధ్యలో, రోడ్‌కు ఇరువైపులా పచ్చని మొక్కలు నాటుతున్నారు. గ్రీన్ బెల్టు పేరుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. నిర్దేశించినంత వరకు గ్రీన్‌బెల్ట్ రోడ్‌గా నామకరణం చేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. అంతే కాకుండా స్మార్ట్ సిటీలో భాగంగా నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్పు చేస్తామని కమిషనర్ సంకురాత్రి వెంకటకృష్ణ తెలిపారు. అందాల నగరం-ఒంగోలు సాధనకు నగర ప్రజలు సహకరించాలని కోరారు.

సిలిండర్ ధర పెంచడాన్ని ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని కుదించి నెలనెల సిలిండర్ ధర పెంచడాన్ని విరమించుకోవాలని సీపీఎం ఒంగోలు నగర కమిటీ కార్యదర్శి జీవీ. కొండారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కిరోసిన్, చక్కరపై కూడా సబ్సిడీని ఎత్తివేసిందని గుర్తు చేశారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం సరికాదని తెలిపాంపవు. ప్రజలపై మోపే భారాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

సూక్ష్మపోషకాలను ఉచితంగా అందజేస్తాం

ఒంగోలు రూరల్ : భూములలో లోపించిన సూక్ష్మపోషకాలను రైతులకు ఉచితంగా అందజేస్తామని ఏవో పి.వేణుగోపాల్ చెప్పారు. మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలలో లోపించిన సూక్ష్మపోషకాలైన బోరాన్, జింక్, జిప్సమ్‌లు ఉచితంగా రైతులకు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మక్కెన శ్రీనివాసరావు, ఏఈవో సుముద్రాల ఆదిమూర్తి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేసిన దామచర్ల

ఒంగోలు రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.30వేల చెక్కును గుండాయిపాలెంకు చెందిన పెద్దశింగు నాగవేణికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన స్వగృహంలో మంగళవారం అందజేశారు. జన్మభూమి కమిటీ సభ్యుడు శింగోతు హనుమయ్య, గుండాయిపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

532 మందికి వ్యాక్సిన్

ఒంగోలు రూరల్ : నగర పరిధిలోని వెంగముక్కపాలెం, పెళ్లూరు, చెరువుకొమ్ముపాలెం గ్రామాలలో తట్టు, పొంగు వ్యాధి నివారణకు 532 మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ వాణి చెప్పారు. మంగళవారం మూడు గ్రామాలలో ఆరు పాఠశాలల్లో ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఎంఈవో ఈ సాల్మన్, హెచ్ఈవో బి. నరసింహరావు, మరోఇద్దరు డాక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలో స్వచ్ఛ పక్షద

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలులోని డిఎస్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛ పక్షద కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డి. ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. యామిని అమ్మాజి స్వచ్ఛ శపథం చేయించారు. ఎన్ఎస్ఎస్ సభ్యులు ఎం. శ్రీనివాస్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు.

ప్రమాదవశాత్తు పెట్రోలు మంటలతో వ్యక్తికి గాయాలు

ఒంగోలు రూరల్ : కరవది ఎస్టీకాలనీలో ప్రమాదవశాత్తు పెట్రోలు మంటలో ఒక వ్యక్తి గాయాలపాలైన సంఘటన మంగళవారం జరిగింది. బాధితుడు ఏకకిరి కిషోర్ వివరాల మేరకు... ఆటో ట్యాంక్‌లో పెట్రోలు పోస్తుండగా ఓ వ్యక్తి బీడీ కాల్చినట్లు తెలిపారు. దీంతో ప్రమాదవశాత్తు పెట్రోలుకు మంటలు లేవటంతో శరీరం గాయాలపాలైందన్నారు. బాధితుడిని రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. దీనిపై ఒంగోలు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

థియేటర్	---	సినిమా
సత్యం	---	ఫిదా
రత్నమహల్	---	ఫిదా
గోపి	---	శమంతకమణి
సాయిసరోజ్	--	వైశాఖం
తులసీరాం	---	దండుపాళ్యం-2
జయరాం	---	రారండోయ్ వేడుకచూద్దాం

గోరంట్ల సినిమాస్ స్క్రీన్లలో----
వాసుకి, గౌతమ్‌నంద, నిన్నుకోరి

పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని వినతి

ఒంగోలు రూరల్ : నివేశన స్థలాలతోపాటు గృహాలు నిర్మించి ఇవ్వాలని గుండాయిపాలెం గ్రామ పేదలు కోరారు. మండలంలోని గుండాయిపాలెం, దేవరంపాడులో మంగళవారం నివాస గృహాలులేని వారిని గుర్తించడానికి గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా గుండాయిపాలెంలో పేదలు మాట్లాడుతూ అందరం సముద్రవేటపై ఆధారపడి జీవిస్తున్నామని, గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. దేవరంపాడు గ్రామంలో గృహాలు లేనివారిని 24 మందిని గ్రామసభ ద్వారా గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేవరంపాడులోని 24 మందికి ప్రభుత్వం నుంచి నివేశన గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. సాగి ప్రభావతికి వితంతు పెన్షన్ మంజూరు చేయిస్తానని సభలో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, సర్పంచ్ చుంచు దశరథరామయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, రంగారెడ్డి, వీఆర్వోలు సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు శింగోతు వెంకటేశ్వర్లు, జన్మభూమి కమిటీ సభ్యుడు శింగోతు ఎమాయ్య పాల్గొన్నారు. వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు.



వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

సూర్యవిద్యానికేతన్‌లో ద్రాక్షపండ్ల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కరస్పాండెంట్ వెంకటరామిరెడ్డి

ఒంగోలు కల్చరల్ : నగరంలోని అన్నవరప్పాడులోని శ్రీ సూర్య విద్యానికేతన్‌లో మంగళవారం ద్రాక్షపళ్ల దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ రామాల వెంకటరామిరెడ్డి కేక్ కోసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులలో చిన్నతనం నుంచే వివిధ రకాల పండ్లు వాటి ఉపయోగాలపై అవగాహన పెంచేందుకు విభిన్న రీతిలో నెలనెలా తమ పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధానోపాధ్యాయురాలు రంగనాయకమ్మ తన ప్రసంగంలో ద్రాక్షపళ్లలోని పోషక విలువల గురించి వివరించారు. రోజూ తీసుకుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అకడమిక్ డైరెక్టర్ బి.ఎస్.ఆర్.శాస్త్రి, కిడ్స్ వరల్డ్ ఇన్‌ఛార్జ్ ఫిలోమినా పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
13
ఒంగోలు
ప్రకాశం ● బుధవారం 2 ఆగస్టు 2017

విద్యార్థినుల గణనను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరించాలి

ఒంగోలు రూరల్ : ఒంగోలు మండలం ఉలిచి, కరవది పాఠశాలల సముదాయాలలో జరుగుతున్న విద్యార్థి గణనను జిల్లా సహాయ సర్వశిక్షా అభియాన్ సమన్వయకర్త వి. విద్యాసాగర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి గణనను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరించాలన్నారు. మండలంలోని సీఆర్పీలు అందరూ ప్రతి రోజూ బాధ్యతగా విద్యార్థి గణనను ఎంఆర్‌సీ ద్వారా జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి పంపాలని చెప్పారు. ఈ గణనను ఈ నెల 5వ తేదీలోపే పూర్తి చేయాలన్నారు.

మంచినీటి సమస్యలేకుండా ప్రణాళిక రూపొందించాలి

కలెక్టర్ వినయ్‌చంద్

కలెక్టరేట్ : నగరానికి భవిష్యత్తులో ఎలాంటి తాగునీటి కొరత లేకుండా పక్కా ప్రణాళికతో నీరందించాలని జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో నగరానికి తాగునీటి సరపరాపై మున్సిపల్, ప్రజారోగ్య శాఖ అధికారులు, ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ మోహన్ నగరంలో మంచినీటి సరఫరా విషయమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఏడు గుండ్లపాడు నుంచి 40 కోట్ల రూపాయలతో పైపులైన్ పనులు పూర్తి కావచ్చాయని, గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి పైపులైన్ పనులు, త్రోవగుంట వద్ద 10 ఎం.ఎల్ ది ఫిల్టరేషన్ ప్లాంటు 4 సర్వీసు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జనాభా 3లక్షల మందికి 35 ఎంఎల్‌టీ నీరు 3 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నామని, వచ్చే 2048 నాటికి అప్పటి జనాభా 5,15,00 మంది కోసం 100 ఎంఎల్‌టీ రోజూ అందించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.


కలెక్టర్ వినయ్‌చంద్

ఇందుకోసం టెండర్లు పిలిచామని, ఈ నెల 5వ తేదీన టెండర్లు తెరవనున్నామని వివరించారు. నగరంలో కొత్తగా కలుస్తున్న వెంగముక్కపాలెం, చెరువుకొమ్ముపాలెం, పెళ్లూరు, కొత్త మామిడిపాలెం గ్రామాలను కలుపుకుని అంచనాలు రూపొందించమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పైపులైన్ పనులు వేగవంతం చేసి నగరానికి ప్రతి రోజూ నీరందించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ బ్రహ్మయ్య, ప్రజారోగ్యశాఖ ఈఈ రామమోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ఏపీ జేఏసీ లక్ష్యం

- సీపీఎస్ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం

- అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు

ఒంగోలు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యలే ప్రధాన అజెండాగా పెట్టుకొని ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భవించిన అనతి కాలంలోనే ప్రభుత్వం ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగామని ఏపీ ఆ సంఘ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు మందిరంలో మంగళవారం సాయంత్రం సీపీఎస్ ఉద్యోగుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన అభినందన సభలో బొప్పరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ విషయాన్ని అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. మూడు నెలల కాలంలోనే సీపీఎస్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి జీవోలను తెచ్చామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే జీవోలు తీసుకురావడం సాధ్యమైందని చెప్పారు. తద్వారా రాష్ట్రంలో లక్షా87వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు మేలు జరగనుందన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలపు సమస్యతో పాటు ప్రభుత్వ వైద్యుల సమస్యలు ఇలా అనేక సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ కోసం కూడా కృషి చేస్తున్నామన్నారు. డీఆర్వో డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘం పటిష్ఠంగా ఉన్నప్పుడే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జేఏసీ జిల్లా చైర్మన్ కేఎల్ నరసింహారావు మాట్లాడుతూ బొప్పరాజు నాయకత్వంలో జిల్లాలో సంఘ బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అనంతరం సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శ్రీనివాసరావు, కేజీ నారాయణల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేసిన కేక్‌ను బొప్పరాజు కట్ చేశారు. అనంతరం డాక్టర్ల సంఘం నేత సుబ్బారావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో ఏపీ జేఏసీ అమరావతికి మద్దతు ప్రకటించారు. సమావేశంలో జేఏసీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటేశ్వరరెడ్డి, ఆల్‌ఫ్రెడ్, కే రాజ్‌కుమార్, షేక్ అబ్దుల్‌బషీర్, పి. రాము, వైపీ రంగయ్య, సత్యనారాయణ, కేశవులు నాయుడు పాల్గొన్నారు. అనంతరం బొప్పరాజును ఘనంగా సత్కరించారు.


బొప్పరాజును సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

● వర్షం ఇక్కట్లు


కౌన్సెలింగ్ ప్రాంతంలో నిలిచిన వర్షపు నీటిలోనే టీచర్లు


కౌన్సెలింగ్ హాలులో నీరు కారుతుండడంతో పెట్టిన బకెట్లు

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కమ్మపాలెం, గోపాలనగర్ సంతపేట, కలెక్టరేట్, రామ్‌నగర్, భాగ్యనగర్, హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. మురుగుకాలువలు కొంచెం సేపు పొంగి ప్రవహించాయి. పాత జడ్పీ కార్యాలయంలో టీచర్ల కౌన్సిలింగ్ సమయంలో భారీ వర్షం కురవడంతో వందల సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడ్డారు. కౌన్సెలింగ్ హాలులో కూడా వర్షపు నీళ్లు కారాయి. అంతేగాక టెంట్లు పక్కకు ఒరిగాయి. బయట ఆవరణంతా నీరు నిలిచింది. దీంతో ఉపాధ్యాయులు ఆ నీళ్లలోనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

-ఫొటోలు సర్వేశ్వరరావు


జలమయమైన వీధుల్లోనే ప్రయాణం

కరాటేలో 'సాయిబాబా' విద్యార్థుల ప్రతిభ



ఒంగోలు కలెక్టరేట్ : నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర కరాటే కుంగ్‌ఫూ పోటీలలో సాయిబాబా సెంట్రల్ స్కూలు విద్యార్థులు పలు పతకాలు సాధించారు. కే సహస్రరెడ్డి, ఎన్ భార్గవ నారాయణ గుప్తా కాటాలో బంగారు పతకం, ఎన్ చోదిత్ నారాయణ గుప్తా కుమితే విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా స్కూలులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

4నుంచి సీపీఐ శాఖ కార్యదర్శుల శిక్షణ తరగతులు

ఒంగోలు కలెక్టరేట్ : సీపీఐని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ఈనెల 4వతేదీ నుంచి మూడు రోజుల పాటు కందుకూరులో ఆ పార్టీ శాఖ కార్యదర్శుల శిక్షణా తరగతులు జరుగుతాయని జిల్లా కార్యదర్శి కే అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులను రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని, ఉపాధ్యాయులుగా బి. రామయ్య, మీసాల సత్యనారాయణ, ఎంసీ వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. 5వ తేదీన జరిగే శిక్షణా కార్యక్రమంలో పి. వెంకటరత్నం, కే రాజశేఖర్, ఎం వెంకయ్యలు పాల్గొంటారని, 6వ తేదీన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. వెంకయ్యలు పాల్గొంటారని అరుణ తెలిపారు. జిల్లాలోని సీపీఐ శాఖ కార్యదర్శులుందరూ పాల్గొనాలని అరుణ కోరారు.

ఆర్టీసీలో 22 మందికి ఏడీసీలుగా ఉద్యోగోన్నతులు

ఒంగోలు వ్యవసాయం : ఆర్టీసీ ప్రకాశం రీజియన్‌లో కండక్టర్లు, డ్రైవర్లుగా పనిచేస్తున్న 22మందికి అసిస్టెంట్ డిపో క్లర్క(ఏడీసీ)లుగా మంగళవారం ఉద్యోగోన్నతుల ఉత్తర్వులను రీజనల్ మేనేజర్ కె.ఆదాం సాహెబ్ జారీ చేశారు. వారిని వెంటనే విధుల్లో చేరాల్సిందిగా పేర్కొన్నారు

రెండేళ్లలో చేసే పనులు రెండు నెలల్లోనే పూర్తి చేశా

- ఆర్అండ్‌బీ రిటైర్డు ఎస్‌ఈ నాగమల్లు

ఒంగోలుకర్నూల్‌రోడ్డు : జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పనులను రెండు నెలలోనే పూర్తి చేయించామని ఆర్అండ్‌బీ రిటైర్డు ఎస్‌ఈ బత్తిన నాగమల్లు చెప్పారు. జిల్లా ఆర్అండ్‌బీ ఎస్‌ఈ, ఒంగోలు డివిజన్ ఈఈ బి. నాగమల్లు ఈనెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు, ఒంగోలు డివిజన్ కార్యాలయ ఉద్యోగులు, అధికారులు స్థానిక రామనగర్‌వద్ద గల హెచ్‌ఎం ఫంక్షన్‌హాలులో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగమల్లు మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకంగా ఒంగోలు డివిజన్‌లో ఎవరూ ఊహించని విధంగా తీర ప్రాంతాలకు వెళ్లే రోడ్లతోపాటు ఇతర ప్రాంతాలలో 18 బ్రిడ్జీలు మంజూరు చేయించామన్నారు. అవి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. అలాగే రూ25 కోట్లతో ఒంగోలు నుంచి సంతనూతలపాడు వరకు ఫోర్‌లైన్స్ రోడ్డు నిర్మాణానికి అగ్రిమెంట్ కూడా అయిందన్నారు. రూ.25కోట్లతో ఒంగోలు - కొత్తపట్నం రోడ్డు కూడా డబుల్‌లైన్ రోడ్డుగా నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్‌ఈగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే రెండేళ్లకాలంలో పూర్తి కావాల్సిన పనులు పూర్తి చేయించామన్నారు. కార్యక్రమంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దూబగుంట రమేష్‌బాబు, ఎస్‌ఈ కార్యాలయం హెచ్.డి. రవిప్రకాష్, ఎస్‌ఈ పున్నారావు మర్కాపురం, కనిగిరి ఈఈ, రిటైర్డు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



నాగమల్లు దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు